ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 02.05.2026 | సంపుటి : 12 సంచిక : 282 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## నేడు దేశవ్యాప్తంగా అన్ని ఫోన్లకు అలర్ట్

న్యూఢిల్లీ(జనంసాక్షి): జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం దేశవ్యాప్తంగా సెల్ బ్రాడ్‌కాస్ట్ అలర్ట్ వ్యవస్థ పరీక్షను నిర్వహించనున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, రాజధాని నగరాల్లో ఈ పరీక్ష చేపట్టనున్నారు. సరిహద్దు ప్రాంతాలు, ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో దీనికి మినహాయింపునిచ్చారు. పరీక్ష సమయంలో ప్రజలకు తమ మొబైల్ ఫోన్లలో అత్యవసర అలర్ట్ నోటిఫికేషన్ వస్తుంది. గట్టిగా శబ్దం లేదా వైబ్రేషన్‌తో ఇది రావచ్చు. అలర్ట్ వ్యవస్థ సమర్థతను పరీక్షించేందుకు పంపించే సందేశం ఇదని.. ఎలాంటి అత్యవసర పరిస్థితి లేదని అధికారులు వివరించారు. అత్యవసర సమయాల్లో కీలక సమాచారాన్ని వేగంగా ప్రజలకు చేరవేయడమే దీని ప్రధాన ఉద్దేశమని తెలిపారు



## ఆర్టీసీ విలీనం.. గుర్తింపు ఎన్నికలపై సమగ్ర కార్యాచరణతో

# రండి.. చర్చిద్దాం

**ముఖ్యమంత్రి రేవంత్‌తో ఆర్టీసీ జేఏసీ నాయకుల భేటి**

**సమ్మెకాలపు వేతనం, కేసులు ఎత్తివేయాలని సీఎం ఆదేశం**

- పీఆర్సీ అంశాన్ని మేం పరిష్కరిస్తాం
- ఒక డ్రైవర్‌నూ ఉద్యోగం నుంచి తొలగించం
- ఆర్టీసీ బకాయిలు మా ప్రభుత్వ హయాంలోని కావు
- కానీ వాటిని చెల్లించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నాం
- డీజిల్ భారం తగ్గించేందుకే తగ్గింపునకే ఈవీల వైపు
- గాజులరామారం, బహదూర్‌గూడలో బస్ టెర్మినళ్లు
- ఉద్యోగులు, మేనేజ్‌మెంట్ మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలి
- ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులతో సీఎం రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి): ఆర్టీసీ మనుగడ, గౌరవాన్ని పెంపొందించి ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు రావాలని కార్మిక సంఘాల ప్రతినిధులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై అన్ని సంఘాల నాయకులు సమావేశమై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. పీఆర్సీ అంశాన్ని తాము పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ఉన్నతా ధికారులతో ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి నివాసంలో శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఎన్నికలు, మిగతా 2లో..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులు →





ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారు శివధర్‌రెడ్డి

## ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంతో చిత్తశుద్ధి చాటాం

- సంస్థకు అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం
- మేడే ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్

2లో..

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఏఐ సాంకేతికత

- రైతు డిస్కంలో చేరికపై ఉద్యోగులు, సిబ్బందికి ఉన్న అపోహలు తొలగించాలి
- సబ్ స్టేషన్స్ పక్కనే సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి
- విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష

వార్త 2 లో



## కమర్షియల్ గ్యాస్ గుదిబండ

- 19 కిలోల వాణిజ్య సిలిండర్‌పై ఏకంగా రూ.993 పెంపు
- హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై తీవ్ర భారం
- పెంపును సమర్థించుకున్న పెట్రోలియంశాఖ సహాయ మంత్రి

### ఇంత మోసమా?

- ఎన్నికలు అయిపోగానే ధరలు పెంచుతారు
- ఇది మోడీకి అలవాటుగా మారింది
- కేంద్రం సామాన్యుడి నడ్డి విరిచింది
- వాణిజ్య గ్యాస్ ధర ఏకంగా రూ.993లకు పెంచడం దుర్మార్గం
- కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్

### ముందే చెప్పాం కదా

- ధరలపై ప్రజలను హెచ్చరించాం
- గ్యాస్ ధరల పెంపు..ఎలక్షన్ బిల్లు
- పెట్రోల్, డీజిల్ బాదుడుకూ సిద్ధంగా ఉండాలి
- కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శలు

ఎన్నికల తరవాత ధరలు పెంచడం

### మోడీకి అలవాటే

గ్యాస్ ధరలను పెంచడంపై మండిపడ్డ కేటీఆర్

వివరాలు 2వ పేజీలో..

న్యూఢిల్లీ(జనంసాక్షి): పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాల ప్రభావం భారత్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. ఇందనం సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చమురు నౌకలను దిగ్బందించారు. ఈ క్రమంలో కొరత అనివార్యంగా మారింది. ఈ క్రమంలో ముఖ్యంగా వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే 19 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. మిగతా 2లో..

### పెట్రోల్, డీజిల్ ధరల పెంపునూ తోసిపుచ్చలేం..

స్పష్టం చేసిన ప్రభుత్వ వర్గాలు

2లో..

## కుటుంబాన్ని మింగేసిన అతివేగం

- ఆగివున్న లారీని ఢీకొన్న కారు
- ఆరుగురు అక్కడిక్కడే మృతి..మరొకరి పరిస్థితి విషయం
- ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర ప్రమాదం
- మృతులంతా యాదగిరిగుట్ట వెళ్లి వస్తుండగా ప్రమాదం

శంషాబాద్(జనంసాక్షి): శంషాబాద్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. లారీ వెనుక భాగంలో కారు ఇరుక్కుపోయి, నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంపై మిగతా 2లో..



## పసుపును ఆహార పంటగా గుర్తించాలి

- క్వింటాల్ కు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించాలి
- తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

## రెండేళ్లు ఆగితే మళ్లీ అధికారం బీఆర్ఎస్‌దే

- రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వం
- సిగాచిలో 60 మంది చనిపోతే దిక్కులేకుండా పోయింది
- 120మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారు : కేటీఆర్

## స్కామ్ రోడ్ల టెండర్లలో గోల్‌మాల్

- ఎక్సెస్ టెండర్లతో దోచుకునే ప్లాన్
- వెంటనే రద్దు చేయాలి: హరీశ్

వివరాలు 2వ పేజీలో..

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

**ఈ సమస్యను జూన్ 2 నాటికి ఒక కొలిక్కి తీసుకొస్తాం**

- న్యాయపరమైన చిక్కుల్లేకుండా పరిష్కరిస్తా
- ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్‌తో పాటే అందరికీ స్థలాలు
- ఫ్యూచర్‌సిటీలో ఇవ్వడానికి సీఎం రేవంత్ అంగీకారం
- జర్నలిస్ట్ సంఘాలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్,మే1(జనంసాక్షి):అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీ, చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పలు సందర్భాలలో ఇచ్చిన హామీల మేరకు అందరి అభిప్రాయాలను సేకరించి వచ్చేనెల 2వ తేదీనాటికి ఒక కొలిక్కి తీసుకువస్తామని వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్, జర్నలిస్ట్స్ హౌసింగ్, డెక్కన్ జర్నలిస్ట్స్, తెలంగాణ హౌసింగ్ సొసైటీలతో మంత్రి సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలు ఎప్పుడు ఏర్పాటయ్యాయి, అందులో సభ్యుల సంఖ్య, సభ్యత్వానికి అర్హతలు, ఇతర అన్ని అంశాలపై మంత్రి సొసైటీ మిగతా 2లో..

## వడగాలులపై హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్

- తాగునీటి సమస్య రాకుండా చూడాలి
- చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు. ఓఆర్ఎస్ ప్యాకెట్ల సరఫరా
- ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగితే 15 రోజుల్లో నివేదికలు
- 20 విభాగాలతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

2లో..





## దేశంలో పటిష్టంగా తెలంగాణ పోలీసింగ్

- నేర నియంత్రణలో ఆధునిక టెక్నాలజీ వినియోగం
- నేరగాళ్ల టెక్నాలజీ సవాల్‌గా మారింది
- డ్రగ్స్ నియంతరణకు మరింత కఠిన చర్యలు
- డీజీపీగా సీవి ఆనంద్ బాధ్యత స్వీకరణ

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పోలీసు ఉన్నతాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. కార్యాలయ ఆవరణలో పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనాలతో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా మిగతా 2లో..

## మళ్లీ ఇరాన్‌పై యుద్ధానికి కాలుదువ్వుతున్న అమెరికా

- 24 గంటల్లో ఇజ్రాయెల్‌కు 6500 టన్నుల సైనిక సామగ్రి..
- మరోసారి భీకర దాడులకు అగ్రరాజ్యం సిద్ధమవుతోందనే సంకేతాలు



వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అమల్లోకి ఉన్నప్పటికీ ఇరుదేశాల పరస్పర హెచ్చరికలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల వేళ అమెరికా నుంచి ఇజ్రాయెల్‌కు భారీగా సైనిక సామగ్రి చేరుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇరాన్‌పై మరోసారి భీకర దాడులకు అగ్రరాజ్యం సిద్ధమవుతోందనే సంకేతాలు కన్పిస్తున్నాయి.ఇటీవల 24 గంటల వ్యవధిలోనే అమెరికా నుంచి 6500 టన్నుల సైనిక సామగ్రి అందినట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. రెండు కార్గో నౌకలు, పలు విమానాల్లో ఈ సామగ్రి వచ్చింది. ఈ కార్గో నౌకలు అష్‌దోద్, హైఫా పోర్టుల్లో ఉన్నాయి. వీటిల్లో భూతల, గగనతల దాడులకు వినియోగించే ఆయుధాలు, మందుగుండు సామగ్రి, మిలిటరీ ట్రక్కులు, జాయింట్ లైట్ టాక్టికల్ వెహికల్స్ వంటివి ఉన్నాయి. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై తాము చేపట్టిన 'ఆపరేషన్ రోరింగ్ లయన్' ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 1,15,600 టన్నుల సైనిక సామగ్రిని అమెరికా పంపించినట్లు ఇజ్రాయెల్ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఏ క్షణమైనా శత్రువులను ఎదుర్కొనేందుకు తమ సైన్యం సిద్ధంగా ఉందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ పేర్కొనడం గమనార్హం.

**ట్రంప్ ముందుకు కొత్త ప్లాన్..**

మరోవైపు, ఇరాన్‌పై సైనిక చర్యకు సంబంధించిన అమెరికా సెంట్రల్ కమాండ్ కొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. వీటిని ఇప్పటికే అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మిగతా 9లో..

## కొడుకును కాపాడేందుకు కడదాకా పోరాటం

**దురదృష్టవశాత్తు ఇద్దరూ మృతి**

- నాలుగేళ్ల కొడుకును అదిమిపట్టుకుని మృతి చెందిన మహిళ
- మధ్యప్రదేశ్ బోటు ప్రమాదంలో హృదయ విదారక దృశ్యం
- ఘటనలో ఇప్పటి వరకు 9 మంది మృతదేహాలను వెలికితీత



భోపాల్(జనంసాక్షి):కళ్ల ముందు మృత్యువు కనిపిస్తున్నా కన్న కొడుకును కాపాడుకునేందుకు ఆ తల్లి చివరిక్షణం వరకూ తల్లడిల్లింది. మరణం అంచున ఉన్నా.. ఆ పసివాడిని గుండెలకు హత్తుకుని రక్షించే ప్రయత్నం చేసింది. కానీ, మిగతా 2లో..



## బెంగాల్లో రీపోలింగ్

- రెండు నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ బూతుల్లో నేడు ఎన్నిక
- కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం
- ఈవీఎం ట్యాంపరింగ్ ఆరోపణలు తోచిపుచ్చిన ఈసీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కొన్నిచోట్ల అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదులపై భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. రెండు నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. మగ్రహత్ పశ్చిమ్ నియోజకవర్గంలోని 11, డైమండ్ హార్బర్ నియోజకవర్గంలోని 4 పోలింగ్ బూత్‌లలో మే 2న శనివారం రీపోలింగ్ మిగతా 9లో..

## సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ప్రభుత్వానికి, ప్రజలకు వారధి ఉద్యోగులే
- ఉద్యోగ సంఘాలతో డిప్యూటీ సీఎం భట్టి భేటీ

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. శుక్రవారం సాయంత్రం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులతో ఆయన సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగుల విన్నపాలను సావధానంగా విన్న ఆయన, వారి సమస్యలపై సానుకూల హామీ ఇచ్చారు.ఉద్యోగుల సేవలను కొనియాడుతూ ఉప ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. "ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఉద్యోగులు ఒక వారధిలా పనిచేస్తున్నారు. మిగతా 2లో..





మల్టీజోన్-2 ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఐజీపీ)గా బాధ్యతలు చేపట్టిన షానవాజ్ ఖాసిం, ఐపీఎస్



ఎంసీహెచ్ఆర్‌డీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన దృశ్యం



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎంసీహెచ్ఆర్‌డీలో మర్యాదపూర్వకంగా కలిసిన నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐపీఎస్ అధికారులు తరుణ్ జోషి, సుమతి, డీఎస్ చౌహాన్ , శిఖా గోయల్, అవినాష్ మహంతి



సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకం గా కలిసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (బీసీ వెల్ఫేర్)వి హనుమంత రావు

# సీఎంతో ఆర్టీసీ జేఏసీ నాయకుల భేటి

విలీనంపై ఏవిధంగా ముందుకు పోవాలనే దానిపై సంఘాల నాయకులు సమావేశమై ప్రభుత్వం ఎదుట ఆప్షన్లు ఉంచాలని సూచించారు. ఒకవేళ యూనియన్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే ఏ యూనియన్‌కు ఆ యూనియన్ తమ ఆప్షన్లు ఇస్తే కామన్‌గా ఉన్న వాటికి ఆమోదం తెలిపి.. భిన్నాభిప్రాయాలు ఉన్న వాటిపై చర్చిద్దామని సీఎం అన్నారు. ఆర్టీసీ బకాయిలు తమ హయాంలోని కావని.. కానీ వాటిని చెల్లించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల నిధులను వాడుకుందని సీఎం గుర్తు చేశారు. ఆర్టీసీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. సమస్యల శాశ్వత పరిష్కారానికి అంతా కలిసిరావాలని, భావోద్వేగాలు, రాజకీయాల ప్రభావాలకు లోనైతే సంస్థకు నష్టం వాటిల్లుతుందని సీఎం అన్నారు.ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వం వేర్వేరనే భావన తమకెప్పుడూ లేదన్నారు. 2006లో జడ్పీటీసీ సభ్యునిగా గెలిచినప్పటి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, అధ్యక్షునిగా ఉన్న సమయంలో ఆర్టీసీ కార్మికులు చేసిన పోరాటాల్లో పాలుపంచుకున్నానని సీఎం గుర్తు చేశారు. సింగరేణి, విద్యుత్ కార్మికులతో పాటు ఆర్టీసీ కార్మికులు బలంగా కోరుకున్నందునే తాము అధికారంలోకి వచ్చామని సీఎం తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీలో నియామకాలు చేపట్టడంతో పాటు బస్సుల సంఖ్యను పెంచామని, కారుణ్య నియామకాలు చేప్టటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని.. నెలా నెలా చెల్లింపులతో ఆర్టీసీ ఆదాయం పెరిగిందని సీఎం అన్నారు. పని భారం పెరిగినా క్షేత్ర స్థాయి సిబ్బంది సహనంతో పని చేస్తుండడంతో తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలిచిందని సీఎం పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంత ప్రయాణికుల సౌకర్యం కోసం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బస్ టెర్మినళ్లు నిర్మించడానికి ఆర్టీసీకి గాజులరామారంలో వంద ఎకరాలు కేటాయించామని, బహదూర్‌గూడ (శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో)లో 150 ఎకరాలు కేటాయిస్తామని సీఎం తెలిపారు. ఆర్టీసీని సమున్నత స్థానంలో నిలపాలనే లక్ష్యంతోనే ఈ టెర్మినళ్ల నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల నుంచి డిమాండ్ లేకపోయినా తామే స్వయంగా ఈ నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు. ఆర్టీసీలో డీజిల్‌కు ఏటా రూ.2 వేల కోట్లు వ్యయం చేస్తున్నారని.. ఆ వ్యయం తగ్గింపునకే తాము ఈవీల వైపు మొగ్గుచూపుతున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదాయం పెరగాలంటే ఖర్చు తగ్గించుకోవాలని, దీనికి పక్కా ప్రణాళిక అవసరమని సీఎం అన్నారు. 1000 ఈవీ బస్సులు కొనుగోలు చేసి మెట్రో, ఎంఎంటీఎస్‌తో అనుసంధానం చేసి లాస్ట్ మైల్ కనెక్టివిటీకి కృషి చేస్తామని సీఎం తెలిపారు. అధిక వడ్డీలకు తెచ్చిన అప్పులను రీకన్‌స్ట్రక్షన్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సంస్థను బలోపేతం చేసుకుని నిలబెట్టుకోవడానికి కార్మికులు సహకరించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

## ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంతో చిత్తశుద్ధి చాటాం

సిద్దిపేట,మే1(జనంసాక్షి):ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గత ప్రభుత్వం మాదిరి వారు సమ్మె పట్టించుకోకుండా ఉండలేదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని తెలిపారు. 140 సంవత్సరాలుగా ఏదో ఒక హక్కు డిమాండ్‌తో మేడే నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్టీసీ బస్సు డిపోలో నిర్వహించిన మేడే ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్‌కి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు సమ్మెకు వెళ్తే వారి ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి వర్గం కార్మిక సంఘాలతో చర్చించి పలు అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకున్నామని ప్రస్తావించారు. ఈ సమావేశంలో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాల ఎన్నికలు, కార్మికులకు 11 శాతం పీఆర్సీ ప్రకటించామని స్పష్టం చేశారు. త్వరలోనే కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పక్రియను గుర్తింపు పొందిన సంఘం అధికారుల కమిటీ పూర్తి చేస్తుందని తెలిపారు. ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా తాము వ్యవహరిస్తున్నామని అన్నారు. ఆర్టీసీపై ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, కేబినెట్ మంత్రులు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. హైదరాబాద్‌లో కొత్తగా 380 రూట్‌లలో కొత్తబస్సులు నడుస్తున్నాయని చెప్పుకొచ్చారు. 7 లక్షల మంది ప్రయాణికులకు కనెక్టివిటీ పెంచామని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రవాణా శాఖ మంత్రిగా.. ప్రభుత్వానికి వారధిగా ఉంటానని స్పష్టం చేశారు. హక్కుల కోసం ఏవిధంగా పోరాడామో సంస్థ అభివృద్ధికి కార్మికులు సమష్టిగా పనిచేయాలని సూచించారు.

## రెండేళ్లు ఆగితే మళ్లీ అధికారం బీఆర్ఎస్‌దే

హైదరాబాద్(జనంసాక్షి):ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సరైన పని దినాలు, వసతులు కల్పించక ఇబ్బందులపాలు చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి మేడే శుభాకాంక్షలు తెలిపారు.సఫాయిాల శ్రమను.. సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక సర్కార్ నడుస్తోంది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు కాంగ్రెస్ బాధితులయ్యారు. మంత్రుల జీతాల్లో కోత వేసి ఇస్తామనడానికి వాళ్లు వరద బాధితులా అని అన్నారు. రాష్ట్రంలో 120 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించడం లేదు. రెండేళ్లు భరించండి.. కేసీఆర్ వచ్చి కార్మికులకు మేలు చేస్తారని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు చేతినిండా పని కల్పించి ఆదుకున్నదని, నగరంలో రోడ్లు, వంతెనల నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. కోవిడ్ సమయంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు కార్మికులకు ఉచిత రైళ్లను కేసీఆర్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి వల్ల, అసమర్ధత వల్ల ఎస్ఎల్‌బీసీ కుప్పకూలిపోయి చనిపోయిన కార్మికులను అప్పగించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా సిగాచీ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగి 60 మంది సజీవదహనం అయితే పట్టించుకున్న నాథులే లేరని దుయ్యబట్టారు.

## స్కామ్ రోడ్ల టెండర్లలో గోల్‌మాల్

హైదరాబాద్(జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పలు టెండర్లపై బీఆర్ఎస్ నేత మాజీ, ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. గత అసెంబ్లీ సమావేశాల వేళ తాను ప్రస్తావించిన హ్యామ్ రోడ్ల స్కామ్ ఇప్పుడు నిజమైందని అన్నారు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ శాఖల్లో 22 నుంచి 25 శాతం వరకు ఎక్సెస్ టెండర్లు వచ్చాయని ఆరోపించారు. ఆర్ అండ్ బీ శాఖలో రూ.11 వేల కోట్ల టెండర్లకు దాదాపు రూ.15 వేల కోట్ల వరకు వ్యయం పెరిగిందని, పంచాయతీ రాజ్ శాఖలో రూ.6 వేల కోట్ల టెండర్లు రూ.8 వేల కోట్లకు చేరుతున్నాయని విమర్శించారు. ఈ రెండు శాఖల్లో కలిపి వేల కోట్ల రూపాయల అదనపు భారం రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై పడుతోందని హరీశ్ రావు పేర్కొన్నారు. జాతీయ రహదారుల టెండర్లు తగ్గింపుతో జరిగితే.. రాష్ట్ర రహదారుల టెండర్లు మాత్రం ఎక్సెస్‌కు వెళు తున్నాయని మండిపడ్డారు. టెండర్లలో 40 శాతం రాష్ట్ర ఖజానా నుంచి వెళ్తే మిగిలిన 60 శాతం కాంట్రాక్టర్లు బ్యాంకు రుణాల ద్వారా సమకూర్చు కుంటారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ రుణాలను 15 సంవత్సరాల పాటు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. అయితే, కాంట్రాక్టర్లకు ప్రభుత్వం సావరిన్ గ్యారెంటీ ఇస్తోందని, దీని భారం చివరకు ప్రజలపైనే పడుతుందని మాజీ మంత్రి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో 5 శాతం కంటే ఎక్కువ ఎక్సెస్ టెండర్లు లేవని హరీశ్ రావు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆర్ అండ్ బీ శాఖలో 34 ప్యాకేజీలు, పంచాయతీ రాజ్‌లో 17 ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారని.. ఒకే కంపెనీకి 15 టెండర్లు దక్కబోతున్నాయని ఆరోపించారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఏఐ సాంకేతికత

**హైదరాబాద్(జనంసాక్షి):**విద్యుత్ శాఖ లో సరఫరా లోపాలు, మెరుగైన విద్యుత్ సరఫరాకు ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (రైతు డిస్కం) లో చేరిక పై ఉద్యోగులు, సిబ్బందికి ఉన్న అపోహలు తొలగించాలన్నారు. ట్రాన్స్ఫర్మర్లపై ఓవర్ లోడ్ పడకుండా చూడాలని ఆదేశించారు. రాష్ట్రంలో నూతన పారిశ్రామిక వాడలు, హైస్పీడ్ రైల్ కారిడార్లు, ట్రిపుల్ ఆర్ వంటి డెవలప్మెంట్ నేపథ్యంలో డిమాండ్ కు తగిన విద్యుత్ సరఫరాకు అవసరమైన సబ్ స్టేషన్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలి. గ్రీన్‌ఎనర్జీ పాలసీలో భాగంగా ప్రాధాన్యక్రమంలో దరఖాస్తులు పెట్టుకున్న వారికి అనుమతులు ఇవ్వాలన్నారు.భారీ డాటా సెంటర్లకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. సోలార్ పవర్ పైన స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలని, సబ్ స్టేషన్స్ పక్కనే సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి పైలట్ ప్రాజెక్ట్ కింద భూమి అందుబాటులో ఉన్న చోట ఉమ్మడి జిల్లాలో రెండు సబ్ స్టేషన్ల పక్కన సోలార్ పవర్ ప్లాంట్లు నెలకొల్పాలని తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టే 18 సోలార్ పవర్ ప్లాంట్లు (హైదరాబాద్ మినహా ఉమ్మడి తొమ్మిది జిల్లాల్లో జిల్లాకు రెండు చొప్పున) నిర్మాణానికి నోడల్ అధికారులను నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సోలార్ స్టవ్ ల వినియోగంపై అవగాహన పెంచాలి. ఈ సమీక్షకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిత్తల్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్ సీఎండీలు హాజరయ్యారు.

## కొడుకును కాపాడేందుకు కడదాకా పోరాటం

ఆమె పోరాటం ఫలించలేదు. కుమారుడిని కాపాడుకోలేక ఆ తల్లి కన్నీళ్లు ఆమెతో పాటే కడలిలో కలిసిపోయాయి. మధ్యప్రదేశ్ బోటు ప్రమాదంలో కన్పించిన ఈ హృదయ విదారక దృశ్యం అక్కడి వారిని కంటతడి పెట్టించింది.జబల్‌పూర్‌లోని బర్గి డ్యామ్‌లో గురువారం సాయంత్రం పడవ బోల్తా పడిన ఘటనలో పలువురు గల్లంతైన సంగతి తెలిసిందే. వారికోసం శుక్రవారం ఉదయం కూడా సహాయక చర్యలు కొనసాగాయి. ఈ క్రమంలోనే ఓ తల్లీబిడ్డల మృతదేహాలను రెస్క్యూ సిబ్బంది గుర్తించి నీటి నుంచి వెలికితీశారు. నాలుగేళ్ల చిన్నారిని తల్లి అదిమిపట్టుకోగా.. వారి చుట్టూ లైఫ్ జాకెట్ ఉంది. నీటిలో మునిగిపోయే సమయంలో కుమారుడిని కాపాడటం కోసం ఆ తల్లి పడిన వేదనను తలుచుకుని అక్కడున్న వారు కదిలిపోయారు.

పడవను వెనక్కి తిప్పమని చెప్పినా..

జబల్‌పూర్ జిల్లాలోని నర్మదా నదిపై ఈ బర్గి డ్యామ్‌ను నిర్మించారు. ఈ రిజర్వాయర్‌లో గురువారం సాయంత్రం 29 మంది ప్రయాణికులు, ఇద్దరు సిబ్బందితో వెళ్తున్న క్రూజ్ బోట్ తిరగబడింది. ప్రతికూల వాతావరణం కారణంగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధరించారు. బలమైన గాలుల వల్ల రిజర్వాయర్‌లో నీరు కల్లోలంగా మారడాన్ని గుర్తించిన కొందరు ప్రయాణికులు పడవను వెనక్కి తిప్పాలని సిబ్బందిని కోరారు. అయితే, వీరు చెప్పింది బోటు నడిపేవారికి వినిపించకపోవడంతో.. వారు అలాగే ముందుకెళ్లారని కొందరు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

మునిగిపోతుంటే లైఫ్ జాకెట్లు..

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కొందరిని బోటు నుంచి రక్షించారు. అయితే, ఈ ఘటనతో పలు నిర్వహణ లోపాలు బయటపడ్డాయి. ప్రయాణ సమయంలో సిబ్బంది ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించలేదని కొందరు ప్రయాణికులు తెలిపారు. ముందు ఇవ్వకుండా పడవ మునిగిపోతున్న సమయంలో లైఫ్ జాకెట్లు అందించారని ఆరోపించారు. ఈ ఘటనలో ఇప్పటివరకు 9 మంది మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు తెలిపారు. మరో 15 మందిని రక్షించారు. మిగతా వారికోసం గాలింపు కొనసాగుతోంది.

## దేశంలో పటిష్టంగా తెలంగాణ పోలీసింగ్

కృషి చేస్తానన్నారు. శాంతిభద్రతల కోసం అహర్నిశలూ శ్రమిస్తానని చెప్పారు. కొత్త టెక్నాలజీని మరింతగా వాడుకుంటూ సమర్థంగా పని చేస్తామన్నారు. నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పని తీరు కనబరిచారు. మారుతున్న పరిస్థితుల్లాగే నేరాలు జరుగుతున్న విధానం కూడా మారింది. నేరగాళ్లు సైతం కొత్త కొత్త టెక్నాలజీని అనుసరిస్తూ నేరాలు చేస్తున్నారు. ఇది పోలీసులకు సవాలుగా మారింది. ఎన్ని కేసులు పెట్టినా.. డ్రగ్స్ ముఠాలు కూడా విస్తరిస్తున్నాయి. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ పోలీసుబృందం బాగా కృషి చేస్తోంది. శాంతిభద్రతల సమస్య రాకముందే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చివరి దశకు చేరుకుందని సీవీ ఆనంద్ అన్నారు.

## పసుపును ఆహార పంటగా గుర్తించాలి

- క్వింటాల్ కు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించాలి
- తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్(జనంసాక్షి):** పసుపును ఆహార పంటగా గుర్తించి క్వింటాల్ కు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిజామాబాద్ కు చేరువగా మహారాష్ట్రలోని సాంగ్లి మార్కెట్ లో క్వింటాల్ పసుపునకు రూ.17 వేల ధర పలుకుతుందని తెలిపారు. నిజామాబాద్ మార్కెట్ లో వ్యాపారులు సిండికేట్ గా మారి రూ.13 వేలకు మించి ధర పెట్టడం లేదని, దీంతో పసుపు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పైసెస్ బోర్డు ఉత్సవ విగ్రహంలా మారిందని.. స్పైసెస్ బోర్డును బలోపేతం చేసి నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లోని పసుపు రైతులకు అండగా నిలవాలని కోరారు. వెంటనే ఆహార పంటల జాబితాలో పసుపును చేర్చి కనీస మద్దతు ధర ప్రకటించాలని కోరారు. నిజామాబాద్ మార్కెట్ లో ఇంకా లక్ష క్వింటాళ్లకు పైగా పసుపు పంట కొనుగోలు చేయాల్సి ఉందని, ఆ రైతులకు ప్రయోజనం చేకూర్చాలని కోరారు. .

## కుటుంబాన్ని మింగేసిన అతివేగం

సమాచారం అందు కోగానే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోయిన కారును యంత్రాల సహాయంతో బ యటకు తీసారు. పెద్ద గోల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్ 16వ వద్ద ఈ ప్రమా దం జరిగింది. ప్రమాదానికి గురైన కారు నెంబర్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యాదగిరిగుట్ట వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వివరించారు. మృతదేహాలను అతికష్టం మీద వాహనం నుంచి వెలికి తీశారు. ప్రమాద సమయంలో కారులో ఏడుగురు ఉన్నారు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. మృతులంతా సిరిసిల్లకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వీరంతా యాదగిరిగుట్ట వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.



# కమర్షియల్ గ్యాస్ గుది‘బండ’

దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు వంటి వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూప నుంది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.993 పెంచింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ రేటు రూ.3,315కు చేరింది. ఢిల్లీలో 19 కిలోల సిలిండర్ ధర రూ.3,071కి చేరుకుంది.

## ఇంత మోసమా?

హైదరాబాద్(జనంసాక్షి): కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం అమాంతం పెంచి సామాన్యుడి నడ్డి విరిచిందని తెలంగాణ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై మంత్రి ఫైర్ అయ్యారు. గ్యాస్ ధర పెంపుతో సామాన్యుడిపై పెను భారం మోపారంటూ ఆగ్రహించారు. 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధరను రూ.993లకు అంటే సుమారు వెయ్యి రూపాయలకు పెంచడం దుర్మార్గమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. ఒక్కసారిగా 30 నుంచి 35 శాతం పెంచడంతో హోటళ్లు, రెస్టారెంట్లతో సహా చిన్నచిన్న వీధి వ్యాపారులపైనా తీవ్ర ప్రభావం పడనుందని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసి 24 గంటలు పూర్తి కాగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తీవ్ర విమర్శలు గుప్పించారు.

## ముందే చెప్పాం కదా

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు రూ.993 మేర పెరగడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. త్వరలో పెట్రోల్, డీజిల్ వంతు వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల తరువాత ధరాభారం పెరుగుతుందని తాను ముందే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది ఎలక్షన్ బిల్లు అని వ్యాఖ్యానించారు. ఎక్స్ వేదికగా ఈ మేరకు పోస్టు పెట్టారు. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధర మునుపెన్నడూ చూడని స్థాయిలో ఒక్కసారిగా పెరిగాయని రాహుల్ గాంధీ విమర్శించారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూ రూ.1380ల మేర ధర పెరిగిందని అన్నారు. కేవలం మూడు నెలల్లోనే ధర 81 శాతం మేర పెరిగిందని వివరించారు. ఎన్నికల తరువాత ఇలా జరుగుతుందని తాను ముందే చెప్పానని గుర్తు చేశారు. 'టీ స్టాల్స్, ధాబాలు, బేకరీ, స్వీట్ షాపులు.. ఇలా అందరిపైనా భారం పెరిగింది. చివరకు మీ ఆహార ఖర్చులపైనా ప్రభావం పడుతుంది. మొదట ఎల్‌పీజీ గ్యాస్ వంతు.. ఆ తరువాత పెట్రోల్‌-డీజిల్ ధరల వంతు వస్తుంది' అని అన్నారు. ఎన్నికలు ముగిశాక దేశంలో పెట్రోల్ ధరలు పెరుగుతాయని రాహుల్ గాంధీ మంగళవారం పేర్కొన్నారు. 'అలర్ట్‌గా ఉండండి.. ఎన్నికల వల్ల కలిగిన ఉపశమనం ఇక ముగిసినట్టే. ఇంధన ధరలు తక్కువగా ఉన్నప్పుడు మోదీ ప్రభుత్వం లాభాలను దండుకుంది. ఇప్పుడు ధరలు పెరిగాయి కాబట్టి ధరాభారాన్ని ప్రజలపై పెడుతుంది' అని రాహుల్ అప్పట్లో విమర్శించారు

## ఎన్నికల తరవాత ధరలు పెంచడం మోడీకి అలవాటే : కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): దేశ చరిత్రలో ఎన్నడు పెంచనంతగా వాణిజ్య సిలిండర్ల మీద రూ.993 పెంచిన ఘనత కేంద్రంలోని నరేంద్ర మోదీ దేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు అయిపోగానే గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచడం మోదీకి అలవాటేనని అన్నారు. ఒక్క సిలిండర్ మీద దాదాపు రూ.1000 పెంచి సామాన్యులకు, హోటళ్లలో పని చేసే కార్మికులకు మోదీ మేడే కానుక ఇచ్చాడని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో నిన్నటి వరకు ఒక సిలిండర్ ధర రూ. 2,321 ల నుంచి రూ.3,315 పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్లు, మెస్‌ల మీద ఆధారపడి చదువుకునే యువతకు, ఉద్యోగాలు చేసుకునే వారికి ఈ ధరల పెంపు వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. తక్షణమే పెంచి ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపునూ తోసిపుచ్చలేం..

న్యూఢిల్లీ(జనంసాక్షి):

పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ఉంటుందని వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. విపక్షాలు కూడా ఇదే వాదన చేస్తున్న వేళ వాణిజ్య సిలిండర్ ధర భారీగా పెరిగింది. ఈ క్రమంలోనే సమీప భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును కొట్టిపారేయలేమని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు ధరలు భారీగా పెరిగినప్పటికీ, నాలుగేళు ్లగా రిటైల్ ధరలు సవరించకపోవడం వల్ల నష్టాలు పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశాన్ని తోసిపుచ్చలేమని పేర్కొన్నాయి.

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

సభ్యులు అడిగి తెలుసుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ మినహా మిగిలిన మూడు సొసైటీలలో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులు ఉన్నట్లు ప్రాధ మికంగా గుర్తించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ.. జర్నలిస్టులు అందరూ ఒకేతాటిపై ఉంటే సమస్యల పరిష్కారం సులువు అవుతుందని, అన్ని సొసైటీలు కలిపి ఒకే వేదికపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టు సంఘాలలో సభ్యులు కాని అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెబుతూ ఎలాంటి విమర్శలకు, అనుమానాల కు తావు లేకుండా ఇళ్ల స్థలాల మంజూరు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని, ఇప్పుడు కూడా ప్రజా ప్రభుత్వం వచ్చాక 18 ఏళ్లుగా పరిష్కారం కాని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఇళ్ల సమస్యను కొలిక్కి తీసుకువచ్చి రవీంద్ర భారతిలో జర్నలిస్టుల కుటుంబాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భూమి అప్పగించినప్పటికీ న్యాయవివాదాల కారణంగా సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని గుర్తు చేశారు. జర్నలిస్ట్ ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని జూన్ 2వ తేదీ నాటికి కొలిక్కి తీసుకువస్తామని తెలిపారు.

## వడగాలులపై హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్

హైదరాబాద్,మే1(జనంసాక్షి):రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు, వడగాలుల నుంచి ప్రజలను రక్షించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆమేరకు సంబంధిత శాఖలు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది -2026లో ఎండలు , వడగాలులు అధికంగా వీచే అవకాశం ఉందని, జూన్ 15 వరకు కూడా అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని , ఐఎండి హెచ్చరికల నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలపై 20 సంబంధిత శాఖలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్షాసమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ, ఇండియన్ మెట్రాలాజికల్ శాఖ కలిసి సమగ్ర తెలంగాణ స్టేట్ హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్ -2026 ను రూపొందించాయని ఈ సందర్భంగా హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్-2026ను మంత్రి విడుదల చేశారు.

## సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సామాన్య ప్రజల గడప వద్దకు చేరుతున్నాయంటే, అందులో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకం," అని భట్టి విక్రమార్క ప్రశంసించారు.గతంతో పోలిస్తే ప్రస్తుతం ఆర్థిక క్రమశిక్షణతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండటంపై సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు అందుతున్నాయని, దీనివల్ల వేలాది కుటుంబాలకు ఊరట లభిస్తోందని వారు డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బెనిఫిట్స్ చెల్లించేందుకు ప్రభుత్వం ప్రతి నెలా రూ. 1,000 కోట్లు కేటాయించడాన్ని వారు హర్షం వ్యక్తం చేశారు. భేటీ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు ప్రధానంగా పీఆర్సీ, కరువు భత్యం, హెల్త్ కార్డ్స్ వంటి దీర్ఘకాలిక సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన.. ఈ అంశాలన్నింటినీ కేబినెట్ సబ్ కమిటీలో సమగ్రంగా చర్చించి త్వరలోనే ఉద్యోగులకు చెబుతామని వెల్లడించారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నారని స్పష్టం చేశారు.

# ప్రజా నమ్మకమే అసలు తీర్పు..!

రాజకీయాల్లో పార్టీల మార్పులు కొత్తవి కావు, కానీ రాజ్యసభ వంటి ఉన్నత వేదికపై విలీనం పేరిట గ్రూపుగా పార్టీ మార్పు జరగడం ఎప్పుడైనా చర్చకు దారి తీస్తుంది. తాజాగా ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు భారతీయ జనతా పార్టీలో విలీనమవుతామని చైర్మన్‌కు లేఖ ఇవ్వడంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ పద్ధతి చట్టబద్ధమేనా..? నైతికమవుతుందా అన్న ప్రశ్నలు తెరముందుకు వచ్చాయి. రాజ్యంగంలోని పదవ షెడ్యూల్ ప్రకారంగా సాధారణంగా పార్టీ మారితే సభ్యులపై అనర్హత తప్పదు. అయితే సభాపక్షంలో కనీసం రెండింట మూడవ వంతు (2/3) సభ్యులు కలిసి మరో పార్టీలో విలీనమైతే చట్టబద్ధంగా పరిగణించే విధంగా వెసులుబాటు ఉంది. ఇదే నిబంధన తాజాగా రాజకీయ వ్యూహాలకు కేంద్రబిందువైంది. కేవలం సంఖ్యా ప్రమాణం మాత్రమే కాదు, సదరు రాజకీయ పార్టీయే విలీనమవ్వాలన్నది చట్టం ఉద్దేశంగా అర్థం చేసుకోవాలి. అయితే కేవలం శాసనపక్షం సభ్యులు కలిసి తీసుకున్న నిర్ణయం దీనికి సరిపోతుందా? లేక పార్టీ సంస్థాగతంగా కూడా విలీనం కావాలా? అన్న సందేహాలు తాజాగా న్యాయపరంగా ప్రాధాన్యం పొందుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజ్యసభ చైర్మన్ పాత్ర అత్యంత కీలకం. కాగా ఆయనకు ఉన్న అధికారంతో ఈ విలీనాన్ని చట్టబద్ధంగా గుర్తించాలా వద్దా అన్నది నిర్ణయించాల్సి ఉంటుంది. అయితే ఆ నిర్ణయం పూర్తిగా నిర్బంధ రహితం కాకపోవడం గమనార్హం. వాస్తవ పరిస్థితులు, సభ్యుల సంఖ్య, విలీనం నిజస్వరూపం అన్నింటినీ సమగ్రంగా పరిశీలించాల్సిన బాధ్యత కూడా ఆయనపై ఉంటుంది. ఇలాంటి పరిణామాలు గతంలో కూడా చోటుచేసుకున్నాయి. కొన్ని ప్రాంతీయ పార్టీల రాజ్యసభ సభ్యులు సమూహంగా మరో పార్టీలో చేరి విలీనంగా ప్రకటించగా, చైర్మన్ ఆమోదం ఇచ్చిన సందర్భాలున్నాయి. ఆయా సందర్భాలలో చట్టపరంగా సదరు ఎంపీలు తమ పదవులను కాపాడుకున్నారు. కానీ రాజకీయంగా ఆ మార్పులు మిశ్రమ ఫలితాలనే ఇచ్చాయి. ప్రజలలో సిద్ధాంతం కంటే రాజకీయ నాయకులకు వ్యక్తిగత ప్రయోజనమే ముఖ్యమా అన్న సందేహాలు బలపడ్డాయి. కొన్నిచోట్ల తదుపరి ఎన్నికల్లో ఆ నాయకులు ఎదురుదెబ్బలు తిన్న ఉదాహరణలు కూడా ఉన్నాయి. అంటే చట్టం రక్షించినా, ప్రజా తీర్పు మాత్రం వేరే దిశలో ఉండొచ్చన్న పాఠం అప్పుడే స్పష్టమైంది. పదవషెడ్యూల్ ఉద్దేశం పార్టీ ఫిరాయింపులను అరికట్టి రాజకీయ స్థిరత్వాన్ని కాపాడటం. కానీ అదే నిబంధనలోని విలీనం అనే మినహాయింపు ఉండడం ఇప్పుడు ఒక చట్టబద్ధత దారి తప్పిన మార్గంలా మారిందన్న విమర్శలు పెరుగుతున్నాయి. వ్యక్తిగతంగా పార్టీ మారితే అనర్హత తప్పదని తెలిసిన నాయకులు, కొందరు కలిసి గ్రూపుగా మారడం ద్వారా చట్టాన్ని చుట్టంగా మలచుకునే ప్రయత్నం చేస్తున్నారన్న భావన ప్రజల్లో బలపడుతోంది. ఇది చట్టస్ఫూర్తిని దెబ్బతీసే ప్రమాదకర ధోరణిగా భావించాల్సిన పరిస్థితి. చట్టబద్ధతతో పాటు నైతికత అనే ప్రమాణాన్ని విస్మరించలేము. ఒక పార్టీ గుర్తుపై గెలిచిన ప్రజాప్రతినిధి, అదే పార్టీ సిద్ధాంతాలతో ప్రజల మద్దతు పొందుతాడు. మరి మధ్యలో పార్టీ మారడం అంటే ఆ నమ్మకాన్ని వేరే దిశలో మళ్లించడమే అవుతుంది కదా. ఇది చట్టం అనుమతించినా, ప్రజాస్వామ్య ఆత్మకు విరుద్ధంగా కనిపిస్తుంది. ముఖ్యంగా విభిన్న సిద్ధాంతాలున్న పార్టీల మధ్య మార్పు జరిగితే, అది అవకాశవాదంగా ముద్రపడే ప్రమాదం ఎక్కువ. ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయాలంటే కొన్ని కీలక ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. సభలో అసలు పార్టీకి చెందిన మొత్తం సభ్యులలో మారాలనుకుంటున్న వారి సంఖ్య రెండింట మూడవ వంతు 2/3 సంఖ్య నిజంగా ఉందా అనే అంశం కీలకమైనది. అయితే ఆప్‌కు మొత్తం రాజ్యసభలో పది మంది ఎంపీలు ఉండగా తాజాగా బీజేపీలో చేరుతున్నట్లు తమను బీజేపీలో విలీనం చేయాలని చైర్మన్ ను కోరిన వారి సంఖ్య రాఘవ చద్దాతో కలిపి మొత్తం 7 మంది. సంఖ్యా పరంగా 2/3 మెజారిటీ ఉన్నట్లే అవుతుంది. అయితే ఇది నిజమైన విలీనమా లేక అనర్హతను తప్పించుకునే వ్యూహమా..? అనేది మరో ముఖ్యమైన ప్రశ్న, అంతేకాదు పార్టీ మారిన 7 గురు సభ్యులు ప్రజలకు ఏం వివరణ ఇస్తారనేది కూడా వారి రాజకీయ భవిష్యత్తును నిర్దేశ పరచనుంది. ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం లేకపోతే, ప్రస్తుతానికి వారి పదవులకు చట్టబద్ధత దక్కించుకున్నా ప్రజా విశ్వాసం దెబ్బతినడం ఖాయం. ప్రజాస్వామ్యం కేవలం చట్టపరమైన వ్యవస్థ కాదు. అది నమ్మకాలపై నిలబడే విలువల సమాహారం. చట్ట పరంగా లెక్కలు సరిపోవచ్చు, కానీ ప్రజల విశ్వాసం కోల్పోతే ఆ లెక్కలకు ప్రయోజనం ఉండదు. చట్టం చాటున తాత్కాలిక ఉపశమనం పొందినా, ప్రజా తీర్పు మాత్రం దీర్ఘకాలం ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అందుకే రాజకీయ నాయకులు చట్టబద్ధ మార్గాలకే కాకుండా ప్రజా ధర్మానికీ ప్రధానంగా కట్టుబడి ఉండాలి. లేనిపక్షంలో విలీనం అనే పదంతో పదవులు నెలబెట్టుకున్నా, ప్రజా క్షేత్రంలో నేతల భవిష్యత్తు తలకిందులయ్యే ప్రమాదం ఉంటుంది.





**ఉదయ్**
DAE, BA, BCJ, MCJ,
LLB, MPhil., PhD (OU)
సీనియర్ జర్నలిస్ట్,
సెల్ నెం : 83676 03197

# గ్లోబలైజేషన్ ప్రభావం – కార్మిక హక్కులపై కొత్త ప్రశ్నలు!

ప్రపంచ చరిత్రలో సామాన్య కార్మికుల పోరాటాలకు, హక్కుల సాధనకు ప్రతీకగా నిలిచిన గొప్ప దినం మే డే. ప్రతి సంవత్సరం మే 1న జరుపుకునే ఈ దినోత్సవం వెనుక ఉన్న చరిత్ర గాఢమైన పోరాటాలతో, త్యాగాలతో నిండినది. మే డే ప్రారంభానికి మూలం 19వ శతాబ్దం చివరి దశలో అమెరికాలో జరిగిన కార్మిక ఉద్యమాలు. ముఖ్యంగా 1886 సంవత్సరం మే 1న అమెరికాలోని కార్మికులు రోజుకు 8 గంటల పని సమయం కోసం భారీ స్థాయిలో సమ్మెలు చేపట్టారు. అప్పటివరకు చాలా పరిశ్రమల్లో రోజుకు 12 నుంచి 16 గంటలపాటు పని చేయించేవారు. ఇది కార్మికులపై తీవ్రమైన దోపిడీకి దారితీసింది. ఈ పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు లక్షలాది కార్మికులు వీధుల్లోకి వచ్చి తమ హక్కుల కోసం పోరాటం ప్రారంభించారు.

1886 మే 4న చికాగో నగరంలోని హేమార్కెట్ ఘటన మే డే చరిత్రలో కీలక మలుపు. ఆ రోజున జరిగిన పేలుడు, పోలీసు కాల్పుల్లో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన ప్రపంచ కార్మిక ఉద్యమాన్ని మరింత వేగవంతం చేసింది. అనంతరం 1889లో పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ కార్మిక సమాఖ్య సమావేశంలో మే 1ను ప్రపంచ కార్మికుల దినంగా ప్రకటించారు. ఆ నిర్ణయం తర్వాత ప్రపంచ వ్యాప్తంగా ఈ దినాన్ని అధికారికంగా జరుపుకోవడం ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటివరకు మే డే కార్మిక హక్కుల ప్రతీకగా నిలుస్తోంది.

ప్రారంభ దశలో కార్మిక వ్యవస్థ అత్యంత దయనీయ స్థితిలో ఉండేది. 19వ శతాబ్దం చివర్లో పరిశ్రమల విస్తరణతో కార్మికుల సంఖ్య పెరిగినప్పటికీ, వారి హక్కులకు మాత్రం ప్రాధాన్యత ఇవ్వబడలేదు. రోజుకు 14 గంటల పని, తక్కువ వేతనం, భద్రతా ప్రమాణాల లేమి, బాల కార్మికత్వం వంటి సమస్యలు విస్తృతంగా కనిపించేవి. 1900 ప్రాంతంలో ప్రపంచ కార్మికుల్లో దాదాపు 60% మంది అసంఘటిత రంగంలో పనిచేస్తుండేవారు. మహిళా కార్మికులకు పురుషులతో పోలిస్తే 40% వరకు తక్కువ వేతనం చెల్లించబడేది.

మే డే కేవలం ఒక దినోత్సవం మాత్రమే కాదు, ఇది కార్మికుల పోరాటాలకు గుర్తుగా నిలిచే చరిత్ర. ఇది గతాన్ని గుర్తుచేస్తూ, భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే ఒక ఉద్యమ స్ఫూర్తి. కార్మికుల హక్కులు పూర్తిగా సాధించబడే వరకు ఈ పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. 1886లో ప్రారంభమైన ఈ ఉద్యమం 2026 వరకు ఎన్నో మార్పులను చూసినా, దాని అసలు ఉద్దేశ్యం – కార్మికులకు గౌరవప్రదమైన జీవితం కల్పించడం – ఇంకా సజీవంగానే ఉంది.

2.ఇప్పటి ప్రపంచీకరణ యుగంలో కార్మిక వ్యవస్థకు కొత్త పరిమాణాలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ పెరుగుదలతో సంప్రదాయ పరిశ్రమలతో పాటు సాంకేతిక రంగం ఆధిపత్యం పెరిగింది. 2026 నాటికి ప్రపంచ వ్యాప్తంగా సుమారు 40% ఉపాధి డిజిటల్ లేదా సాంకేతిక రంగంతో అనుసంధానమైందని అంచనాలు తెలియజేస్తున్నాయి. ఇది ఒకవైపు నైపుణ్యాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నా, మరోవైపు నైపుణ్యం లేని కార్మికులకు అవకాశాల లోపాన్ని సృష్టిస్తోంది. ఈ పరిస్థితి కార్మికుల మధ్య అసమానతలను పెంచే ప్రమాదాన్ని కలిగిస్తోంది.

ప్రస్తుతం గిగ్ ఎకానమీ అనే కొత్త విధానం వేగంగా విస్తరిస్తోంది. ఉబెర్, స్విగ్గీ, జొమాటో వంటి ప్లాట్‌ఫార్మ్ ఆధారిత ఉద్యోగాలు యువతలో ప్రాచుర్యం పొందుతున్నాయి. 2026 నాటికి ప్రపంచ కార్మికుల్లో దాదాపు 20% మంది ఈ గిగ్ ఎకానమీపై ఆధారపడుతున్నారని అంచనా. అయితే ఈ విధానం కార్మికులకు స్థిరత్వం ఇవ్వడంలో విఫలమవుతోంది. ఉద్యోగ భద్రత, పెన్షన్, ఆరోగ్య బీమా వంటి సదుపాయాలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. దీని కారణంగా మే డే వంటి ఉద్యమాల ప్రాముఖ్యత ఇప్పటికీ కొనసాగుతోంది.

భారతదేశంలో కార్మిక వ్యవస్థను పరిశీలిస్తే, అసంఘటిత రంగం ఆధిపత్యం ఇప్పటికీ స్పష్టంగా కనిపిస్తోంది. 2026 నాటికి భారత కార్మికుల్లో సుమారు 80% మంది అసంఘటిత రంగంలోనే



ఉన్నారని అంచనా. నిర్మాణ రంగం, వ్యవసాయం, చిన్న పరిశ్రమలు ఈ విభాగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఈ రంగాల్లో పనిచేసే కార్మికులకు కనీస భద్రత కూడా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగించే అంశం..

భవిష్యత్తులో కార్మిక వ్యవస్థను ప్రభావితం చేసే ప్రధాన అంశం ఆటోమేషన్. యంత్రాలు, రోబోట్స్ ఉపయోగం పెరుగడంతో సంప్రదాయ ఉద్యోగాలు తగ్గే అవకాశముంది. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా సుమారు 25% ఉద్యోగాలు ఆటోమేషన్ ప్రభావానికి లోనవుతాయని అంచనాలు సూచిస్తున్నాయి. అయితే ఇదే సమయంలో కొత్త రంగాల్లో ఉపాధి అవకాశాలు కూడా ఏర్పడతాయి. ఇందుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం అత్యవసరం.

శిక్షణ, నైపుణ్యాభివృద్ధి రంగం కార్మికుల భవిష్యత్తును నిర్ణయించే కీలక అంశంగా మారింది. ప్రస్తుతం అనేక ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను చేపడుతున్నాయి. 2026 నాటికి ప్రపంచ స్థాయిలో 60% మంది యువత నూతన నైపుణ్యాలపై శిక్షణ పొందాల్సిన అవసరం ఉందని నివేదికలు సూచిస్తున్నాయి. ఇది ఉపాధి అవకాశాలను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మే డే ప్రాముఖ్యత ఈ నేపథ్యంలో మరింత పెరిగింది. ఇది కేవలం చారిత్రక గుర్తుగా కాకుండా, ప్రస్తుత కార్మిక సమస్యలను గుర్తుచేసే రోజు. ప్రతి సంవత్సరం ఈ దినం కార్మికుల హక్కుల కోసం కొత్త చర్చలకు దారితీస్తోంది. ప్రభుత్వాలు, సంస్థలు, సమాజం కలిసి కార్మిక సంక్షేమాన్ని మెరుగుపర్చే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఇది గుర్తుచేస్తోంది.

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి కారణంగా ఆటోమేషన్ విస్తృతంగా పెరిగింది. తయారీ రంగం నుంచి సేవల రంగం వరకు యంత్రాల వినియోగం పెరగడంతో సంప్రదాయ ఉద్యోగాలు తగ్గుతున్నాయి. 2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 30% పనులు యంత్రాల ద్వారా నిర్వహించబడుతున్నాయని అంచనాలు తెలియజేస్తున్నాయి. ఇది కార్మికులకు ఒక పెద్ద సవాలుగా మారింది. తక్కువ నైపుణ్యాలు కలిగిన కార్మికులు ఉద్యోగాలను కోల్పోయే ప్రమాదం ఎక్కువగా ఉంది. అదే సమయంలో అధిక నైపుణ్యాలు కలిగిన వారికి కొత్త అవకాశాలు పెరుగుతున్నాయి.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం కూడా గణనీయంగా పెరిగింది. డేటా విశ్లేషణ, ఆటోమేటెడ్ సేవలు, రోబోటిక్స్ వంటి రంగాలు వేగంగా విస్తరిస్తున్నాయి. 2026 నాటికి సుమారు 50% సంస్థలు తమ కార్యకలాపాల్లో ఎఐ ఆధారిత వ్యవస్థలను ఉపయోగిస్తున్నాయని నివేదికలు సూచిస్తున్నాయి. ఇది పనితీరు మెరుగుపరచడంలో సహాయపడుతున్నప్పటికీ, మానవ కార్మికుల అవసరాన్ని కొంతవరకు తగ్గిస్తోంది. ఈ నేపథ్యంలో కార్మికులు తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

గిగ్ ఎకానమీ సాంకేతిక ప్రపంచంలో ఒక ముఖ్య లక్షణంగా మారింది. ఫ్రీలాన్స్, కాంట్రాక్ట్, తాత్కాలిక ఉద్యోగాలు విస్తృతంగా పెరిగాయి. 2026 నాటికి ప్రపంచ కార్మికుల్లో దాదాపు 20% మంది గిగ్ విధానంలో పనిచేస్తున్నారని అంచనా. ఇది సమయ స్వేచ్ఛను కలిగించినప్పటికీ, ఉద్యోగ భద్రతను తగ్గించింది. స్థిరమైన వేతనం లేకపోవడం, సామాజిక భద్రతా సదుపాయాల లేమి వంటి సమస్యలు ఈ వ్యవస్థలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

సాంకేతిక ప్రపంచంలో రిమోట్ వర్క్ ఒక సాధారణ విధానంగా మారింది. ముఖ్యంగా కరోనా మహమ్మారి తర్వాత ఇంటి నుంచి పని చేసే విధానం విస్తృతంగా అమలులోకి వచ్చింది. 2026 నాటికి సుమారు 35% ఉద్యోగులు పూర్తిగా లేదా భాగస్వామ్యంగా రిమోట్ వర్క్‌లో ఉన్నారని అంచనా. ఇది ప్రయాణ ఖర్చులను తగ్గించడంతో పాటు, సమయ నిర్వహణలో సౌలభ్యాన్ని కలిగించింది. అయితే అదే సమయంలో పని–వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత కోల్పోవడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి.

డిజిటల్ విభేదం కూడా ఒక ప్రధాన సమస్యగా నిలిచింది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నవారు వేగంగా ఎదుగుతున్నప్పుడు, దానికి దూరంగా ఉన్నవారు వెనుకబడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో, అభివృద్ధి చెందని దేశాల్లో డిజిటల్ సౌకర్యాల కొరత కారణంగా కార్మికులు అవకాశాలను కోల్పోతున్నారు. 2026 నాటికి ప్రపంచ జనాభాలో సుమారు 40% మందికి సరైన డిజిటల్ యాక్సెస్ లేకపోవడం ఈ అసమానతను మరింత పెంచుతోంది.

మహిళా కార్మికుల పరిస్థితి కూడా సాంకేతిక ప్రపంచంలో ప్రత్యేకంగా విశ్లేషించాల్సిన అంశం. డిజిటల్ రంగంలో మహిళల భాగస్వామ్యం పెరుగుతున్నప్పటికీ, ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో వారి ప్రాతినిధ్యం ఇంకా తక్కువగా ఉంది. 2026 నాటికి టెక్నాలజీ రంగంలో మహిళల వాటా సుమారు 28% మాత్రమే ఉన్నట్లు అంచనాలు తెలియజేస్తున్నాయి. ఇది సమాన అవకాశాల లోపాన్ని సూచిస్తోంది. సాంకేతిక ప్రపంచంలో మానసిక ఆరోగ్యం కూడా ఒక ముఖ్య అంశంగా మారింది. అధిక పనిభారం, నిరంతర కనెక్టివిటీ, ఉద్యోగ అస్థిరత వంటి కారణాల వల్ల కార్మికులు ఒత్తిడికి గురవుతున్నారు. 2026 నాటికి సుమారు 45% ఉద్యోగులు పని సంబంధిత ఒత్తిడిని అనుభవిస్తున్నారని నివేదికలు తెలియజేస్తున్నాయి. ఇది కార్మిక సంక్షేమ విధానాల్లో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

భవిష్యత్తులో కార్మిక వ్యవస్థను సమతుల్యంగా అభివృద్ధి చేయాలంటే ప్రభుత్వాలు, సంస్థలు, సమాజం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు విస్తరించాలి. కార్మికులకు సామాజిక భద్రతా సదుపాయాలు అందుబాటులోకి రావాలి. గిగ్ కార్మికులకు కూడా కనీస రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. సమాన వేతనం, సమాన అవకాశాలు అందించే విధానాలు అమలు చేయాలి. మే డే స్ఫూర్తి ఈ సాంకేతిక యుగంలో మరింత ప్రాసంగికంగా మారింది. గతంలో 8 గంటల పని సమయం కోసం జరిగిన పోరాటం, ఇప్పుడు సమగ్ర హక్కుల కోసం విస్తరించింది. కార్మికుల గౌరవం, భద్రత, సమానత్వం వంటి అంశాలు ఇప్పటికీ ముఖ్యమైనవే. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, మానవ శ్రమకు ఉన్న విలువ తగ్గకూడదు.

ముగింపుగా, సాంకేతిక ప్రపంచం కార్మికులకు అవకాశాలు, సవాళ్లు రెండింటినీ అందిస్తోంది. ఒకవైపు కొత్త ఉపాధి అవకాశాలు, మెరుగైన జీవన ప్రమాణాలు కనిపిస్తుండగా, మరోవైపు అసమానతలు, అస్థిరతలు పెరుగుతున్నాయి. ఈ విభిన్న పరిస్థితుల్లో కార్మికుల హక్కులను రక్షించడం అత్యంత కీలకం. సమానత్వం, న్యాయం, గౌరవం అనే విలువలపై ఆధారపడిన కార్మిక వ్యవస్థనే భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తుంది. మే డే ఇచ్చే సందేశం కూడా ఇదే – మార్పు ఎప్పుడూ కొనసాగుతుంది, కానీ హక్కుల కోసం పోరాటం ఎప్పటికీ ఆగదు.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# అమెరికా యుద్ధాల వెనుక అసలు అర్థం ఏమిటి?

ప్రపంచ రాజకీయాల్లో అమెరికా చేపట్టే యుద్ధాలు ఎప్పటికప్పుడు వివాదాస్పదంగా మారుతున్నాయి. ఒకవైపు 'ప్రజాస్వామ్యం', 'భద్రత', 'ఉగ్రవాద నిర్మూలన' వంటి న్యాయసూత్రాలను ముందుకు తెస్తూ, మరోవైపు తన వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా ఇరాన్ నేపథ్యంలో మళ్లీ ఈ చర్చలు ముందుకు వచ్చాయి. మాజీ దౌత్యవేత్తలు కొందరు అమెరికా యుద్ధాలకు అర్థం లేదని అభిప్రాయపడుతున్నప్పటికీ, చరిత్రను పరిశీలిస్తే ప్రతి యుద్ధం వెనుక ఒక స్పష్టమైన లక్ష్యం ఉన్నట్లు కనిపిస్తుంది. అది కొన్నిసార్లు చమురు వనరుల నియంత్రణ, మరికొన్నిసార్లు భౌగోళిక ఆధిపత్యం, ఇంకొన్నిసార్లు రాజకీయ జోక్యం రూపంలో ఉంటుంది.

సామ్రాజ్యవాద లక్షణాలను విశ్లేషించిన ఆలోచనాపరులు మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, రోజా లగ్జెంబర్గ్ వంటి వారు పెట్టుబడిదారీ వ్యవస్థ విస్తరణ కోసం యుద్ధాలు అనివార్యమని చాలా కాలం క్రితమే చెప్పారు. కొత్త మార్కెట్లు, వనరులు లేకుండా ఆర్థిక వ్యవస్థ నిలబడదనే వారి విశ్లేషణ ఇప్పటికీ ప్రాసంగికమే. అమెరికా విదేశాంగ విధానాన్ని పరిశీలిస్తే ఈ సిద్ధాంతాలకు అనుగుణంగా అనేక ఉదాహరణలు కనిపిస్తాయి. 2003లో ఇరాక్‌పై 'అణ్వాయుధాల' పేరుతో దాడి, 2001లో ఆఫ్ఘనిస్తాన్‌పై 'ఉగ్రవాద



వ్యతిరేక యుద్ధం', 2011లో లిబియాపై 'ప్రజల రక్షణ' పేరుతో జోక్యం, 1960లలో వియత్నాం యుద్ధం– ఇవి ప్రకటించిన కారణాలకు మించి వ్యూహాత్మక ప్రయోజనాలను సూచిస్తాయి.

ప్రత్యేకంగా చమురు వనరుల విషయంలో అమెరికా వైఖరి మరింత స్పష్టంగా కనిపిస్తుంది. మధ్యప్రాచ్య ప్రాంతంపై అధిక ఆసక్తి, గల్ఫ్ దేశాలపై రాజకీయ ప్రభావం పెంపు, హోర్ముజ్ జలసంధి వంటి కీలక మార్గాలపై పరోక్ష నియంత్రణ-ఖశ్రీశ్రీ ఇవి శక్తి భద్రతను మాత్రమే కాకుండా ప్రపంచంపై ఆధిపత్యాన్ని సూచించే అంశాలుగా కనిపిస్తాయి. ఇదే సందర్భంలో పనామా కాలువ ఉదాహరణ కూడా ప్రస్తావనీయమే. అట్లాంటిక్ మరియు పసిఫిక్ సముద్రాలను కలిపే ఈ మార్గం ప్రపంచ వ్యాపారానికి కీలకం. దీని నియంత్రణ కోసం అమెరికా చేపట్టిన చర్యలు వ్యూహాత్మక ఆలోచనలను స్పష్టం చేస్తాయి. అయితే అమెరికా చేసే ప్రతి చర్యను ఒకే కోణంలో చూడటం కూడా సరైనది కాదు. ప్రపంచ భద్రత, మిత్ర దేశాల రక్షణ వంటి అంశాలు కూడా కొన్నిసార్లు పాత్ర పోషిస్తాయి. కానీ వాటి వెనుక ఉన్న ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను విస్మరించలేము.ప్రస్తుతం ఇరాన్ అంశం కూడా ఇదే నేపథ్యంలో చూడాల్సిన అవసరం ఉంది. అణ్వాయుధాల అభివృద్ధి అనే కారణం ఎంతవరకు నిజమో, ఎంతవరకు వ్యూహాత్మక ప్రచారమో అనే ప్రశ్న ఇంకా నిలిచే ఉంది. చివరగా చెప్పాలంటే, అమెరికా యుద్ధాలు కేవలం సైనిక చర్యలు మాత్రమే కావు. అవి ప్రపంచ రాజకీయాల ను ప్రభావితం చేసే సాధనాలు. చమురు, మార్కెట్లు, భౌగోళిక ఆధిపత్యం–ఈ మూడు అంశాలు కలిసి అమెరికా యుద్ధాల అసలు అర్థాన్ని నిర్వచిస్తున్నాయి. భవిష్యత్తులో ప్రపంచం బహుళధ్రువ వ్యవస్థ వైపు కదులుతున్న ఈ సమయంలో, ఇలాంటి యుద్ధాల ప్రభావం మరింత సంక్లిష్టంగా మారే అవకాశముంది. అందుకే ఈ అంశంపై సమగ్ర అవగాహన అవసరం.

# ఇండియాకు ఆయిల్ భద్రత – యూఏఈ వేదిక కానుందా!?

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో శక్తి (ఎనర్జీ) భద్రత అత్యంత కీలక అంశం. ప్రత్యేకంగా ఇండియా వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆయిల్ సరఫరా స్థిరత్వం జీవనాడి వంటిది. ఈ నేపథ్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) భారత్‌కు ఆయిల్ భద్రతలో కీలక భాగస్వామిగా మారుతుందా అనే ప్రశ్న ప్రస్తుతం ప్రాముఖ్యత పొందుతోంది. ఇటీవల గల గ్లోబల్ పరిణామాలు, గణాంకాలు, వ్యూహాత్మక ఒప్పందాలు ఈ అంశాన్ని మరింత ప్రాధాన్యంతో ముందుకు తెచ్చాయి. మొదటగా భారత దేశం ఆయిల్‌పై ఎంతగా ఆధారపడి ఉందో అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం దేశం తన అవసరాల్లో సుమారు 85–90 శాతం క్రూడ్ ఆయిల్‌ను దిగుమతుల ద్వారానే పొందుతోంది . 2025–26 నాటికి ఈ దిగుమతి ఆధారితత 88.5 శాతానికి చేరుకుంది . ఇది భారత ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ మార్కెట్ మార్పులు, రాజకీయ ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితులకు బలహీనంగా చేస్తుంది. రోజుకు సుమారు 4.5 మిలియన్ బ్యారెల్స్ వరకు క్రూడ్ ఆయిల్ దిగుమతి అవుతుండటం దేశ అవసరాల తీవ్రతను తెలియజేస్తుంది. ఈ నేపథ్యంలో ఇండియా తన ఆయిల్ సరఫరా వనరులను విస్తరించడానికి ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం భారత్ సుమారు 40 దేశాల నుంచి ఆయిల్ దిగుమతి చేస్తోంది. రష్యా, ఇరాక్, సౌదీ అరేబియా ప్రధాన సరఫరాదారులు కాగా, యూఏఈ నాలుగో అతిపెద్ద సరఫరాదారుగా ఎదిగింది. 2024లో యూఏఈ నుండి భారత్‌కు వచ్చిన క్రూడ్ ఆయిల్ విలువ సుమారు 13.45 బిలియన్ డాలర్లు. మొత్తం మినరల్ ఫ్యూయల్స్ దిగుమతులు 22.79 బిలియన్ డాలర్లకు చేరుకోవడం గమనార్హం. ఇది యూఏఈ ప్రాధాన్యతను స్పష్టంగా చూపిస్తుంది.

యూఏఈ యొక్క వాటా భారత్ ఆయిల్ దిగుమతుల్లో సుమారు 10--11 శాతం వరకు పెరిగింది. గత కొన్నేళ్లలో ఇది క్రమంగా పెరుగుతూ వస్తోంది. దీనికి ముఖ్య కారణాలు భౌగోళిక సమీపం,



రవాణా సౌలభ్యం, రాజకీయ స్థిరత్వం. గల్ఫ్ ప్రాంతం నుండి ఆయిల్ సరఫరా చౌకగా, వేగంగా చేరడం భారత్‌కు లాభదాయకం. ఇప్పుడు యూఏఈ ప్రాధాన్యత పెరగడానికి మరో ముఖ్య కారణం – గ్లోబల్ ఆయిల్ రాజకీయాల్లో వచ్చిన మార్పులు. తాజాగా యూఏఈ ఌపజుజ నుంచి బయటకు రావడం ఒక కీలక పరిణామం. దీని వల్ల యూఏఈ ఇకపై ఉత్పత్తి పరిమితులకు లోబడకుండా స్వతంత్రంగా ఆయిల్ ఉత్పత్తిని పెంచగలదు. . ఇది భారత్ వంటి దిగుమతి దేశాలకు మంచి అవకాశాన్ని అందిస్తుంది. యూఏఈ ఉత్పత్తి సామర్థ్యం ఇప్పటికే రోజుకు 4.8 మిలియన్ బ్యారెల్స్‌కు చేరుకుంది.

యూఏఈ నిర్ణయం వల్ల ఆయిల్ ధరలు స్థిరపడే అవకాశం ఉంది. OPEC నియంత్రణ తగ్గితే మార్కెట్‌లో పోటీ పెరుగుతుంది. దీనివల్ల భారత్‌కు తక్కువ ధరలకు ఆయిల్ లభించే అవకాశముంది. . అంతేకాకుండా, భారత్–యూఏఈ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కూడా బలపడుతున్నాయి. ఇటీవల ఇరు దేశాలు వ్యూహాత్మక నిల్వలు (Strategic Petroleum Reserves) మరియు దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలపై దృష్టి పెడుతున్నాయి. ఇంకా ఒక ముఖ్య అంశం – హోర్ముజ్ జలసంధి (Strait of Hormuz). ప్రపంచ ఆయిల్ సరఫరాలో సుమారు 20 శాతం ఈ మార్గం ద్వారా జరుగుతుంది. ఇటీవల ఈ ప్రాంతంలో యుద్ధ పరిస్థితులు, ఉద్రిక్తతలు పెరగడం వల్ల సరఫరా అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉంది. భారత్ దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ మార్గాలను, నిల్వలను అభివృద్ధి చేస్తోంది. ప్రస్తుతం భారత్‌కు వచ్చే ఆయిల్‌లో 70 శాతం హోర్ముజ్ వెలుపల మార్గాల ద్వారా వస్తుండటం ఒక సానుకూల పరిణామం. అయితే యూఏఈపై పూర్తిగా ఆధారపడటం కూడా ప్రమాదకరం. మధ్యప్రాచ్య ప్రాంతం రాజకీయంగా అస్థిరంగా ఉంటుంది. ఇరాన్ యుద్ధం, గల్ఫ్ దేశాల మధ్య విభేదాలు, అంతర్జాతీయ ఒత్తిడులు సరఫరాపై ప్రభావం చూపవచ్చు. అందువల్ల భారత్ "డైవర్సిఫికే షన్" వ్యూహాన్ని కొనసాగించాల్సిందే. మరోవైపు, భారత్ తన ఎనర్జీ భద్రతను పెంచడానికి పునరుత్పాదక శక్తి (Renewable Energy), ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ ఇంధనం వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలి. దీర్ఘకాలంలో ఆయిల్‌పై ఆధారపడటం తగ్గించకపోతే ఆర్థిక ఒత్తిడి పెరుగుతుంది. చివరిగా చెప్పాలంటే, యూఏఈ భారత్‌కు కీలక ఆయిల్ భాగస్వామిగా ఎదుగుతున్నది. తక్కువ ధరలు, సమీప భౌగోళిక స్థానం, ఉత్పత్తి పెంపు సామర్థ్యం వంటి అంశాలు భారత్‌కు లాభదాయకం. అయితే పూర్తి భద్రత కోసం భారత్ బహుముఖ వ్యూహాన్ని అనుసరించాలి. యూఏఈ ఒక ముఖ్య వేదికగా మారవచ్చు కానీ ఏకైక ఆధారం కాదు. భారత్ ఆయిల్ భద్రత భవిష్యత్తు – "వైవిధ్యం వ్యూహాత్మక భాగస్వామ్యం స్వయం సమృద్ధి" అనే మూడు సూత్రాలపై ఆధారపడి ఉంటుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# 'స్టాప్ బోర్ బ్లాస్టింగ్ – సేవ్ ఎన్విరాన్మెంట్'

## జర్నలిస్ట్ 'రాజేందర్' యుద్ధ ప్రకటన

పర్యావరణ విధ్వంసంపై పోరాటం ఒక్కరోజుతో ముగిసేది కాదు. సరిగ్గా ఆరేళ్ల క్రితం, 2020లో "సహజ వనరుల పరిరక్షణ వేదిక" ప్రచురించిన 'స్టాప్ బోర్ బ్లాస్టింగ్ – సేవ్ ఎన్విరాన్మెంట్' బుక్లెట్, ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగుతున్న పర్యావరణ, సహజ వనరుల విధ్వంసంపై ఒక శక్తివంతమైన సాక్ష్యంగా నిలుస్తున్నది. సీనియర్ జర్నలిస్ట్ దామెర రాజేందర్ (దారా) రికార్డు చేసిన ఈ విశ్లేషణ బుక్ లెట్ నాడు వెలువడిన సమయం నుండి నేటి వరకు పర్యావరణ ప్రేమికులకు, సహజ వనరుల పరిరక్షకులకు ఒక కరదీపికగా, విధ్వంసకారులకు ఒక యుద్ధ ప్రకటనగా నిలుస్తోంది.




2020వ సంవత్సరంలో ప్రపంచమంతా ఒక విపత్కర పరిస్థితుల్లో ఉన్నప్పుడు, స్థానికంగా సాగుతున్న ప్రకృతి దోపిడీని ఈ బుక్లెట్ ద్వారా ఎండగట్టారు. సహజ వనరుల పరిరక్షణ వేదిక పక్షాన వెలువడిన ఈ రచన, కేవలం ఫిర్యాదులకే పరిమితం కాకుండా, శాస్త్రీయ ఆధారాలతో వ్యవస్థల వైఫల్యాన్ని ఎండగట్టింది. ఆనాడు ఆయన వేసిన పునాది నేడు వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో పర్యావరణ చైతన్యానికి ఒక అడుగు పడిందనే చెప్పాలి. క్రషర్ల నుండి వెలువడే సిలికా ధూళి కణాలు గాలిలో పరిమితిని మించి పీలుస్తున్న ప్రజల ఊపిరితిత్తులను ఎలా ఛిద్రం చేస్తున్నాయో, ఎలా చేస్తాయో రాజేందర్ ఆనాడే హెచ్చరించారు. 2020లో ఆయన వ్యక్తం చేసిన ఆందోళనను నేటి ఆరోగ్య పరిస్థితులతో ముడిపెట్టి చూస్తే.. ఎంతమంది గ్రామీణులు శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారో ఒక్కసారి పరీక్షిస్తే అర్థమవుతుంది. పచ్చని పొలాలపై దుమ్ము పేరుకుపోయి, రైతులు నష్టపోతున్న తీరును వివరిస్తూ, ఇది కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదు, రైతు జీవన్మరణ సమస్య అని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

క్వారీ నిర్వాహకులు, మైనింగ్ అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య ఉన్న బంధాన్ని ఆయన నిర్భయంగా ఎండగట్టారు. 2020 నాటి ఆ బుక్లెట్‌లో ప్రస్తావించిన అక్రమ క్వారీలు, సీనరేజ్ పన్నుల ఎగవేత అంశాలు నేటికీ చర్చనీయాంశాలుగానే ఉన్నాయి. "కంచే చేను మేసిన చందంగా" రక్షణ కల్పించాల్సిన యంత్రాంగం నిర్వాహకులకు వత్తాసు పలకడాన్ని రాజేందర్ తీవ్రంగా నిరసించారు. తమ మనుగడ కోసం పోరాడిన ఆత్మకూర్ మండలంలోని కొత్తగట్టు–మల్కపేట గ్రామస్థులపై అక్రమ కేసులు బనాయించిన ఉదంతం ఈ బుక్లెట్‌లో అత్యంత కీలకమైన అంశం. 2020లో ఈ సంఘటనపై ఆయన వినిపించిన గొంతుక, అణచివేతకు గురవుతున్న బాధితులకు గొప్ప నైతిక బలాన్ని ఇచ్చింది. నాటి ఆ పోరాట స్ఫూర్తి నేటికీ పర్యావరణ ఉద్యమాల్లో ఆ ప్రాంతంలో సజీవంగా ఉంది. ఆనాడు సహజ వనరుల పరిరక్షణ వేదిక ద్వారా రాజేందర్ వేసిన ప్రశ్నలు 2026లోనూ సమాధానం లేని ప్రశ్నలుగానే మిగిలి ఉన్నాయి. పర్యావరణ చైతన్యం పెరిగినప్పటికీ, దోపిడీ రూపం మార్చుకుంది తప్ప ఆగలేదు. 'గ్రెటా థంబర్గ్' ప్రసంగాన్ని ఉటంకిస్తూ ఆయన ఇచ్చిన హెచ్చరిక.. మన స్వార్థం కోసం భావితరాల భవిష్యత్తును నాశనం చేసే హక్కు మనకు లేదని నిరంతరం గుర్తు చేస్తూనే ఉంటుంది.

'స్టాప్ బోర్ బ్లాస్టింగ్ – సేవ్ ఎన్విరాన్మెంట్' ద్వారా దామెర రాజేందర్ ఒక చారిత్రక బాధ్యతను నెరవేర్చారు. 2020లో వెలువడిన ఈ బుక్లెట్, నేటికీ పర్యావరణ ప్రేమికులకు, బాధ్యతాయుతమైన పౌరులకు ఒక మార్గదర్శిగా ఉంటుందని చెప్పక తప్పదు. గడిచిన ఆరేళ్ల కాలంలో పర్యావరణ పరిస్థితులు మరింత దిగజారడం చూస్తుంటే, రాజేందర్ యుద్ధ ప్రకటన ఎంతటి ఆవశ్యకమైనదో స్పష్టమవుతోంది. రచయిత ఈ యుద్ధంలో ఎవరినీ వదిలిపెట్టలేదు. క్వారీ నిర్వాహకులు, మైనింగ్ అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య ఉన్న 'అపవిత్ర బంధాన్ని' ఆయన నిర్భయంగా ఎండగట్టారు. నివాస ప్రాంతాలకు వంద మీటర్ల దూరంలోనే క్వారీలు నడవడం, భారీ పేలుళ్ల వల్ల ఇళ్లు బీటలు వారడం, ఎస్సారెస్పి కాలువగట్లను అప్పనంగా క్రషర్ల నిర్వాహకులు ఉపయోగించుకోవటం వంటి అంశాలను ప్రస్తావిస్తూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలు ఎలా విఫలమయ్యాయో తర్కబద్ధంగా నమోదు చేశారు. ఈ బుక్లెట్ కేవలం ఒక సమాచార నిధి మాత్రమే కాదు, భావితరాల శ్వాసను కాపాడటానికి ఒక జర్నలిస్ట్ సాగిస్తున్న ధర్మయుద్ధం. పర్యావరణ పరిరక్షణ కోసం మౌనం వీడాల్సిన సమయం ఆసన్నమైందని గుర్తుచేసేలా ఈ బుక్ లెట్ హెచ్చరిస్తోంది.

**ఆర్. ఎల్ మూర్తి**
రిసెర్చ్ స్కాలర్ –నిరుద్యోగ జేఏసీ కన్వీనర్
ఉస్మానియా యూనివర్సిటీ

# కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**టీజీ ఐఐసి చైర్పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి**
**సంగారెడ్డిలో ఘనంగా మే డే వేడుకలు**



సంగారెడ్డి, మే 1 (జనంసాక్షి) : కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని టీజీ ఐఐసి చైర్పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి అన్నారు. తర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా సంగారెడ్డిలో శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు ఫ్యాక్టరీల శాఖల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి హాజరై కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.... దేశ అభివృద్ధికి కార్మికుల పాత్ర అమోఘమని అన్నారు. సమాజ నిర్మాణంలో కార్మికులు కీలక శక్తిగా నిలుస్తారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. కార్మికుల హక్కులను పరిరక్షించడంతో పాటు వారికి భద్రత, న్యాయం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి కార్మికుడు గౌరవంతో జీవించేందుకు అవసరమైన అవకాశాలు కల్పించేందుకు కృషి కొనసాగుతుందని చెప్పారు. అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ.... కార్మికులు తమ పనుల్లో భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో పని చేసే కార్మికుల రక్షణ కోసం తీసుకునే జాగ్రత్తలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని, అవగాహనతో పనిచేస్తే ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ.. జిల్లాలో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి కార్మికుడికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం కార్యక్రమంలో కొందరు కార్మికులకు లేబర్ గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభు గౌడ్,కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడ్డి ,అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# చెరువుల పునరుద్ధరణలో.. నివాసాలు కోల్పోయిన పేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు

- బాధితులకు ప్రభుత్వ నిర్ణయాన్ని వెల్లడించిన హైడ్రా కమిషనర్

హైదరాబాద్, మే 01 (జనంసాక్షి) పేదవారిపేరుతో కబ్జాదారులు చేసే దుష్ప్రచారానికి ప్రభుత్వం చెక్ పెడుతోంది. పేదవారిని ముందు పెట్టి కబ్జాలకు పాల్పడే బడాబాబుల భరతం పడుతూనే బాధితులకు అన్యాయం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. చెరువులను పునరుద్ధరిస్తున్న క్రమంలో నివాసాలు కోల్పోయిన పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. మాధాపూర్‌లోని సున్నం చెరువుతో పాటు ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ చెరువులో నివాసాలు కోల్పోయిన వారితో హైడ్రా కమిషనర్ శుక్రవారం సమావేశమయ్యారు. చెరువుల పునరుద్ధరణలో నివాసాలు కోల్పోయిన పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, ఈ విషయాన్ని చెప్పాలని సూచించిన విషయాన్ని బాధితులకు తెలిపారు. ఈ మేరకే చెరువు పరిధిలో ఎన్ని గుడిసెలు ఉన్నాయి.. ఎంత మంది నివాసం ఉంటున్నారనే విషయాలపై పూర్తి సమాచారం సేకరిస్తున్నామని హైడ్రా కమిషనర్ చెప్పారు. త్వరలోనే అందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు.



**అవకతవకలకు ఆస్కారం లేకుండా..**

గూగుల్ మ్యాప్స్, శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఈ జాబితాను సిద్ధం చేస్తున్నామని హైడ్రా కమిషనర్ తెలిపారు. 2024 జులై 19వ తేదీకి ముందు నివాసం ఉన్నవారి లెక్కలు సేకరిస్తున్నామన్నారు. నగరంలో చెరువులను పునరుద్ధరించిన అన్ని చోట్ల ఇదే విధానాన్ని అనుసరించాలని సీఎం సూచించారని తెలిపారు. పేదవారికి ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలనేదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. జీవనోపాధికి నగరానికి వచ్చి చెరువుల చెంత గుడిసెలు వేసుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారి విషయంలో ప్రభుత్వం చాలా సానుకూలంగా ఉందన్నారు. ఎక్కడి నుంచి వచ్చారు.. ఏం చేస్తున్నారనే విషయాలను బాధితులను హైడ్రా కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. నల్గొండ, నాగర్‌కర్నూలు, దేవరకద్ర, మహబూబ్‌నగర్, ఆంధ్రాలోని పలు జిల్లాలతో పాటు పరిగి, తాండూరు ప్రాంతాలకు చెందిన వారిగా బాధితులు పరిచయం చేసుకున్నారు. చెత్త ఏరుకునేవారికి ఎక్కడా ఇళ్లు అద్దెకు దొరకని పరిస్థితుల్లో చెరువుల చెంత చేరామని బాధితులు ఈ సందర్భంగా తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పష్టమైన ఆధారాలతో జాబితాను సిద్ధం చేయాలని ఈ సందర్భగా అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు.

**నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగియడమే ఆలస్యం నరేంద్ర మోడీ ప్రభుత్వం కమర్షిల్ గ్యాస్ సిలిండర్ల ధర పెంచడంపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ నిర్ణయాన్ని తప్పుబడుతూ శుక్రవారం కొప్పుల ఈశ్వర్ ప్రెస్ నోట్ విడుదల చేశారు.**

# మధు కుటుంబానికి డిప్యూటీ సీఎం భట్టి భరోసా

- మిర్యాలగూడలో మధు నివాసానికి వెళ్లి కుటుంబానికి పరామర్శ
- కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పిన ఉపముఖ్యమంత్రి
- హైదరాబాద్‌కు జ్యోతి బదిలీ, కుమారుడికి ఉద్యోగంపై సానుకూల హామీ

హైదరాబాద్ (జనంసాక్షి) : ఉన్నతమైన విలువలు, వృత్తి పట్ల అంకితభావం కలిగిన సిపీఆర్వో మారబోయిన మధుసూదన్ కోల్పోవడం బాధాకరమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దివంగత సిపీఆర్వో మారబోయిన మధుసూదన్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం మిర్యాలగూడలోని మధుసూదన్ నివాసానికి వెళ్లిన ఆయన, శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మధుసూదన్ భార్య జ్యోతి, తల్లి పార్వతమ్మలతో మాట్లాడిన భట్టి విక్రమార్క.. మధుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పాత్రికేయ విలువలకు మధు నిలువెత్తు రూపం. సమాజం పట్ల ఆయనకున్న దృక్పథం, వృత్తిలో ఆయన చూపిన నిబద్ధత ఎందరికో ఆదర్శం అని ఆయన కొనియాడారు. మధు మృతి ఆ కుటుంబానికే కాకుండా వ్యక్తిగతంగా తనకు కూడా తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరామర్శ సమయంలో కుటుంబ సభ్యులు తామ ఎదుర్కొంటున్న సమస్యలను ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా మధు సూదన్ సతీమని జ్యోతి ప్రస్తుతం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో కోఆర్డినేటర్‌గా హైదరాబాద్‌లో డెప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. తన కుమారుడి



భవిష్యత్తు నిమిత్తం తనను శాశ్వతంగా హైదరాబాద్ లేదా మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లాకు బదిలీ చేయాలని కోరారు. దీనిపై భట్టి స్పందిస్తూ, తక్షణమే అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బీటెక్ పూర్తి చేసిన మధు సూదన్ కుమారుడు వెంకట్ సూరజ్ కు కార్పొరేట్ సంస్థల్లో మంచి ఉద్యోగం వచ్చేలా సహకరించాలని కోరగా, సురేష్ భవిష్యత్తు బాధ్యత తనదేనని డిప్యూటీ సీఎం ప్రకటించారు. సీఈపీఆర్వో దివంగత మధుసూదన్ కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటామని, వారికి ఎటువంటి అవసరం వచ్చినా, ఇబ్బంది కలిగినా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని భట్టి విక్రమార్క తెలిపారు. వ్యక్తిగతంగానూ ఆ కుటుంబానికి పూర్తి సహకారం అందిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు.

# భార్యపై మోజు.. ఆస్తిపై కన్ను

**పథకం ప్రకారం భర్త హత్య**

**హత్య కేసు ఛేదించిన పోలీసులు.. వివరాలు వెల్లడించిన డీఎస్పీ నల్లపు లింగయ్య**

నారాయణపేట జిల్లా బ్యూరో, మే 1 (జనంసాక్షి) : ఓ మహిళపై మోజుపడి, వారి ఆస్తిని కాజేయాలన్న దుర్బుద్ధితో పథకం ప్రకారం ఆమె భర్తను దారుణ హత్యకు పాల్పడిన కేసును పోలీసులు కేవలం నాలుగు రోజుల్లో చేధించారు. మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోనీ ఖాజీపూర్ గ్రామంలో సంచలనంగా మారిన ఈ కేసును పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు నారాయణపేట డీఎస్పీ నల్లపు లింగయ్య మద్దూర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఏప్రిల్ 27న రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఖాజీపూర్ గ్రామ శివారులోని తన పొలం వద్ద కొత్తగా నిర్మిస్తున్న కోళ్ళ షెడ్డు దగ్గర హైమద్ అలియాస్ అహ్మద్ (42) ఉన్నాడు. ఆ సమయంలో అతని సడ్డకుడు మహమ్మద్ ఖాజా అలియాస్ చేట్టుకింది ఖాజా (33) పథకం ప్రకారం దాడి చేసి హత్య చేశాడు. అంతకుముందే నిందితుడు అహ్మద్ భార్యపై అనుచిత కోరికలు పెట్టడం, ఆమె నిరాకరించడం, రూ.5 లక్షలు అప్పుగా ఇవ్వమని అడగగా అహ్మద్ తిరస్కరించడం వల్ల ఇరువురి మధ్య విభేదాలు ఏర్పడ్డాయనీ తెలిపారు. ఈ కక్షతో నిందితుడు అహ్మద్‌ను హత్య చేసి, అతని భార్యను, ఆస్తిని స్వాధీనం చేసుకోవచ్చని భావించాడు. కోళ్ల షెడ్డు వద్ద ఒంటరిగా ఉన్న సమయాన్ని గమనించిన నిందితుడు ముందుగా అతనితో మాట్లాడి, అనంతరం చేతులతో దాడి చేసి కింద పడగొట్టాడు. తరువాత సిమెంట్ పెళ్లా, రాళ్లతో ముఖం, తలపై తీవ్రంగా గాయపరచడంతో మృతుడు అక్కడికక్కడే ప్రాణం విడిచాడు. నిందితుడు సంఘటన స్థలం నుండి



బైక్ పై పారిపోయాడు. ఈ ఘటనపై క్రైమ్ నెం.110/2026 యు/సెక్షన్ 103(1) బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేయగా.. విచారణలో నేరాన్ని ఒప్పుకున్నాడు. మోటార్ సైకిల్, ఒక సెల్ ఫోన్, రక్తపు మరకలు గల బట్టలుస్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించ డం జరిగింది అని డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు.కేసును జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు డీఎస్పీ నల్లపు లింగయ్య పర్యవేక్షణలో కోస్గి సీఐ సైదులు, మద్దూర్ ఇంచార్జి ఎస్సై విజయ్ భాస్కర్, కోస్గి ఎస్ఐ బాలరాజు, డబ్ల్యు ఎస్సై రేవతీ, ఏఎస్సై బాలయ్య, హెడ్ కానిస్టేబుల్‌లు పెంటయ్యా, గోపాల్, పీసీలు పుల్చానాయక్, నాగ మల్లయ్య, రవీందర్, సిసిఎస్ పిసిలు రాఘవేందర్ రెడ్డి, శశి గౌడ్, ఆశ్రప్ అలీ, నరసింహులు, గణేష్‌లను డిఎస్పీ నల్లపు లింగయ్య అభినందించారు. త్వరలో ఎస్పీ చేత వారికి రివార్డు అందించనున్నట్టు తెలిపారు.

# జర్నలిస్టులను హత్య చేసిన వారిని ఎన్కౌంటర్ చేయాలి

**సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి : జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి హత్యకు నిరసనగా ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద క్యాండిల్ ర్యాలీ**



సికింద్రాబాద్ (జనంసాక్షి): జర్నలిస్టులను హత్య చేసిన వారిని ఎన్కౌంటర్ చేయాలని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి పేర్కొన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం తక్షణమే పటిష్టమైన చట్టాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి హత్యను నిరసిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద పలువురు జర్నలిస్టులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టులు యాదగిరి, కె. కోటేశ్వరరావు లు ముఖ్య అతిథులుగా హాజరై కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...దేశంలో జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఏపీలో జరిగిన జగన్మోహన్ రెడ్డి హత్య బాధాకరమన్నారు. తక్షణమే ఆయన కుటుంబానికి కోటి రూపాయల నగదు అందించి ఏపీ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వాస్తవాలను వెలికితీసే జర్నలిస్టులే లక్ష్యంగా మారుతున్నారని, వారికి రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయనని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకర పరిణామని హెచ్చరించారు. ప్రభుత్వ యంత్రాంగం, అధికారులు, రాజకీయ నాయకులు మాఫియాలకు అండగా నిలవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, దాడులకు పాల్పడిన వారిపై వేగంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# అర్ధరాత్రి గుండు దేవుడు క్షుద్ర పూజలు

**బహిరంగ ప్రదేశంలో రాత్రిపూట బాలికపై ప్రయోగం**

- ప్రజలు పట్టుకొని దేవుడికి దేహశుద్ధి
- తాండూర్ పోలీసులకు ఫిర్యాదు
- క్షుద్ర పూజలో బాలిక తల్లి కీలకపాత్ర

వికారాబాద్ జిల్లా బ్యూరో మే 1 (జనంసాక్షి): ఆటవిక నాగరికత నుంచి నవీన యుగములోకి అడుగు వేసాం. కానీ పట్టణ గ్రామీణ ప్రాంతంలో జనం ఇంకా మూఢవిశ్వాసాల వైపు మొగ్గ చూపుతున్నారు. అందులో భాగంగానే బహిరంగ ప్రదేశంలో అర్ధరాత్రి వేళ క్షుద్ర పూజలు నిర్వహిస్తున్న ఒక మాంత్రికుడిని పట్టుకొని జనం దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో జరిగింది. కాలనీవాసులు పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రవంచకు చెందిన సాయమ్మ అనే మహిళా తన కొడుకు కోడలు మధ్య విభేదాలు సృష్టించడానికి నెల రోజుల క్రితం గుండు దేవుడు అనే మంత్రగాన్ని ఆశ్రయించి ఇంట్లో క్షుద్ర పూజలు చేయించింది. ఇదే తంతుగా గురువారం తెల్లవారుజామున ఇందిరానగర్ లోని విలియం మూన్ స్కూల్ మైదానంలో అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక బాలికను చీకట్లో కూర్చోబెట్టి క్షుద్ర పూజలు నిర్వహించారు. పట్టం వేసి ఒక నల్ల కోడి గుమ్మడికాయ ఇతర పూజ సామాగ్రితో క్షుద్ర పూజ నిర్వహిస్తుండగా కాలనీవాసులు గుండు దేవుడు మంత్ర గాడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. చంద్రవంచకు గ్రామానికి చెందిన సాయమ్మ ఇందిరానగర్ లో నివాసం ఉంటుంది. మూడవిశ్వాసాలపై నమ్మకం ఉన్న ఆమె కొడుకుతో కోడలు కలిసిమెలిసి ఉండాలని ముందుగా గుండు దేవుడు అనే మంత్రగాడితో క్షుద్ర పూజలు చేయించింది. తర్వాత కన్న కూతురు ఒక వ్యక్తిని ప్రేమించిందని తెలిసి వారి మధ్య ఉన్న ప్రేమ బంధం తెగిపోవడానికి పెండ్లి పీతాకులు కావడానికి క్షుద్ర పూజలు చేయించింది. అర్ధరాత్రి బహిరంగ ప్రదేశంలో



కూతురిని ఒంటరి చేసి మంత్రగాడితో క్షుద్ర పూజల తంతు సాగిస్తుండగా కాలనీవాసులు పట్టుకున్నారు. కన్న కూతురిని ఒంటరిగా మంత్రగాడికి కన్నతల్లి అప్పగించడం పట్ల కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్ర గాడికి దేహశుద్ధి చేసి తాండూరు పోలీసులకు అప్పగించారు. విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కూతురు ఎవరినో ప్రేమిస్తే అన్ని విషయాలు తెలుసుకుని నచ్చకపోతే వెళ్లి రద్దు చేసుకోవాలి కానీ మంత్రగాడి చేతిలో పెట్టి పెళ్లి పీటాకులు కావాలని క్షుద్ర పూజలు చేయించడం ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నవీన యుగంలో సాంకేతికంగా అభివృద్ధి చెంది విద్యావంతులైన సమాజంలో ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరమని మరోసారి ఇలాంటి సంఘటన జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.

# విద్య రంగం పటిష్టత, ఉద్యోగాల కల్పనకు చిత్తశుద్ధితో ఉన్నాం

**శిల్పారామంలో మెగా జాబ్ మేళాను ఘనంగా ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి**

**సుమారు 6000 మంది యువతీ, యువకులు హాజరు**



మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 01 (జనంసాక్షి): ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి సారథ్యంలో విద్యా రంగం ను బలోపేతం చేస్తూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అహర్నిశలు చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర పశు సంవర్ధక,పాడి అభివృద్ధి,మత్స్య,క్రీడలు,యువజన శాఖా మంత్రి వాకిటి శ్రీ హరి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శిల్పారామంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం యువత సంక్షేమం వారి భవిష్యత్తు కోసం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గురుకుల



పాఠశాలలు, వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాల కోసం మెస్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు వివరించారు. గత పదేళ్లుగా నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను పునఃప్రారంభించి సుమారు 25 వేల మందికి ప్రయోజనం కల్పించామని, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జాబ్ మేళాను ఉపయోగించుకొని యువత తమ ప్రతిభను ప్రదర్శించి ఉద్యోగాలు సాధించుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. డిగ్రీ సర్టిఫికెట్లు మాత్రమే కాకుండా ప్రొఫెషనల్ స్కిల్స్ కూడా అవసరమని యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. టెక్నాలజీ పరిజ్ఞానం, ప్రాక్టికల్ అనుభవం ఉద్యోగ సాధనలో కీలకమని తెలిపారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, 99 రోజుల కార్యాచరణలో భాగంగా పది థీమ్ లను నిర్ణయించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూత్ సర్వీసెస్ థీమ్ కింద ఈ జాబ్ మేళా నిర్వహించడం గొప్ప నిర్ణయమన్నారు. జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా మాట్లాడుతూ.. జిల్లాలో నిర్వహించిన ఈ మెగా జాబ్ మేళా పట్ల సంతోషం వ్యక్తం చేసిన కలెక్టర్, ఐటీ శాఖ, టిఎస్‌కే సహకారంతో హైదరాబాద్‌తో పాటు స్థానికంగా ప్రముఖ కంపెనీలు పాల్గొనడం విశేషమన్నారు. సుమారు 6,000 మంది యువత పాల్గొనడం ఆనందకరమని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులకు మంత్రి వాకిటి శ్రీహరి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యం.ఎల్ .సి,,శాసన మండలి చీఫ్ విప్, పట్నం మహేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ తెలంగాణ చైర్మన్ శివ సేనా ఏ. సోని బాల దేవి,టాస్క్ సి ఈ. ఓ నితిన్ కుమార్ రెడ్డి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# మహిళల భద్రతకు 'సఖి' భరోసా

**అల్వాల్ వన్‌స్టాప్ సెంటర్ సందర్శన**

**బాధితులకు అండగా ఉండాలని సిబ్బందికి ఆదేశం**

అల్వాల్, మే 01 (జనంసాక్షి): ఆపదలో ఉన్న మహిళలకు తక్షణ రక్షణ, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ అందించడంలో సఖి సెంటర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అల్వాల్‌లోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించి, అక్కడ అందుతున్న సేవలపై సిబ్బందితో చర్చించారు. బాధితులకు అవసరమైన వైద్య సాయం, తాత్కాలిక వసతి ఏర్పాటుపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు ఏవైనా సమస్యలు ఎదుర్కొన్నప్పుడు భయం వీడి ధైర్యంగా ముందుకు రావాలని, సఖి కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేధింపులకు గురయ్యే వారికి ఒకే గొడుగు కింద అన్ని రకాల సేవలు అందించడం అభినందనీయమన్నారు. కేంద్రంలోని సదుపాయాలను పరిశీలించిన ఆయన, భవిష్యత్తులో బాధితులకు మరింత మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సఖి సెంటర్ బాధ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# సంగారెడ్డి జిల్లా అనుబంధం మర్చిపోలేనిది

**జిల్లాలో విధులు నిర్వహించడం గొప్ప అనుభూతి : కలెక్టర్ ప్రావీణ్య**

సంగారెడ్డి ప్రతినిధి, మే 01 (జనంసాక్షి) : సంగారెడ్డి జిల్లా అనుబంధం మర్చిపోలేని బదిలీపై వెళ్లిన జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన కలెక్టర్ పి. ప్రావీణ్య రహదారులు, భవనాల ప్రత్యేక కార్యదర్శిగా బదిలీపై వెళ్లిన సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆమెకు ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇదే వేదికపై నూతన జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్ జైన్‌కు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొని, బదిలీ పై వెళ్లిన కలెక్టర్ ప్రావీణ్య సేవలను కొనియాడుతూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రావీణ్య మాట్లాడుతూ... తాను జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి కింది స్థాయి ఉద్యోగి నుంచి ప్రతి శాఖాధికారి వరకు అందరూ సంపూర్ణ సహకారం అందించారని తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో అందరి సహకారం ఎంతో కీలకంగా నిలిచిందన్నారు. నూతన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ప్రావీణ్య జిల్లా కలెక్టర్‌గా తనదైన ప్రత్యేక ముద్ర వేశారని కొనియాడారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రావీణ్యతో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, రెవెన్యూ, ట్రెసా యూనియన్ అధ్యక్షులు గంగాధర్, కిరణ్ కుమార్ టీఎన్జీఓ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
02 మే 2026

# గ్రామీణ విద్యార్థులకు పట్టణ స్థాయి విద్యా సదుపాయాలు

- **రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ డాక్టర్ ఆకునూరి మురళి**



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, మే 1 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలంలో విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా నిర్మాణంలో ఉన్న తెలంగాణ మోడల్ పబ్లిక్ స్కూల్ పనులను రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ డాక్టర్ ఆకునూరి మురళి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ శుక్రవారం ప్రత్యక్షంగా పనుల పురోగతిని పరిశీలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలంలోని పోల్కంపల్లి, వంగూరు, గ్రామాల్లో నిర్మాణం జరుగుతున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ భవిష్యత్తులో గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన, ఆధునిక విద్య అందించే కేంద్రాలుగా రూపుదిద్దుకుంటున్నాయని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్, రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ డాక్టర్ ఆకునూరి మురళి పేర్కొన్నారు.ఈ సందర్భంగా నిర్మాణ పనుల నాణ్యత, వేగం, ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం పనులు కొనసాగుతున్నాయా లేదా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా తరగతి గదులు, లైబ్రరీ భవనాలు, సైన్స్ మరియు కంప్యూటర్ ప్రయోగశాలలు, విద్యార్థుల కోసం ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, క్రీడా మైదానాలు తదితర మౌలిక వసతుల నిర్మాణాలను సమీక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ డాక్టర్ ఆకునూరి మురళి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా పట్టణ స్థాయి విద్యా వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరిస్తోందని తెలిపారు.విద్యార్థుల విద్యకు ఎటువంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనులు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా తరగతి గదులు, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు వంటి ప్రాథమిక వసతులను ప్రాధాన్యతగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.పనుల్లో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ వేగవంతంగా నిర్మాణాలు పూర్తి చేయాలని, ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆధునిక విద్యా వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి విద్యార్థులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం అందుబాటులో ఉండేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని , అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఈ మోడల్ పబ్లిక్ స్కూల్స్‌లో విశాలమైన తరగతి గదులు, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు, ఆధునిక ప్రయోగశాలలు, సమృద్ధిగా పుస్తకాలతో కూడిన గ్రంథాలయాలు, విద్యార్థుల శారీరక వికాసానికి అనువైన క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ విద్యార్థులు కూడా పోటీ ప్రపంచానికి తగిన విధంగా తయారవ్వడానికి ఈ పాఠశాలలు కీలకంగా మారతాయని డాక్టర్ ఆకునూరి మురళి సూచించారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ప్రభుత్వ విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందని, అందులో భాగంగానే నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రథమంగా నెలకొల్పుతున్న ఈ పాఠశాలల నిర్మాణ పనుల్లో ఎలాంటి రాజీ లేకుండా పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు.నిర్మాణ పనుల పురోగతిపై జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందన్నారు. పనులు వేగవంతంగా, నాణ్యతతో పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన మరియు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.పాఠశాల భవనాల నిర్మాణం వేగవంతంగా కొనసాగేందుకు అవసరమైన అన్ని వనరులను సమయానికి అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ముఖ్యంగా ఇసుక సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా జిల్లా యంత్రాంగం మైనింగ్ శాఖ అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తోందన్నారు. పాఠశాల నిర్మాణానికి అవసరమైనంత ఇసుకను ఎప్పటికప్పుడు సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, నిర్మాణ పనులు గడువులోపు పూర్తి అయ్యేలా అన్ని శాఖలు సమిష్టిగా పనిచేస్తాయని కలెక్టర్ తెలిపారు.పనుల నాణ్యత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి దశలో సాంకేతిక ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని వారు అధికారులకు సూచించారు. నిర్మాణ సంస్థలు నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసి విద్యార్థులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు కూడా పనుల పర్యవేక్షణలో భాగస్వామ్యం కావాలని సూచించారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాఠశాలల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని, నిర్మాణ పనులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- **ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి**



**పెద్దశంకరంపేట, మే 1 (జనం సాక్షి) :** రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ డిఆర్డిఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల నాయకులు మధుసూదన్, నారా గౌడ్ ,దాచా సంగమేశ్వర్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పెరమాల గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, పేట ఏఎస్ఐ నాగయ్య, పోలీస్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మేడే స్ఫూర్తితో ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

- **సీపీఐ నేత బోనగిరి రూపేష్ పిలుపు**



**బెజ్జంకి, మే 1 (జనం సాక్షి) :** మేడే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక,ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ పిలుపునిచ్చారు.మండల కేంద్రంలో జరిగిన మేడే వేడుకల్లో ఆయన మాట్లాడుతూ 8 గంటల పనిదినం వంటి హక్కులు,కార్మికుల చారిత్రాత్మక పోరాటాల ఫలితమని,వాటిని బలహీనపరచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు.కార్మిక చట్టాల మార్పులు, ప్రైవేటీకరణ,ధరల భారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా,కార్మిక హక్కుల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ ప్రతి ఉద్యోగికి తప్పనిసరి

- **కల్వకుర్తి డిఎస్పి సాయి రెడ్డి వెంకట్ రెడ్డి**



**ఉర్కొండ, మే 1 (జనం సాక్షి) :** ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఉద్యోగికి ఉంటుందని కల్వకుర్తి డి.ఎస్.పి సాయి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ మహమ్మద్ గఫార్ ఉద్యోగ విరమణ కార్యక్రమం స్థానిక ఎస్సై కృష్ణదేవ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గఫార్‌ను పోలీస్ సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులు, శాలువాలు,గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణదేవ మాట్లాడుతూ ఏఎస్ఐ గఫార్ ఉద్యోగరీత్యా అంకితభావంతో పనిచేశారని ఇలాంటి సిబ్బంది అరుదుగా ఉంటారని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయూబ్ పాషా , ప్రజా ప్రతినిధులు, స్థానిక పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ లు, హెడ్ కానిస్టేబుల్ లు, కానిస్టేబుల్స్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 4 లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు చేయాలి




**నర్సాపూర్, మే 1 (జనం సాక్షి) :** 140వ మేడే ఉత్సవాలు నర్సాపూర్ పట్టణం కేంద్రంలో ఘనంగా జరిగాయి. సిఐటియు జెండాలు కార్మికులు పెద్ద ఎత్తున ఎగరావేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు మాట్లాడుతూ, అమెరికా చికాగో నగరంలోని కార్మికుల పనిగంటలు 18 గంటల నుండి 8 గంటలకు తగ్గియాలని నిరసన చేస్తున్న కార్మికులపై పోలీసులు తుపాకుల తూటాలతో విరుచుకబడి అనేకమంది కార్మికులను బలి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఆ రక్తపు మడుగులో నుంచి తీసిన జెండానే ఎర్ర జెండాగా నేడు ప్రపంచవ్యాప్తంగా కార్మికుల, కర్షకుల కోసం నిరంతరం కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్నది ఎర్రజెండా ఒక్కటే అన్నారు. ఆనాటి కార్మికులు "ప్రపంచ కార్మికులారా ఏకంకండి" అనే నినాదంతో నేడు అనేక మంది కార్మికులు తమ హక్కులను సాధించుకుంటున్నారాని గుర్తుచేసారు. నాటి చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో నేటి కార్మికులు, కర్షకులు అందరూ కలిసి నేడు రాష్ట్రంలో, కేంద్రంలో పరిపాలిస్తున్నటువంటి నియంత ప్రభుత్వాలపై తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. నేడు కేంద్రంలో పరిపాలిస్తున్నటువంటి బిజెపి ప్రభుత్వం కులం, మతం,ప్రాంతం, భాషల పేర్లతో దేశ ప్రజలను రెచ్చగొడుతుందని మండిపడ్డారు. తక్షణమే కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కొనసాగించాలని, 4 లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలనీ డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ, నాయకులు అన్నపూర్ణ, పుష్ప, రాములు, రిజ్వానా, భీమేష్, నర్సింలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యులకు ఎల్‌ఓసీ గొప్ప వరం



**రామచంద్రపురం, మే 1 (జనం సాక్షి) :** ఆసుపత్రి ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్న పేదలకు ఎల్‌ఓసీ ఒక గొప్ప వరమని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రపురానికి చెందిన ముగ్గురు అనారోగ్య బాధితులకు మొత్తం రూ.7.20 లక్షల విలువైన ఎల్‌ఓసీ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యవసర సమయాల్లో వైద్య ఖర్చుల కోసం ఎల్‌ఓసీ పథకం పేదలకు సంజీవనిలా మారిందన్నారు. ఆసుపత్రి ఖర్చులు భరించలేక అప్పుల పాలవుతున్న కుటుంబాలకు ఇది పెద్ద భరోసా కల్పిస్తోందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు ఎమ్మెల్సీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, జిన్నారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిన్నారం మున్సిపాలిటీ నూతన కో-ఆప్షన్ సభ్యుడు నర్సింగరావు ఎమ్మెల్సీ డా. అంజిరెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని, ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి పాలకమండలితో కలిసి పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ముందుండాలని పేర్కొన్నారు.

## కార్మికుల శ్రమే సమాజ అభివృద్ధికి మూలస్థంభం

- **అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్**



**వనపర్తి బ్యూరో, మే 1 (జనంసాక్షి) :** కార్మికుల శ్రమే సమాజ అభివృద్ధికి మూలస్థంభమని, కష్టపడి పనిచేసే ప్రతి కార్మికుడికి గౌరవం ఇవ్వాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మే డే(మే 1) అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలాజీ నాయక్, జెడ్పీ సీఈఓ యాదయ్య, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు ఇతర కార్మికులను అధికారులు ఘనంగా సన్మానించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలోనే అత్యధిక పని దినాలు పనిచేసిన కార్మికురాలు విజయమ్మను కూడా సన్మానించారు. అలాగే ఐటీఐ విద్యార్థులకు ప్రతిభా పురస్కార పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ కార్మికుల శ్రమే సమాజ అభివృద్ధికి మూలస్థంభమని అన్నారు. ప్రతి రంగంలో కార్మికుల పాత్ర అమూల్యమని తెలిపారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్మికుడికి గౌరవం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో కార్మికుల సహకారం కీలకమని చెప్పారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్మికుల చట్టాలపై వారిలో అవగాహన కల్పించి కార్మికుల హక్కులను కాపాడటంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడమే వారికి ఇచ్చే గౌరవం అని తెలిపారు. జిల్లాలోని పరిశ్రమలు కూడా తమ వద్ద పనిచేసే కార్మికులకు మంచి వసతులు కల్పించాలని సూచించారు. అదేవిధంగా కార్మిక శాఖ అధికారులు జిల్లా నుంచి వలస వెళ్లిన వారిని జాతరలు, మరి ఏదైనా ఇతర వేడుకల సందర్భంగా వారు ఇక్కడికి వచ్చినప్పుడు వారిని కలుసుకొని వారికి కార్మిక చట్టాలపై అవగాహన కల్పించి కార్మిక శాఖ తరఫున అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా జిల్లాలో బాల కార్మికులు ఎక్కడైనా ఉన్నట్లు దృష్టికి వస్తే వారిని రక్షించాలని సూచించారు. డీఎస్పీ బాలాజీ నాయక్ మాట్లాడుతూ కార్మికుల కృషి వల్లనే సమాజం ముందుకు సాగుతుందని అన్నారు. ప్రతి వ్యక్తి తన పని పట్ల నిబద్ధతతో ఉండాలని సూచించారు. కార్మికులకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. క్రమశిక్షణ, శ్రమతో విజయాలు సాధ్యమవుతాయని చెప్పారు. కార్మికుల హక్కులను కాపాడటంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐటిఐ కళాశాలకు సంబంధించిన అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న కోర్సులకు సంబంధించిన పోస్టర్, కార్మిక శాఖ ఆధ్వర్యంలో కార్మిక చట్టాలపై, కార్మికులకు కల్పించే పథకాలపై రూపొందించిన బుక్లెట్ ను అధికారులు ఆవిష్కరించారు. జిల్లాకు చెందిన ఏ బీడీ లిక్కర్ పరిశ్రమలో 1600 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి మంచి వసతులు కల్పిస్తున్న యాజమాన్యం తరఫున హాజరైన రీజనల్ మేనేజర్ ఉమాశంకర్ ను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అధికారి రవి, ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ హక్, ఐటిఐ విద్యార్థులు, అధికారులు, సిబ్బంది, కార్మికులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లక్ష్య సాధననే ఉన్నత శిఖరాలకు నాంది

**వనపర్తి బ్యూరో, మే 1 (జనంసాక్షి) :** లక్ష్య సాధననే ఉన్నత శిఖరాలకు నాంది అని, మన అభివృద్ధి సమాజ సేవకు, ఉపయోగపడాలని,మాజీ మంత్రి సింగిరెడ్డి నీరంజన్ రెడ్డి అన్నారు.శుక్రవారం వనపర్తి పట్టణంలోని మాజీమంత్రి నివాసంలో పానగల్ మండలం గోప్లాపూర్ గ్రామానికి చెందిన మిద్దె.సుదర్శన్ హైదరాబాదులోని రాజేంద్ర నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అభినందించి సన్మానించారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ మన మండలం నుండి హైదరాబాద్‌లో వృత్తిరీత్యా స్థిరపడి ఉన్నత స్థానమైన బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నిక కావడం మనకు గర్వకారణం అని అన్నారు.జీవితములో ఉన్నతంగా ఎదిగిన తర్వాత పుట్టిన ఊరికి తల్లిదండ్రులకు మంచి పేరు తెస్తూనే సమాజ సేవకు అంకితం కావాలని కోరారు.న్యాయవాద వృత్తిలో ఉన్నత స్థాయిలో సుదర్శన్ రాణించాలని ఆకాంక్షించారు. నిరంజన్ రెడ్డి వెంట నందిమల్ల అశోక్ ఉన్నారు.



## నియోజకవర్గస్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ హైమావతి**




**సిద్దిపేట బ్యూరో, మే 1 (జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్య చరణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 2వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని శాసనసభ నియోజకవర్గ కేంద్రాలలో నియోజకవర్గస్థాయి కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ మే-2వ తేదీన నిర్వహించే నియోజకవర్గ స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సభ ఏర్పాట్ల గూర్చి ఆర్డీవోలు, జిల్లా అధికారులు, ఇతర శాఖల అధికారులకు జూమ్ సమావేశం ద్వారా దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో ఏప్రిల్ 2 న గ్రామసభ, ఏప్రిల్ 16 వ తేదీన మండల సభలను విజయవంతం చేశారని అలాగే మే 2 వ తేదీన నియోజకవర్గసభల నిర్వహణ ఏర్పాట్లను సైతం పగడ్బందిగా నిర్వహించాలని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ సభ హుస్నాబాద్ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో, సిద్దిపేట నియోజకవర్గ సభ సిద్దిపేట పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో, దుబ్బాక నియోజకవర్గ సభ దుబ్బాక పట్టణంలోని రజనీకాంత్ ఫంక్షన్ హాల్‌లో, గజ్వేల్ నియోజకవర్గ సభ గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో నిర్వహించనున్నామని తెలిపారు. అలాగే జనగాం నియోజకవర్గం పరిధిలోగల జిల్లాలోని కొమరవెల్లి, చేర్యాల, మద్దూరు మరియు దూల్మిట్ట 4 మండలాలు జనగామ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే సభలో పాల్గొని ఆయా అధికారులతో కోఆర్డినేషన్ చేసుకోవాలని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో వేరే జిల్లాలోని నాలుగు మండలాలు సంబంధించి పూర్తి డాటాను సైతం తీసుకొని అందరి సమన్వయంతో సభను నిర్వహించాలని ఆర్డీవో హుస్నాబాద్ ను ఆదేశించారు. ఈ సభల గూర్చి మంత్రులు, స్థానిక ఏంపి, ఏంఎల్ఏ, ప్రజాప్రతినిధులను, అధికారులకు ఆహ్వానం అందించాలనీ, ప్రభుత్వ పథకాలు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల, గృహలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరా మహిళ శక్తి, బ్యాంక్ లింకేజి, వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ, ఎన్ఆర్ ఈజీఎస్ లో చేపట్టిన పనులు, సన్నబియ్యం పంపిణీ, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, సన్న వడ్లకు బోనస్, రైతు భరోసా, రైతు రుణమాఫీ సంబంధించిన పూర్తి సమాచారాన్ని లబ్ధిదారుల నంబర్ మరియు ప్రభుత్వం అందజేసిన నిధుల గూర్చి తెలపాలని, . అలాగే ప్రభుత్వ పథకాల అమలు గూర్చి స్టాల్ లను ఏర్పాటు చేసుకోవాలని,నాచురల్ ఆర్గానిక్ ఫామింగ్ గూర్చి ఆయా మండలంలో ట్రైనింగ్ ఇచ్చిన అధికారులను వారిని పిలుచుకుని సభలో దాని గూర్చి ప్రజలకు తెలపాలని, అలాగే పంట మార్పిడి గురించి తెలియజేయాలని ఆదేశించారు.మే 2 వ తేదీన ఉదయం 10 గంటలకు సభ మొదలు పెట్టాలని, ఎజెండా ఐటమ్స్ వెల్ కం అడ్రస్, తెలంగాణ గీతం, వివిధ పథకాల అమలు గూర్చి ఆయా అధికారులు బ్రీఫ్ గా మాట్లాడాలని, మీరు చేసిన ప్రోగ్రామ్ గురించి మొత్తం ప్రక్రియ డాక్యుమెంట్ చెయ్యాలని ఆదేశించారు. జూన్ 2 నుండి ప్రభుత్వం అమలు చేయబోయే కొత్త పథకాల గూర్చి మీ ద్వారా ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు.అలాగే సభలో ప్రజలు ఏదైనా పిటిషన్ కు ఇచ్చిన స్వీకరించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ జూమ్ మీటింగ్ లో సిపిఓ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

# 'విట్టల్ జొన్న'తో వినూత్న బాట

▫ బాసర రైతు గంగాధర్ సక్సెస్ స్టోరీ



బాసర, ఏప్రిల్ 01(జనం సాక్షి)పట్టుదల, వినూత్న ఆలోచన ఉంటే పంట చేను కాసుల వర్షం కురిపిస్తుందని నిరూపించాడు బాసర మండలంలోని మైలాపూర్ గ్రామ రైతు మమ్మాయి గంగాధర్. అందరూ మొక్కజొన్న, వరి వైపు మొగ్గు చూపుతుంటే, ఆయన మాత్రం 'విట్టల్ జొన్న' అనే వంగడాన్ని నమ్ముకున్నాడు. నాలుగు ఎకరాల తన సొంత పొలంలో ఈ పంటను సాగు చేసి, ఇప్పుడు తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.



### తక్కువ నీరు, ఎక్కువ లాభం...

"మొక్కజొన్నకు 6 నుంచి 7 తడులు నీళ్లు కావాలి. కానీ ఈ 'విట్టల్ జొన్న'కు కేవలం 3 తడులు సరిపోతాయి" అని గంగాధర్ చెబుతున్నాడు. పెట్టుబడి తక్కువ, నీటి వాడకం తక్కువ, తెగుళ్ల బెడద కూడా చాలా తక్కువ. మూడు నెలల ఈ పంట కాలంలో ఒకటి లేదా రెండు సార్లు పురుగుల మందు పిచికారీ చేస్తే సరిపోతుంది.

### దిగుబడిలో దిట్ట...

"ఒక ఎకరానికి సగటున 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. అంటే ఒక్కో క్వింటాల్‌కు 30-35 బస్తాలు. మార్కెట్‌లో కూడా మంచి డిమాండ్ ఉంది" అని ఆనందంగా చెప్పాడు గంగాధర్. రాష్ట్ర ప్రభుత్వం ఈ పంటకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం రైతులకు మరింత భరోసా ఇస్తోంది.

### రైతు మమ్మాయి గంగాధర్ మాటల్లో...

"అందరూ ఒకే పంట వేస్తే ధర రాదు, నష్టం తప్పదు. కాస్త తెలివిగా ఆలోచించి, కొత్త పంటలు వేస్తేనే కష్టానికి తగిన ఫలితం దక్కుతుంది. 'విట్టల్ జొన్న' నాకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం చూపించింది. నీళ్లు తక్కువగా ఉన్న మాగాణి భూములకు ఇది వరం లాంటిది. తోటి రైతులు కూడా సంప్రదాయ పంటలతో పాటు ఇలాంటి లాభదాయకమైన పంటలు వేసి ఆర్థికంగా నిలదొక్కుకోవాలి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు పెట్టడం మా లాంటి రైతులకు పెద్ద ధైర్యం."

# కార్మిక సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పథకాల అమలు

▫ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, మే 1 (జనంసాక్షి) :** కార్మిక సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మే డే వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల నగరపాలక సంస్థ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ దుర్గం క్రాంతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కార్మికుల సంక్షేమంలో భాగంగా మే డేను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్మికుల దినోత్సవం ప్రతి కార్మికుడు గర్వపడవలసిన రోజు అని, జిల్లాలోని అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ప్రమాద రీత్యా మరణించిన 102 కార్మికుల కుటుంబాలకు సుమారు 60 కోట్ల రూపాయలు, సహజ మరణం పొందిన 223 కార్మికుల కుటుంబాలకు సుమారు 24 కోట్ల రూపాయలు, పెళ్లి ప్రోత్సాహం కింద 993 మందికి సుమారు 30 కోట్ల రూపాయలు, ప్రసూతి ప్రోత్సాహం కింద 1 వేయి 646 మందికి సుమారు 49 కోట్ల రూపాయలు, దివ్యాంగత్వం పొందిన వారికి సుమారు 68 కోట్ల రూపాయలు అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 2వ తేదీ నుండి 10వ తేదీ వరకు మే డే వార్షికోత్సవంలో భాగంగా కార్మిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బాల కార్మికులకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం జరుగుతుందని, నైపుణ్యం లేని కార్మికుల నైపుణ్యం పెంపొందించేందుకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందని, అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లు, పారిశ్రామిక శిక్షణ సంస్థల ద్వారా నైపుణ్యాలను మెరుగుపరచడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు ప్రేమ సాగర్ రావు మాట్లాడుతూ జిల్లాలోని కార్మికుల భద్రత, హక్కులను కాపాడడం కోసము ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో త్వరలోనే ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు అయ్యేలా కృషి చేయడం జరుగుతుందని, అసంఘటిత కార్మికులు చనిపోతే వారి కుటుంబానికి ఇచ్చే నగదును 15 లక్షల రూపాయలకు పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ద్వారా సింగరేణిలోని ఒప్పంద కార్మికులకు 5 వేల రూపాయల బోనస్ ఇవ్వడం జరిగిందని, 2 లక్షల 50 వేల రూపాయల లోపు ఆదాయం ఉన్న సింగరేణి రిటైర్డ్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆహార భద్రత, విద్య ప్రతి ఒక్కరికి అందేలా ప్రభుత్వ పథకాలు రూపొందించడం జరిగిందని, ప్రభుత్వం కార్మికులకు, రైతులకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. అనంతరం కార్మిక శాఖకు చెందిన బి.సత్యనారాయణ, ఉపాధి కల్పన క్రింద వై. రమేష్ (ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్) , ఉత్తమ ఎస్టాబ్లిష్మెంట్ క్రింద ఓరియంట్ సిమెంట్-దేవాపూర్, ప్రత్యేక కేటగిరీ (బాల కార్మిక) క్రింద శివాజీ (7 తరగతి విద్యార్థి, జడ్.పి.హెచ్.ఎస్. టేకుల బస్తి, బెల్లంపల్లి) లకు అవార్డులు అందజేశారు.

తదనంతరం జిల్లాలోని 16 మండలాలకు ఏం ఎన్ ఆర్ ఇ జి ఎస్ పనుల కోసం పంచాయతీరాజ్ ఉ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మంజూరు చేసిన కంప్యూటర్లను మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

▫ కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితిక పంత్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 01(జనంసాక్షి ):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల దృష్ట్యా, ప్రశాంత వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించడానికి మే 01 వ తేదీ నుండి మే 30 వ తేది వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ నితిక పంత్ తెలిపారు. 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి,ఎస్పీ లేదా ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవిధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసి కొలిపే ఎటువంటి ఆయుధాలు కల్గిఉండరాదని తెలిపారు. ప్రజా జనజీవనానికి ఇబ్బంది, చిరాకు కల్గించేందుకు దారితీసే ఇబ్బందికర ప్రజా సమావేశాలు, జన సమూహం అలాంటివి పూర్తిగా నిషేధం అన్నారు. చట్టపరమైన జారీచేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం శిక్షార్హులు అవుతారని సూచించారు. నిషేధంలో ఉన్న నిబంధనలను తప్పనిసరిగా అందరూ పాటించాలన్నారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాలని సూచించారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఎటువంటి అనుమతులు లేని ర్యాలీలు నిర్వహించిన వారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

▫ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**దిలావర్పూర్, మే 01, (జనం సాక్షి):** మండలంలోని సిర్గాపూర్ గ్రామన్నీ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆకస్మికంగా తనికి చెసారు. గ్రామంలో మౌనిక అనే లబ్ధిదారురాలుకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడి, ఇప్పటివరకు పూర్తైన నిర్మాణ పనుల వివరాలు, జరిగిన ఖర్చు, ప్రభుత్వ మంజూరు చేసిన నిధుల వినియోగం గురించి వివరంగా తెలుసుకున్నారు. మిగిలి ఉన్న చివరి దశ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయన సూచించారు. హౌసింగ్ శాఖ అధికారులతో మాట్లాడిన కలెక్టర్, ఇంటి నిర్మాణాలు నాణ్యవంతంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నిరంతరం తనిఖీ చేయాలని, ప్రతి దశలో యాప్‌లో ఫోటోలు అప్‌లోడ్ చేసి పారదర్శకతను పాటించాలని తెలిపారు. లబ్ధిదారులకు ప్రభుత్వ నిధులు సకాలంలో అందేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు నిజంగా లబ్ధిదారులకు చేరుతున్నాయా లేదా అనే విషయాన్ని కూడా ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శంకర్, తహసిల్దార్ ఎజాజ్ అహ్మద్, ఎంపీడీవో అరుణ, సర్పంచ్ చైతన్య, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి

▫ హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

▫ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి1 మే (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారులను ఆదేశించారు. శుక్రవారం ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల, ఎలుకుర్తి గ్రామాలలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల వద్ద నిల్వలో ఉన్న ధాన్యాన్ని పరిశీలించి, ఇప్పటివరకు కొనుగోలు చేసిన పరిమాణం, ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ అధికారులు ముందుగానే కూపన్ విధానం అమలు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సరళంగా చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియను సజావుగా, వేగవంతంగా నిర్వహించాలన్నారు. గన్నీ సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సంబంధిత రైస్ మిల్లులకు తక్షణమే తరలించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి జిల్లాలో ఇప్పటివరకు 3.61 కోట్ల రూపాయల విలువైన ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్‌కు తెలిపారు.

మండలంలోని సాయిపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను కలెక్టర్ పరిశీలించారు. చెరువులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడి, వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను ప్రశ్నించారు.

### కార్మికులకు ఘన సన్మానం

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీ కూలీలను కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అధికారులతో కలిసి ఘనంగా సన్మానించారు. కూలీలకు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీను, సిసిఓ సంజీవ రెడ్డి, డిసిఎస్ ఓ వాజిద్ అలీ, డిఎం సివిల్ సప్లైస్ మహేందర్, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, ఏడీఏ ఆదిరెడ్డి, ధర్మసాగర్ తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, సివిల్ సప్లై అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులు తమ వృత్తులలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

▫ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

▫ కలెక్టరేట్లో ఘనంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం



**నిర్మల్ బ్యూరో, మే 1(జనంసాక్షి) :** కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శుక్రవారం మేడే (అంతర్జాతీయ కార్మిక దినోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రపంచ అభివృద్ధికి కార్మికులే ఛోదక శక్తి అని అన్నారు. కార్మికులు అందరూ తమ తమ వృత్తులకు సంబంధించి నైపుణ్యాలు పెంపొందించు కోవడం వల్ల, ఉన్నతి సాధించగలుగుతారని వివరించారు. ప్రతి ఒక్కరూ కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్మికులకు, ప్రభుత్వాలు అమలుపరుస్తున్న పథకాలు పొందాలని చెప్పారు. నైపుణ్యాలు ఉన్న కార్మికులకు విదేశాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని.. కార్మికులు తదనుగుణంగా ఆలోచన చేసి అవకాశాలు అందిపుచ్చుకోవాలని వివరించారు. ప్రభుత్వాలు కూడా కార్మికుల్లో నైపుణ్యాలు పెంచేందుకు శిక్షణలు ఇస్తున్నాయని, కార్మికులు వాటిని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్మిక శాఖ "అచీవ్మెంట్స్, ఆక్టివిటీస్" బుక్ లెట్ ఆవిష్కరించారు. పలువురు కార్మికులకు జ్ఞాపికలు అందించి, శాలువాలతో సత్కరించారు. అనంతరం అధికారులు, కార్మికులు కలెక్టర్ కు జ్ఞాపిక అందించి, శాలువాతో సన్మానించారు. ఈ కార్మికదినోత్సవ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ (కిషోర్) కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ముత్యం రెడ్డి, కార్మిక శాఖ అధికారి రాజలింగు, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, కోటిరెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

# నిర్మల్ కలెక్టర్‌గా భవేష్ మిశ్రా

▫ ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో తొలి భేటీలో అభివృద్ధిపై చర్చ...



**ముధోల్, మే 01 (జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా శ్రీ భవేష్ మిశ్రా (ఐఏఎస్) బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ముధోల్ శాసనసభ్యులు శ్రీ పవార్ రామారావు పటేల్ శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ తొలి సమావేశంలో ముధోల్ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక సమస్యలను ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వాటిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ భవేష్ మిశ్రా తక్షణమే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా రైతులు పండించిన పంటలను విక్రయించుకునేందుకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు, సబ్ సెంటర్లలో గన్నీ బ్యాగులు, లారీల కొరత కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే వివరించారు. ఈ సమస్యను ప్రాధాన్యతగా పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ముధోల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఇరువురు నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తు తదితరులు ఉన్నారు.

# లాభసాటి సాగుతోనే రైతులకు ఆర్థిక భరోసా: శాస్త్రవేత్తల పిలుపు



**కుబీర్, మే 01 (జనంసాక్షి) :** కుబీర్ మండలంలోని మాలేగాం రైతు వేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా అన్నదాతలకు వినూత్న సాగు పద్ధతులపై శుక్రవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన శాస్త్రవేత్తలు పుష్పావతి, సుధారాణి రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో రైతులు సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, మార్కెట్ అవసరాలను గుర్తించి గిరాకీ ఉన్న వరి రకాలను సాగు చేయాలని సూచించారు. తద్వారా తక్కువ శ్రమతో అధిక లాభాలను ఆర్జించవచ్చని తెలిపారు. పెరుగుతున్న నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని, సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని, విలువైన జలవనరులను భావితరాలకు భద్రంగా అందించాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందని గుర్తుచేశారు. నేలతల్లి ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. విచ్చలవిడిగా యూరియా, ఇతర రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని హితవు పలికారు. రసాయనాల వల్ల సాగు ఖర్చు పెరగడమే కాకుండా భూసారం దెబ్బతింటుందని, దీనికి ప్రత్యామ్నాయంగా ప్రకృతి సాగు వైపు మళ్లాలని కోరారు. ఒకే రకమైన పంట కాకుండా, పంట మార్పిడి పద్ధతులను పాటించడం ద్వారా తెగుళ్ల ఉధృతిని తగ్గించి, సుస్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ వివేకానంద మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను, శాస్త్రవేత్తల సూచనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి సారిక, గ్రామ సర్పంచ్ లక్ష్మీ బాయి ఆనంద్, గ్రామ ప్రజాప్రతినిధులు, మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, మాలేగాం రైతులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులపై కఠిన చర్యలు..

▫ జాయింట్ డైరెక్టర్ వెంకటరమణ



**నిర్మల్ బ్యూరో, మే01 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లాలోని పలు ఆసుపత్రులను శుక్రవారం రాష్ట్ర క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ జాయింట్ డైరెక్టర్ వెంకటరమణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్-2010 నిబంధనలను అన్ని ఆసుపత్రులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సెల్లార్లలో ఆసుపత్రుల నిర్వహణ చేయరాదని, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణతో పాటు కాలుష్య నియంత్రణ బోర్డు మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అర్హత కలిగిన వైద్యులు, సిబ్బంది మాత్రమే విధులు నిర్వహించాలని, ప్రతి ఆసుపత్రి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అలాగే సర్వీస్ ఛార్జీల బోర్డులను ప్రదర్శించి, రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో రాష్ట్ర అధికారులు వెంకట్ రామ్ రెడ్డి, సునీల్ రాజ్, అనిల్ కుమార్, డిప్యూటీ జిల్లా విస్తరణ మీడియా అధికారి బారె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆరుగాలం పండించిన పంట అగ్గిపాలయ్యింది

▫ ఎల్లారెడ్డిపల్లి లో మొక్కజొన్న పంట దగ్ధం

**మొగుళ్ళపల్లి, మే 1 (జనంసాక్షి) :** రైతులు చెమటోడ్చి ఆరుగాలం పండించిన మొక్కజొన్న పంట అగ్గిపాలయ్యింది. చేసిన అప్పులతో పెట్టుబడి పెట్టి చేతికొచ్చే పంట చేజారిపోవడంతో రైతు బతుకు ఆగమైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని ఎల్లారెడ్డి పల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురై గ్రామంలోని రైతులు వేసిన మొక్కజొన్న పంట 16.20 ఎకరాలు పూర్తిగా కాలిపోయి బూడిదయింది. విషయం తెలుసుకున్న స్థానిక తహసిల్దార్ జాలీ సునీతా రెడ్డి, ఎస్ఐ ముప్పు సురేష్ లు సంఘటన స్థలానికి చేరుకొని, ప్రమాదంలో మొక్కజొన్న పంట కాలిపోయిన కారణాలను వారు రైతులను అడిగి తెలుసుకున్నారు. సమాచారం ఇచ్చిన వెంటనే మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక కేంద్రం సంఘటన స్థలానికి చేరుకుంది. అగ్నిమాపక కేంద్రం మంటలను ఆర్పేందుకు విశేష కృషి చేసింది. అధైర్య పడొద్దు..ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, రైతులకు అన్ని విధాలుగా న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా తహసిల్దార్ జాలీ సునీతా రెడ్డి రైతులకు హామీనిచ్చారు.

# చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని పట్టుకున్న గ్రామస్తులు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా నేరేడుపల్లి గ్రామ శివారులోని మోరంచ వాగు సమీపంలోని పొలాల వద్ద మోటార్లకు సంబంధించిన కరెంట్ వైర్లు దొంగతనం చేస్తున్న ఇద్దరు యువకులను గ్రామస్తులు శుక్రవారం పట్టుకున్నారు. పొలాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగా ఇద్దరు దొంగలను గ్రామస్తులు గుర్తించారు. వారిని పట్టుకుని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం స్థానిక పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన యువకులు పరకాల మండలానికి చెందిన ముషికే శ్రీకాంత్, దొగ్గల సుకుమార్‌లుగా గుర్తించారు. గతంలో కూడా పలువురు రైతుల మోటార్లు, కరెంట్ వైర్లు, ఇతర విలువైన వ్యవసాయ సామగ్రి చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శిశువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 1 (జనం సాక్షి) :** కన్న పిల్లలను పెంచి పోషించలేని వారు, వద్దనుకునే వారు చెత్త కుప్పల్లో, చెట్ల పొదల్లో వేయకూడదని ప్రభుత్వానికి అప్పగించడం ద్వారా చట్టబద్ధంగా దత్తత ఇస్తామని, దత్తతపై అవగాహన కల్పించేందుకు గాను ఐడిఓసి కలెక్టరేట్ నందు దత్తత సహాయ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో దత్తత సహాయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ , మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజు, డిఆర్డిఓపిడి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజా వాణి రోజున కలెక్టరేట్ ప్రాంగణానికి వచ్చే ప్రజలకు హెల్ప్ డెస్క్ ద్వారా దత్తత ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారం



అవసరమైన పత్రాలను ప్రభుత్వ మార్గదర్శకాలు వంటి అంశాల సమాచారం కోసం ప్రజలకు ఉపయోగపడేలా దత్తత సహాయక కేంద్రం ఉపయోగపడుతుందని తెలియజేశారు .: జిల్లాలో మొత్తం నాలుగు అడాప్షన్ ఇవ్వడం జరిగింది అని తెలిపారు., అందులో తమిళనాడు ప్రొఫెసర్ ,కరీంనగర్ నగర్ నుండి ఇద్దరు గవర్నమెంట్ ఎంప్లాయిస్, మరొకరు హైదరాబాద్‌కు చెందినవారు. ఉన్నారని తెలిపారు. ఈ సంవత్సరంలో మొత్తం 11 అక్రమ దత్తత ఆపడం జరిగిందని 5 ఎఫైర్ ఫైల్ చేయడం జరిగిందని తెలిపారు. అలాగే అంతర్జాతీయ దత్తత, విదేశీ దత్తత, బంధువుల నుంచి తీసుకున్నటువంటి దత్తత గురించి, పిల్లలను దత్తత తీసుకోవాలనే దంపతులకు సరైన విధానం నియమాలను నమోదు ప్రక్రియ గురించి వాత్సల్య పోర్టల్ www.mission-vastalya.wwd.gov.in ద్వారా పిల్లల అడాప్షన్ ప్రక్రియను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని. అక్రమ దత్తతను తీసుకున్నపై కఠినమైన చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. పిహెచ్సి లో బాల్ భరోసా స్కీం ద్వారా 0 నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు ఎవరైతే డెవలప్మెంటల్ డిలే, స్పెషల్ నీడ్ చిల్డ్రన్ ఉన్నారో వారికి హెల్త్ చెకప్ చేయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు మాట్లాడుతూ చిన్నపిల్లలను దత్తత తీసుకునేవారు చట్టంలో ఉన్న నిబంధనలకు లోబడి వ్యవహరించాలన్నారు. దత్తత సహాయ కేంద్రం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. తదనంతరం దత్తత పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిపిఓ యాదయ్య, సంబంధిత ఐసిడిఎస్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాల భరోసాతో చిన్నారులకు ఉచిత వైద్య సేవలు



**సూర్యాపేట ప్రతినిధి, మే 1 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధ్యక్షతన బాల భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భముగా ఎదుగుదలలో శారీరక, మానసిక లోపాలు కలిగిన 0 నుంచి 5 ఏళ్ల వయస్సు కలిగిన 33 మంది చిన్నారులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్సలు అందించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 5 ఏళ్ల లోపు చిన్నారుల ఆరోగ్యం, పోషకాహార లోపం నివారణ కోసం బాల భరోసా ఆరోగ్యానికి ఆరంభం పథకాన్ని 12 జనవరి 2026న ప్రారంభించిందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారం పడకుండా ఇలాంటి వారి సమస్యను చిన్నతనంలోనే గుర్తించి, వారికి ఉచిత ఆరోగ్య పరీక్షలు, ఈ పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా చికిత్స నుండి శస్త్రచికిత్సల వరకు అందించనున్నట్లు తెలిపారు. చిన్న తనంలోనే గుర్తిస్తే చక్కటి వైద్యం అందించే అవకాశం ఉందన్నారు. ఆర్బీఎస్ కె టీమ్ లు హెల్త్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి అంగవైకల్యం గుర్తించబడిన వారిని వారంలో 3 రోజులు రిఫర్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ పెండెం వెంకటరమణ, జిల్లా ఆర్బీఎస్ కె టీమ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కోటి రత్నం, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ నర్సింహారావు,ఆర్బీఎస్ కె వైద్యాధికారులు, సిబ్బంది, సిడిపిఓలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మధుసూదన్ కుటుంబానికి అండగా ఉంటాం

**మిర్యాలగూడ, మే 1 (జనంసాక్షి) :** తన ముఖ్య పౌర సంబంధాల అధికారి, సీనియర్ జర్నలిస్ట్ మారబోయిన మధుసూదన్ ఆకస్మిక మృతి తనకు వ్యక్తిగతంగా తీ రని లోటని ఆయన మృతి తనను ఎంతో కలచి వేసిందని ఆయన లేని లోటు పూడ్చ లేనిదై న ఆయన కుటుంబ సభ్యులు ఎవరు అధైర్య పడద్దని వారికి తాము అన్ని విధాల అండగా ఉంటామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన తన సిపి ఆర్ ఓ మధుసూదన్ కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధు మరణం తనకు షాకింగ్ న్యూస్ అని, ఆయన మరణ వార్త విన్న వెంటనే తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని చిన్న వయసులో ఆయన మృతి చెందడం బాధాకరమని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని వేడుకుంటున్నట్లు తెలిపారు. మృతుడి భార్య జ్యోతి కుమారుడు వెంకట్ సూరజ్ లు ఓదార్చి తమ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట డిసిసి ప్రెసిడెంట్ పున్న కైలాస్ నేత స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్), ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ తదితరులున్నారు.

## కార్మికులు తమ హక్కులపై చైతన్యం పెంచుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి జి. సబిత
- రామన్నపేట మార్కెట్ యార్డులో న్యాయ అవగాహన సదస్సు



**రామన్నపేట, మే 1 (జనంసాక్షి) :** సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే కార్మికులు తమ హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే వారికి తగిన న్యాయం జరుగుతుందని రామన్నపేట మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జి. సబిత స్పష్టం చేశారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా శుక్రవారం రామన్నపేట వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్మికులు, హమాలీలకు ప్రత్యేక న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించి ప్రసంగించారు. కార్మికుల శ్రమ దోపిడీకి గురికాకుండా రాజ్యాంగం ఎన్నో చట్టాలను రూపొందించిందని జడ్జి సబిత ఈ సందర్భంగా గుర్తుచేశారు. పేదరికంతో లేదా అవగాహన లోపంతో ఏ ఒక్క కార్మికుడు న్యాయానికి దూరం కాకూడదనే ఉద్దేశ్యంతోనే ఉచిత న్యాయ సేవాధికార సంస్థలు పనిచేస్తున్నాయని, అవసరమైన వారు ప్యానెల్ న్యాయవాదుల ద్వారా ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చని ఆమె వివరించారు. అలాగే, కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ బీమా, ఆరోగ్య, ఆర్థిక పథకాల గురించి కూలీలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. అనంతరం సదస్సులో పాల్గొన్న రోజువారీ వేతన కార్మికులు, కూలీలతో ఆమె ముఖాముఖి మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలు, మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాల లేమి తదితర అంశాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్మికులు తెలిపిన సమస్యలను సావధానంగా విన్న జడ్జి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న మార్కెట్ కమిటీ అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్లు యాదాసు యాదయ్య, కూనూరు శ్రీనివాస్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సూపర్వైజర్ ఎం. రమేష్, మార్కెట్ డైరెక్టర్ జి. నాగేందర్, అధిక సంఖ్యలో హమాలీలు, రోజువారీ వేతన కార్మికులు, మార్కెట్ సిబ్బంది ఈ సదస్సులో పాల్గొన్నారు.

## బుద్ధుడి జీవిత చరిత్రను తప్పనిసరిగా చదవాలి



**జడ్చర్ల, మే 1 (జనంసాక్షి) :** ప్రతి విద్యార్థి బుద్ధుడి జీవిత చరిత్రను తప్పనిసరిగా చదవాలని, ఆయన చూపిన శాంతి మార్గంలో నడుస్తూ అందరితో సౌభ్రాతృత్వంతో మెలగాలని కౌన్సిలర్ సతీష్ అన్నారు. డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో బుద్ధ పూర్ణిమ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 3వ వార్డు కౌన్సిలర్ సతీష్, గార్డెన్ సమన్వయకర్త డాక్టర్ బి. సదాశివయ్య, ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 వాలంటీర్లు బుద్ధ విగ్రహానికి నివాళులర్పించి ఆయన జీవిత విశేషాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సతీష్ మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థిగా ఇక్కడ బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేసే గొప్ప అవకాశం రావడం తన పూర్వజన్మ సుకృతమని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులు తమ చదువులు పూర్తయిన తర్వాత తాము చదువుకున్న విద్యాసంస్థల అభివృద్ధికి తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. డాక్టర్ బి. సదాశివయ్య మాట్లాడుతూ బుద్ధుడి జీవితం ఎందరికో ఆదర్శప్రాయమని, సంతోషంగా జీవించడానికి ఆయన సూక్తులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. బుద్ధుడి బోధనలు పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా ఉంటాయని, వాటిని ఆచరించడం ద్వారా ప్రకృతిని కాపాడుకుంటూ జీవనం సాగించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు వేగవంతం చేయాలి



**ఖమ్మం రూరల్, మే 1 (జనం సాక్షి) :** మొక్కజొన్న కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ రైతులకు భరోసా కల్పించారు. జిల్లా కలెక్టర దివాకర టీఎస్ ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకు మొక్కజొన్న రావడం జరుగుతుందని తెలిపారు. మార్కెట్ యార్డుల్లోకి వచ్చే నాణ్యమైన మొక్కజొన్నను మద్దతు ధరతో 2--3 రోజుల్లో కొనుగోలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అకాల వర్షాలకు ముందస్తు చర్యల్లో భాగంగా గన్నీబ్యాగులు, టార్పాలిన్ కవర్ లు అందుబాటులో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అలీమ్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ సెక్రటరీ పీ. వీరాంజనేయులు, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, ఎదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పి. అనిత, ఆర్డీఓ శ్రీనివాస్, ఖమ్మం రూరల్ తహసిల్దార్ వినయేందర్ రెడ్డి,వైస్ చైర్ పర్సన్ తమ్మినేని నవీన్, ఎదులాపురం సొసైటీ సీఈఓ మహమ్మద్ అలీ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

- జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి, మే 1 (జనంసాక్షి) :** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల 1 నుండి 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ కె.నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, అసత్యాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం చర్యలు తప్పవని అన్నారు. బాణాసంచా, డీజెలు ఉపయోగించవద్దని అన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పంపిణీకి సిద్ధం చేయాలి

- కలెక్టర్ చంద్రశేఖర్



**మిర్యాలగూడ, మే 1 (జనం సాక్షి) :** మిర్యాలగూడలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ అన్నారు శుక్రవారం నాడు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మండలం తుంగపాడు గ్రామం వద్ద నిర్మించినటువంటి డబల్ బెడ్ రూమ్ ఇండ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణం పూర్తయిన దృష్ట్యా మిగిలిపోయిన చిన్న చిన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రారంభోత్సవనికి సిద్ధం చెయ్యాలని, పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని, కరెంట్ కనెక్షన్, త్రాగునీరు, అంతర్గత రోడ్లు, అప్రోచ్ రోడ్లు వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఇంచార్జ్ సబ్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇంచార్ సబ్ కలెక్టర్ వెంకటేశ్వర్లు,ఆర్ అండ్ బి ఈ శ్రీధర్ రెడ్డి హౌసింగ్ పిడి రాజకుమార్, పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులు, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




**మిర్యాలగూడ, మే 1 (జనంసాక్షి) :** కార్మికుల హక్కులు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు శుక్రవారం నాడు మిర్యాలగూడ లో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకలకు అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 1న ప్రపంచవ్యాప్తంగా మేడే ఉత్సవాలు జరుపుకుంటారని 145 సంవత్సరాలకు పూర్వం చికాగో నగరంలో కార్మికులు ఎనిమిది గంటల పని దినాల కోసం ఉద్యమించారని ఆ సందర్భంగా కార్మికులపై చేసిన దాడిలో రక్తం చిందించిన కారణంగా మే 1న కార్మిక దినోత్సవం నిర్వహించుకుంటారని తెలిపారు. భారతదేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నాయకత్వంలో అణగారిన వర్గాల వారి హక్కుల రక్షణ అభివృద్ధికి కృషి చేశారని, స్వతంత్రం సాధించుకున్న తర్వాతకార్మిక హక్కులకు చట్టబద్ధత కల్పించిన ఘనత అంబేద్కర్ గారిది అని అన్నారు. అనంతరం కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతవత్ శంకర్ నాయక్,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పున్నా కైలాస్ నేత, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ నియోజకవర్గం లోని సర్పంచులు, కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సుస్థిర వ్యవసాయాన్ని రైతులు పాటించాలి



**కనగల్లు, మే 1 (జనం సాక్షి) :** సుస్థిర వ్యవసాయాన్ని రైతులు పాటించి కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జి. శివప్రసాద్ రైతులకు సూచించారు. వ్యవసాయ పరిశోధన క్షేత్రం కంపసాగర్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం పగిడిమర్రి రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలలో యూరియా వాడ కానీ తగ్గించాలని మార్కెట్లో ఏ పంటలకైతే అధిక డిమాండ్ ఉందో ఆ పంటలను మాత్రమేరైతులు ఎంచుకొని పండించి ఎక్కువ ఆదాయాన్ని పొందాలన్నారు. పంటల మార్పిడి పద్ధతిని రైతులు అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి, మండల వ్యవసాయ అధికారి బి అమరేందర్ గౌడ్, స్థానిక సర్పంచ్ నాగవల్లి నాగమణి సైదులు, మాజీ సర్పంచ్ గోలి నర్సిరెడ్డి, ఏ ఈ ఓ లు విజయలక్ష్మి మౌనిక అభిలాష్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి పురోగతి సాధించాలి

- జిల్లా కలెక్టర్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, మే 1 (జనం సాక్షి) :** ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేసుకునేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసి సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాపు పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా మంజూరైన ఇళ్లు,గ్రౌండింగ్, పనుల పురోగతి,నిర్మాణ దశలు, ఇంకా ప్రారంభం కాని ఇళ్లపై తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జిల్లా రాష్ట్రంలో చివరిస్థానంలో ఉండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పురోగతిని వేగవంతం చేసి, లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మంగళవారం, గురువారం ఎంపీడీఓలు క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రదేశాలకు వెళ్లి లబ్ధిదారుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని




వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మొదటి విడతలో ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు పూర్తి స్థాయిలో గ్రౌండింగ్ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ముందుకురాని వారి మంజూరీలను రద్దు చేసిన చోట, వారి స్థానంలో అర్హులైన కొత్త వారిని లబ్దిదారులుగా ఎంపిక చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ కమిటీలను సంప్రదించి ఆసక్తి కలిగిన అర్హులను గుర్తించాలన్నారు. మార్క్ అవుట్ నుంచి బేస్‌మెంట్, స్లాబ్ దశల ద్వారా ఇల్లు పూర్తయ్యే వరకు ప్రతి దశను కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తూ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యానికి తావు కల్పిస్తే ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పంచాయతీ కార్యదర్శుల పనితీరును ఎంపీడీఓలు కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని సూచించారు. ఐహెచ్ఎల్ టాయిలెట్లకు సాంక్షన్ ఆర్డర్లు వెంటనే జారీ చేసి, ఇల్లు పూర్తయ్యే సమయానికి టాయిలెట్ నిర్మాణం కూడా పూర్తయ్యేలా అధికారులు లబ్ధిదారులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా సమయానికి చెల్లింపులు జరగాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, డి.ఆర్.డి.ఓ ముసాయిదా బేగం, ఆయా మండలాల ఎంపీడీఓలు,హౌసింగ్ డి.ఈలు,ఏ.ఈ లు తదితరులు పాల్గొన్నారు.




# విదేశీ మదుపర్లు అమ్మేస్తున్నారు

## ఏప్రిల్‌లో రూ.60వేల కోట్లు

**న్యూఢిల్లీ:** దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు తమ పెట్టుబడులను పెద్ద మొత్తంలో తరలిస్తున్నారు. ఒక్క ఏప్రిల్ నెలలోనే రూ.60,847 కోట్ల విలువైన ఈక్విటీలను విదేశీ సంస్థాగత మదుపర్లు విక్రయించినట్లు ఎన్ఎస్‌డీఎల్ డేటా చెబుతోంది. ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరంలో ఇప్పటివరకు రూ.1.92 లక్షల కోట్ల విలువైన సొమ్మును ఉపసంహరించినట్లు పేర్కొంది. 2025 మొత్తం క్యాలెండర్ సంవత్సరంలో ఉపసంహరించిన రూ.1.66 లక్షల కోట్లతో పోలిస్తే ఈ మొత్తం చాలా ఎక్కువ.ఒక్క ఫిబ్రవరి నెల మినహా 2026 క్యాలెండర్ సంవత్సరం ప్రారంభం నుంచి విదేశీ మదుపర్లు విక్రయాలు కొనసాగిస్తున్నారు. జనవరిలో రూ.35,962 కోట్ల ఈక్విటీలను విక్రయించిన ఎఫ్‌పీఐలు.. ఫిబ్రవరిలో మాత్రం రూ.22,615 కోట్ల నిధులను మన మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టారు. మళ్లీ మార్చి నెలలో రికార్డు స్థాయిలో రూ.1.17 లక్షల కోట్లు, ఏప్రిల్ నెలలో రూ.60,847 కోట్లు ఉపసంహరించినట్లు డేటా చెబుతోంది.భౌగోళిక ఉద్రిక్తతలు, అంతర్జాతీయ స్థూల ఆర్థిక అనిశ్చితులు ఎఫ్‌పీఐల విక్రయానికి కారణమని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణ వాతావరణంతో క్రూడాయిల్ ధరలు అమాంతం పెరిగాయని, దీంతో ద్రవ్యోల్బణ భయాలు నెలకొనడం కూడా ఓ కారణమని మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా ప్రిన్సిపల్ మేనేజర్ హిమాన్షు శ్రీవాస్తవ పేర్కొన్నారు. సమీప భవిష్యత్‌లో రేట్లలో కోత ఉండకపోవడం, బాండ్ రాబడులు అధిక స్థాయిలో ఉండడం భారత్ సహా వర్ధమాన మార్కెట్లపై ఎఫ్‌పీఐల అనాసక్తికి కారణమని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా డబ్ల్యూటీఐ క్రూడ్ బ్యారెల్ 90 డాలర్ల దిగువకు చేరితే ఎఫ్‌పీఐ ఇన్‌ఫ్లోలు పెరిగే అవకాశం ఉందని ఏంజిల్ వన్‌లో సీనియర్ అనలిస్ట్ వకార్ జావేద్ ఖాన్ అంచనా వేశారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.1.7 లక్షల కోట్ల విలువైన ఈక్విటీలను దేశీయ సంస్థాగత మదుపరులు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.



# చైనాతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సన్నాహాలు

- ఆ దేశ కంపెనీలకు 10% వాటా ఉన్న విదేశీ సంస్థలకు వెసులుబాటు
- నిబంధనల్లో మార్పునకు నిర్ణయం
- త్వరలోనే కేంద్రం నోటిఫై

**న్యూఢిల్లీ:**చైనా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను అనుమ తించేందుకు మన ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. చైనా కంపెనీలకు 10% వరకు వాటా లుండే విదేశీ సంస్థలు, మన దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు మార్గం సుగమం చేస్తోంది. ఇందుకోసం ఎఫ్‌డీఐ నిబంధనలను సడలించేలా త్వరలో కేంద్రం నోటిఫై చేయనుంది. అనంతరం ఆ మార్పులు అమల్లోకి వస్తాయి. అందుకు అనుగుణంగా ప్రెస్ నోట్(పీఎన్) 3 ఆఫ్ 2020లో సవరణలకు గత మార్చిలోనే కేంద్రం ఆమోదం తెలిపింది. దీని కింద 10% వరకు చైనా కంపెనీలకు వాటా ఉన్న విదేశీ సంస్థలు భారత్‌లో నేరుగా పెట్టుబడులు పెట్టొచ్చు.చైనా/హాంకాంగ్ లేదా భారత్‌తో సరిహద్దు పంచుకున్న ఇతర దేశాల్లో నమోదైన కంపెనీలకు ఈ సవరించిన ఎఫ్‌డీఐ నిబంధనలు వర్తించవు. కొత్త మార్పులను ఇప్పటికే పరిశ్రమల, అంతర్గత వాణిజ్య విభాగం నోటిఫై చేయగా, ఆర్థిక కార్యకలాపాల విభాగం (డీఈఏ) నోటిఫై చేయాల్సి ఉంది. విదేశీ మారకపు నిర్వహణ చట్టం (ఫెమా) కింద డీఈఏ నోటిఫికేషన్ త్వరలోనే జారీ అవుతుందని డీపీఐఐటీ సంయుక్త కార్యదర్శి జై ప్రకాశ్ శివహరే పేర్కొన్నారు. యంత్రపరికరాలు, ఎలక్ట్రానిక్ యంత్రపరికరాలు, ఎలక్ట్రానిక్ విడిభాగాలు, పాలీసిలికాన్, ఇన్‌గాట్‌వేఫర్



లేదా కమిటీ ఆఫ్ సెక్రటరీస్ జత చేసిన ఏ ఇతర రంగం/కార్యకలా పాలకు సంబంధించిన ఎఫ్‌డీఐ ప్రతిపాదనలను 60 రోజుల్లోనే ప్రాసెస్ చేయనున్నారు. 60 రోజుల్లోపు ప్రాసెస్ చేయదగ్గ ఉప రంగాలను గుర్తించే పనిలో తమ విభాగం ఉన్నట్లు జైప్రకాశ్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో మనదేశంలోకి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐ 90 బిలియన్ డాలర్లు (రూ.8.3 లక్షల కోట్లు)గా ఉండొచ్చని డీపీఐఐటీ కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా పేర్కొన్నారు. సంస్కరణలు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, వేగవంతమైన ఆర్థిక వృద్ధి వల్లే దేశంలోకి భారీ స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు.భారత్ వెలుపలి వ్యక్తి దేశంలోని అన్‌లిస్టెడ్ కంపెనీలో పెట్టుబడులు పెడితే దానిని ఎఫ్‌డీఐగా పరిగ ణిస్తారు. లేదా లిస్టెడ్ కంపెనీలో 10% లేదా అంతకంటే ఎక్కువ పోస్ట్ ఇష్యూ పెయిడప్ ఈక్విటీ క్యాపిటల్ కొనుగోలు చేయడాన్నీ ఎఫ్‌డీఐగానే పిలు స్తారు. ఇది రెండు మార్గాల్లో పెట్టొచ్చు. ఆర్‌బీఐ లేదా ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఆటోమేటిక్ మార్గంలో చేయొచ్చు. కొన్ని రంగాల్లో మినహా చాలా వరకు 100% ఆటోమేటిక్ మార్గంలో ఎఫ్‌డీఐకు అనుమతి ఉంది. రెండో మార్గంలో ప్రభు త్వ ముందస్తు అనుమతులు తీసుకుని పెట్టుబడులు పెట్టొచ్చు. మనదేశంతో భూ సరిహద్దులు పంచుకునే ఏ దేశమైనా, తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకునే పెట్టుబడులు పెట్టాలి.

# ఏకంగా రూ.15 లక్షల కోట్లు..!

## ఈ ఏడాది ఎలాన్ మస్క్ వేతన ప్యాకేజీ..

**వాషింగ్టన్:**అపర కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ వేతన అంశం మరోసారి వార్తల్లో నిలిచింది. 2025 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆయనకు ఏకంగా 158 బిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీని టెస్లా ప్రకటించింది. ఈమేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది. అయితే, ఈ మొత్తం మస్క్ ఖాతాలో పడదండోయ్..! ఇందుకు కొన్ని షరతులుంటాయి.సాధారణంగా టెస్లా సీఈఓగా ఎలాన్ మస్క్ నెలవారీ జీతంగా ఎలాంటి మొత్తాన్ని పొందరు. స్టాక్ అవార్డులు, ఇతరత్రా రూపంలో పారితోషిక ప్యాకేజీని అందుకుంటారు. 2025 ఆర్థిక సంవత్సరానికి గానూ మస్క్‌కు 158 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.15 లక్షల కోట్లు) ప్యాకేజీని టెస్లా ప్రకటించింది. అయితే, ప్రకటనలో ఉన్న మొత్తంతో పోలిస్తే.. వాస్తవంగా ఆయన పొందే విలువలో గణనీయమైన వ్యత్యాసం ఉండొచ్చని కంపెనీ తమ ఫైలింగ్‌లో వెల్లడించింది.తాజాగా ప్రకటించిన దానిలో.. కంపెనీ పనితీరు ఆధారిత పారితోషికం విలువ 132 బిలియన్ డాలర్లుగా పేర్కొన్నారు. పనితీరు విషయంలో కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలన్నీ నెరవేరితేనే ఈ మొత్తం మస్క్‌కు అందుతుంది. ఇక, ప్యాకేజీలో మిగతా 26 బిలియన్ డాలర్లు.. టెస్లా బోర్డు ఆమోదించిన మధ్యంతర అవార్డు రూపంలో లభిస్తుంది. గతేడాది కూడా మస్క్‌కు టెస్లా కంపెనీ ట్రిలియన్ డాలర్ల ప్యాకేజీని ప్రకటించిన సంగతి తెలిసిందే. అది పూర్తిగా ఈక్విటీ అవార్డు గ్రాంట్ల రూపంలో ఇవ్వనున్నట్లు నాడు తెలిపింది. అంటే.. టెస్లా స్టాక్ విలువ పెరిగి, నిర్వహణ పరంగా కంపెనీ నిర్దేశించుకున్న మైలురాళ్లను చేరుకుంటే ఆ మొత్తం మస్క్‌కు లభిస్తుందన్నమాట. అయితే, గతేడాది టెస్లా మార్కెట్ విలువ పెరగలేదు.

## మస్క్ పంపేస్తే.. రూ.19 వేల కోట్ల కంపెనీని నడిపిస్తున్నాడు..!

**న్యూఢిల్లీ:**ప్రముఖ సామాజిక మాధ్యమం ట్విటర్ (ఇప్పుడు ఎక్స్)కు సీఈఓ (2021-2022)గా నియమితులైనప్పుడు భారతీయ అమెరికన్ పరాగ్ అగర్వాల్ పేరు మారుమోగింది. కానీ ఆ సంస్థను ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సొంతం చేసుకున్న తర్వాత పరాగ్‌ను అనూహ్యంగా, అవమానకర రీతిలో బయటకు పంపించేశారు. మస్క్ తీరుపై అప్పట్లో వ్యతిరేకత కూడా వ్యక్తమైంది. పరాగ్ మాత్రం మౌనంగా వైదొలిగి, తన పని తాను చేసుకున్నారు. తానెంటో నిరూపించుకొని మరోసారి వార్తల్లో నిలిచారు.ఎక్స్‌లో తనకు ఎదురైన అనుభవం తర్వాత 2023లో పరాగ్ ఏఐ స్టార్టప్ 'ప్యారలల్ వెబ్ సిస్టమ్స్'ను స్థాపించారు. ఇప్పుడు ఆ సంస్థ విలువ రెండు బిలియన్ డాలర్లకు చేరింది. భారత కరెన్సీలో దాదాపు రూ.19వేల కోట్లు అన్నమాట. ఇటీవల 100 మిలియన్ డాలర్లు సమీకరించడంతో కంపెనీ విలువ ఈ మార్క్‌కు చేరుకుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పరిశోధనపై మరింత దృష్టి సారించేందుకు, సేల్స్, మార్కెటింగ్ విభాగాలను మరింత విస్తరించేందుకు ఈ నిధులు వెచ్చించనున్నట్లు తెలుస్తోంది.ప్యారలల్ వెబ్ సిస్టమ్స్.. ఏఐ ఏజెంట్లకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుంది. ఈ ఏఐ ఏజెంట్లు అనేవి స్వయంప్రతిపత్తి గల సాఫ్ట్‌వేర్ వ్యవస్థలు. ఇవి కేవలం ముందుగా శిక్షణ పొందిన డేటా పైనే ఆధారపడకుండా.. రియల్ టైమ్ సమాచారాన్ని సేకరించి, క్లిష్టమైన టాస్క్‌లను పూర్తి చేసేందుకు కావాల్సిన టూల్స్‌ను ప్యారలల్ అభివృద్ధి చేస్తోంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,37,900 | ₹ 1,50,440 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,65,000

# ఈసారైనా ట్రంప్‌ను నోబెల్ వరిస్తుందా?



## మరోసారి మొదలైన చర్చ

**న్యూఢిల్లీ:**ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'నోబెల్ శాంతి బహుమతి- 2026'కి సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. దీంతో ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై అందరి దృష్టి పడింది. శాంతి బహుమతి కోసం నార్వేజియన్ నోబెల్ కమిటీకి 287 నామినేషన్లు రాగా.. అందులో ట్రంప్ పేరు కూడా ఉండొచ్చని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. దీంతో ఈసారైనా ట్రంప్‌ను శాంతి బహుమతి వరిస్తుందా అనే చర్చ మొదలయ్యింది. 208 మంది వ్యక్తులు, 79 సంస్థల నుంచి నామినేషన్లు వచ్చినట్లు గురువారం నోబెల్ కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇందులో ట్రంప్ పేరు కూడా ఉండొచ్చని తెలుస్తోంది. ఆయనతో పాటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్, ఐరాస ప్రత్యేక ప్రతినిధి ఫ్రాన్సెస్కా అల్బనీస్ వంటి మరికొంతమంది పేర్లు కూడా ఇందులో ఉన్నట్లు సమాచారం. నామినేషన్లకు సంబంధించిన పేర్లను కమిటీ అత్యంత రహస్యంగా ఉంచుతుంది. కాబట్టి.. ఈ పేర్లకు సంబంధించి ఎలాంటి ధ్రువీకరణ లేదు.

ఇరాన్ యుద్ధం వేళ.. శాంతి వరిస్తుందా?

ఎనిమిది యుద్ధాలు ఆపానని ప్రకటించుకుంటూ.. నోబెల్ శాంతి బహుమతిపై గతేడాది ట్రంప్ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇజ్రాయెల్, రష్యా, పాకిస్థాన్ సహా పలు దేశాలు, అనేకమంది వ్యక్తులు ఆయన పేరును ప్రతిపాదించారు. చివరికి వెనెజువెలా విపక్ష నేత మరియా కొరీనా మచాడోకు అది దక్కడంతో ట్రంప్‌నకు నిరాశ తప్పలేదు. తాజాగా వచ్చిన నామినేషన్లలో కూడా ట్రంప్ పేరున్నట్లు ప్రచారం జరుగుతుంది. అయితే, ఈ ఏడాది ప్రారంభంలో ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై ట్రంప్ భీకర యుద్ధానికి దిగారు. ఈ యుద్ధంలో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ.. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గలేదు. మరోవైపు శాంతి చర్చలకు చేసిన ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి. ఈ తాజా పరిణామాల నేపథ్యంలో ట్రంప్ కలలు కంటున్న శాంతి బహుమతి ఆయన్ను వరిస్తుందా లేదా అనేది చూడాలి. కాగా.. 2026 నోబెల్ శాంతి బహుమతి అక్టోబరు 9న ప్రకటిస్తారు. డిసెంబరు 10న ఓస్లోలో దీన్ని ప్రదానం చేయనున్నారు. ఈ నామినేషన్ల సమర్పణ గడువు జనవరి 31నే ముగిసింది.

## అందుకే బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించను..

బహిరంగ కార్యక్రమాల్లో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ జాకెట్ ధరిస్తే.. లావుగా కన్పిస్తానని, అందుకే దాన్ని ధరించేందుకు తాను ఇష్టపడనని పేర్కొన్నారు. గతంలో ట్రంప్‌పై రెండుసార్లు హత్యా ప్రయత్నాలు జరిగిన సంగతి తెలిసిందే. ఇటీవల వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో కూడా కాల్పులు చోటుచేసుకొన్నాయి. దీంతో ఆయన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించకపోవడంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. గురువారం ఓవల్ ఆఫీసులో విలేకరుల సమావేశంలో ఓ జర్నలిస్టు దీనిపై ట్రంప్‌ను ప్రశ్నించారు. ఆ జాకెట్ ధరిస్తే 20 పౌండ్లు బరువు పెరిగినట్లు కన్పిస్తానన్నారు. ఇది తనకు అంత ఇష్టం ఉండదని వెల్లడించారు. ట్రంప్ వ్యాఖ్యలకు విలేకరులతో సహా అక్కడున్న కాంగ్రెస్ సభ్యులంతా ఒక్కసారిగా నవ్వులు చిందించారు. అలాంటి జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమేనన్నారు. 'దాని గురించి చాలామంది నన్ను అడిగారు. అది పరిగణించాల్సిన విషయమే. కానీ, నాకు అలా చేయడం ఇష్టం ఉండదు. ఎందుకంటే అలా చేస్తే ఒక చెడు శక్తికి మనం లొంగిపోయినట్లు అవుతుంది' అని ట్రంప్ అన్నారు. ఈక్రమంలో మరోసారి దాడి జరుగుతుందని ఆందోళన చెందుతున్నారా అని మరో విలేకరి ప్రశ్నించగా, దాని గురించి తాను ఆలోచించడం లేదని ట్రంప్ బదులిచ్చారు. అలా ఆలోచిస్తే.. తన పనిని తాను సమర్థవంతంగా పూర్తి చేయలేనన్నారు.

## బెంగాల్లో రీ పోలింగ్

- రెండు నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ బూతుల్లో నేడు ఎన్నిక
- కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం
- ఈవీఎం ట్యాంపరింగ్ ఆరోపణలు తోచిపుచ్చిన ఈసీ

జరుపనున్నట్లు ప్రకటించింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని ఎన్నికల సంఘం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈనెల 29న జరిగిన ఎన్నికలకు సంబంధించి 142-మగ్రహత్ పశ్చిమ్ ఏసీ, 143-డైమండ్ హార్బర్ ఏసీ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారుల నుంచి అందిన సమాచారం ప్రకారం ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 58లోని సబ్ సెక్షన్ (2)కింద 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్‌కు ఎన్నికల కమిషన్ నిర్ణయించినట్లు ఈసీ తెలిపింది. కాగా, రీపోలింగ్‌కు సంబంధించి పోలింగ్ ఏరియాల్లో విస్తృతమైన ప్రచారం జరపాలని, తాజా పోలింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని అభ్యర్థులకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సంబంధింత అధికారులను ఈసీ ఆదేశించింది. ఈనెల 29న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ తుది విడత పోలింగ్ ముగిసింది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఇదిలావుంటే భవానీపూర్‌లో పరిస్థితిని సమీక్షించేందుకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సౌత్ కోల్‌కతాలోని స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్లడం, బీజేపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో తలెత్తిన హైడ్రామాపై ఎన్నికల కమిషన్ స్పందించింది. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందంటూ తృణమూల్ కాంగ్రెస్ చేసిన ఆరోపణలను తోసిపుచ్చింది. మమతా బెనర్జీ పోటీచేసిన భవానీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కౌంటింగ్ సెంటర్ సఖావత్ మెమోరియల్ స్కూల్‌లో ఉంది. అక్కడి ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసేందుకు బీజేపీ ప్రయత్నించినట్టు టీఎంసీ కార్యకర్తలు ఆరోపించారు. అయితే టీఎంసీ ఆరోపణను నార్త్ కోల్‌కతా జిల్లా ఎన్నికల అధికారి స్మితా పాండే తోసిపుచ్చారు. పోస్టల్ బ్యాలెట్లను సెగ్రిగేట్ చేయడానికి చట్టబద్ధమైన పక్రియ ఉంటుందన్నారు. ఎన్నికల విధుల్లో ఉంటే అధికారులు, సిబ్బంది నేరుగా ఓటు వేయలేరని, అందువల్ల ఫెసిలిటేషన్ సెంటర్‌లో వారు



# ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.2.43 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ:**దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ఏప్రిల్ నెలకు గానూ 8.7 శాతం వృద్ధితో రూ.2.43 లక్షల కోట్ల మేర వసూళ్లు అయ్యాయి. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతుల కారణంగా పన్ను వసూళ్లు ఈ స్థాయిలో పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తోంది. 2025 ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్లు వసూలయ్యాయి. గత నెల కూడా జీఎస్టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్లు దాటిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ.. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెల కావడమూ ఈ వసూళ్లకు ఓ కారణంగా కనిపిస్తోంది. 2025 ఏప్రిల్ నెలలో కూడా ఇదే ఊపు కనిపించింది. ఇక రిఫండ్ల సర్దుబాటు అనంతరం ఏప్రిల్ నెలకు నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లుగా ఉన్నాయి. దేశీయంగా విక్రయాల ద్వారా 4.3 శాతం వృద్ధితో రూ.1.85 లక్షల కోట్ల మేర జీఎస్టీ ఆదాయం సమకూరగా.. దిగుమతుల రూపంలో 25.8 శాతం వృద్ధితో రూ.53,861 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి.

## వైట్‌హౌస్ డిన్నర్‌లో కాల్పులు..

# నిందితుడి వీడియో విడుదల

**వాషింగ్టన్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఇటీవల జరిగిన హత్యాయత్నం కేసులో ఓ కీలక వీడియోను అమెరికా న్యాయశాఖ విడుదల చేసింది. నిందితుడు అలెన్ భద్రతా వలయాన్ని ఎలా ఛేదించుకుని వచ్చాడో ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. హోటల్‌లో ఏర్పాటు చేసిన సెక్యూరిటీ చెక్ పాయింట్ గుండా నిందితుడు ఒక్కసారిగా దూసుకొచ్చి కాల్పులు జరపడం సీసీకెమెరాల్లో రికార్డయింది. ఈ ఘటనలో విధుల్లో ఉన్న ఒక సీక్రెట్ సర్వీస్ అధికారి గాయపడ్డారు. కాల్పుల ఘటనపై సమగ్ర విచారణ కొనసాగుతోందని, అందులో భాగంగానే వీడియోను విడుదల చేసినట్లు అమెరికా అధికార వర్గాలు తెలిపాయి. వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో ఏప్రిల్ 24న నిర్వహించిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో నిందితుడు అలెన్ కాల్పులకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో విందులో పాల్గొన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలానియాతో పాటు ఉపాధ్యక్షుడు జేడీవాన్స్, రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సెత్, విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియోను వెంటనే అక్కడి నుంచి తరలించారు.



# మళ్లీ ఇరాన్‌పై యుద్ధానికి కాలుదువ్వుతున్న అమెరికా

వివరించినట్లు సమాచారం. ఇరాన్ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా స్వల్ప వ్యవధిలో అత్యంత శక్తిమంతమైన దాడులు చేయాలని ఈ ప్లాన్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ తరహా దాడులతో టెహ్రాన్ చర్చలకు రాక తప్పని పరిస్థితి ఉంటుందని అమెరికా భావిస్తోంది. ఇక, హర్మూజ్ జలసంధిలో కొంత భాగాన్ని తమ నియంత్రణలోకి తీసుకునే అంశాన్ని కూడా అగ్రరాజ్య సెంట్రల్ కమాండ్ పరిశీలిస్తున్నట్లు సమాచారం.ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాలను పూర్తిగా వదిలేయాలని ట్రంప్ ముందునుంచీ డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే టెహ్రాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలని అగ్రరాజ్యం భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక ఆపరేషన్ చేపట్టే అంశాన్ని కూడా అమెరికా యోచిస్తోంది. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే.. ఇరాన్‌పై మళ్లీ భీకర స్థాయిలో దాడులు జరుగుతాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# చమురు మంటలు

- ఎయిరిండియా కీలక నిర్ణయం
- రోజువారీగా 100 సర్వీసుల్ని తగ్గించుకోనున్న సంస్థ

**న్యూఢిల్లీ:**ఇరాన్ యుద్ధంతో అంతర్జాతీయంగా ఇంధన ధరలు భగ్గుమంటున్నాయి ఈ ప్రభావం విమానయాన సంస్థల పైనా పడుతోంది. ఈ క్రమంలో రోజువారీగా 100 సర్వీసుల్ని తగ్గించుకోవాలని ఎయిరిండియా నిర్ణయం తీసుకుంది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు భారీగా పెరగడంతో కొన్ని మార్గాలకు విమానాలను నడపడం ఆర్థికంగా లాభదాయకం కాదని సంస్థ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజా నిర్ణయం తీసుకున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.టాటా గ్రూప్ ఆధ్వర్యంలోని ఎయిరిండియా రోజుకు సగటున 1100 సర్వీసుల్ని నడుపుతోంది. ఇప్పుడు ఐరోపా, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి సుదూర అంతర్జాతీయ మార్గాల్లోని సర్వీసులకే ప్రధానంగా కోత పెట్టనుంది. ఈ మార్గాల్లో ఇంధన వినియోగం ఎక్కువగా ఉండటమే అందుకు కారణం. దిల్లీ, ముంబయి నగరాలకు లండన్, పారిస్, న్యూయార్క్, టొరంటో, శాన్‌ఫ్రాన్సిస్కో, సిడ్నీ, మెల్‌బోర్న్ నుంచి రాకపోకలు సాగించే విమానాల సంఖ్య ఇకనుంచి తగ్గనుందని తెలుస్తోంది.

**ఏటీఎఫ్ 5 శాతం పెంపు..**

ఇరాన్ యుద్ధం వేళ.. వరుసగా రెండో నెల ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు పెరిగాయి. అంతర్జాతీయ విమాన సంస్థలకు ఏటీఎఫ్ ధరను 5 శాతం పెంచుతూ చమురు సంస్థలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. తాజా ప్రకటనతో దిల్లీలో కిలోలీటర్ ఏటీఎఫ్ ధర ఐదు శాతం పెరిగి.. 1,511.86 డాలర్లకు చేరింది. ప్రపంచవ్యాప్తంగా జెట్ ఇంజిన్ ధరలు భారీగా పెరగడంతో నిర్వహణ వ్యయాలు భారంగా మారతాయని విమానయాన సంస్థలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఇటీవల కొన్ని వారాల్లోనే ఏటీఎఫ్ ధరలు దాదాపు 80 శాతం పెరిగాయి. దీంతో విమాన సంస్థల నిర్వహణ వ్యయంలో 40 శాతం ఏటీఎఫ్‌కే వెచ్చించాల్సి వస్తోందని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. సాధారణంగా చమురు కంపెనీలు అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా ప్రతినెలా ఒకటో తేదీన ఏటీఎఫ్ ధరలను(ఆయా ఖతీతిఇవ) సవరిస్తాయి. ఈసారి దేశీయ విమాన సంస్థలకు మాత్రం మినహాయింపు లభించింది.

# కార్మికుల కృషితోనే దేశాభివృద్ధి: కలెక్టర్ దీపక్ తివారి

- కనీస వేతనాలు తప్పనిసరి - యజమానులకు సూచన
- బాల కార్మికత్వం చట్టవిరుద్ధం - హెచ్చరిక
- మేడే వేడుకల్లో ప్రతిభావంతులకు పురస్కారాలు
- చట్టబద్ధ దత్తతపై అవగాహన కార్యక్రమాలు ప్రారంభం



**వికారాబాద్ జిల్లా బ్యూరో మే1 (జనం సాక్షి):** సమాజ నిర్మాణంలో కార్మికుల పాత్ర అపారమని, వారి కృషి వల్లనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ కార్మిక దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్మికులు శ్రమిస్తేనే పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని, తద్వారా దేశ ప్రగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పారిశ్రామిక యజమానులు చట్ట ప్రకారం కనీస వేతనాలు చెల్లించడం తప్పనిసరి అని, కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు కృషి చేయాలని సూచించారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను ప్రమాదకర పరిశ్రమల్లో పనియేయించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కోసం అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల ద్వారా శిక్షణ కల్పించి ఉపాధి అవకాశాలను పెంచాలని అన్నారు.
కార్మిక దినోత్సవం సందర్భంగా విశేష సేవలకు గుర్తింపుగా రాడికల్ బయో ఆర్గానిక్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సరళ బయ్యనిని ఉత్తమ యాజమాన్య అవార్డుతో సత్కరించారు. సహాయ కార్మిక అధికారిగా యాదయ్యకు ఉత్తమ అధికారిగా, షేక్ రహమాన్‌కు ప్రత్యేక విభాగ పురస్కారం ప్రదానం చేశారు. ఇదే సందర్భంలో 99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామంలో మిషన్ వాత్సల్య పథకం కింద బాలపంచాయతీ, చట్టబద్ధ దత్తత, పెంపుడు సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి మాట్లాడుతూ చట్టబద్ధమైన దత్తతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, చట్టవిరుద్ధ దత్తతలకు దూరంగా ఉండాలని సూచించారు. పిల్లల సమస్యలను గ్రామ స్థాయిలో గుర్తించి పరిష్కరించేందుకు బాలసభలు నిర్వహించాలని, ప్రతి గ్రామంలో బాలల హక్కులను పరిరక్షించాలని అధికారులు పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలని, వారి అభివృద్ధికి సహకరించాలని పోలీసు అధికారులు సూచించారు. దత్తత ప్రక్రియపై ప్రజలకు సహాయం అందించేందుకు సమీకృత జిల్లా కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను కలెక్టర్ ప్రారంభించారు. వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ సీపీగా బాధ్యతలు స్వీకరించిన తరుణ్ జోషి

## డ్రగ్స్ నివారణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



**మహేశ్వరం, మే 1 (జనంసాక్షి):** ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ సీపీగా తరుణ్ జోషి శుక్రవారం తుక్కుగూడ ఈసీటీలోని కమిషనరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాల అదుపు కోసం కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ సేవలు అందిస్తూ, పారదర్శకంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని పొందేందుకు కృషి చేస్తామని సీపీ తరుణ్ జోషి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పోలీసు ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఎర్లీ బర్డ్ పథకం ద్వారా పన్ను వసూళ్లలో గణనీయ అభివృద్ధి

**శేరిలింగంపల్లి, మే 01 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రవేశపెట్టిన 'ఎర్లీ బర్డ్' పథకం ద్వారా ఆస్తి పన్ను వసూళ్లలో గణనీయమైన పురోగతిని సాధించడం జరిగిందని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆస్తిపన్ను వివరాలను వెల్లడించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 'ఎర్లీ బర్డ్' అనే ప్రత్యేక రాయితీ పథకాన్ని ప్రకటించడంతో ఆస్తి పన్ను వసూళ్లలో గణనీయమైన వృద్ధిని సాధించడానికి ఆస్కారం లభించిందని రెవెన్యూ విభాగం ఉన్నతాధికారులు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈసారి పన్ను వసూళ్లు ఆశాజనకంగా పెరిగాయన్నారు. ప్రస్తుత సంవత్సరానికిగాను ఒక ఏప్రిల్ నెలలోనే వసూళ్లు 510.33 కోట్ల రూపాయలకు చేరుకోవడం జరిగిందని, ఇది గత సంవత్సరం 439.85 కోట్లుగా మాత్రమే ఉందన్నారు 'ఎర్లీ బర్డ్' పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత వసూళ్లతో పోలిస్తే ఈసారి 70.48 కోట్ల రూపాయలను అదనంగా రాబట్టడం జరిగిందన్నారు. ఈ ఏడాది కేవలం నెలలోనే 16 శాతం వృద్ధిని సాధించడం పట్ల సిఎంసి అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మార్చి నెల నుండే ఎర్లీ బర్డ్ పథకం గురించి ప్రజలకు తగిన అవగాహనను కల్పించడంతో పన్ను చెల్లింపుదారుల చురుకైన భాగస్వామ్యం మరియు కార్పొరేషన్ యొక్క ఆదాయ సమీకరణ ప్రయత్నాల వల్ల ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఉన్నతాధి,కారులు తెలియజేశారు. ఈ వసూళ్ల ప్రక్రియలో సమర్థవంతంగా పనిచేసిన సంబంధిత అధికారులు కోరారు.

# జాతీయ సమైక్యతకు 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' దారి

- వైవిధ్యంలో ఏకత్వమే దేశ బలం: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- పశ్చిమ భారత అభివృద్ధిలో కీలక రాష్ట్రాలు
- సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్న వేడుకలు



**హైదరాబాద్, మే1 (జనం సాక్షి):** 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమం ద్వారా రాష్ట్రాల ప్రజల మధ్య పరస్పర అవగాహన పెంపొందుతూ జాతీయ సమైక్యత బలోపేతం అవుతుందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల ప్రజలకు గవర్నర్ శుభాకాంక్షలు తెలియజేశారు. వైవిధ్యాల్లో ఏకత్వమే భారతదేశ బలం అని పేర్కొన్నారు. పశ్చిమ భారత అభివృద్ధిలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సాంస్కృతిక వారసత్వంతో పాటు ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో ఈ రాష్ట్రాలు విశిష్ట స్థానాన్ని సంపాదించాయని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమం ద్వారా భిన్న రాష్ట్రాల మధ్య సాంస్కృతిక బంధాలు బలపడుతున్నాయని గవర్నర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న మహారాష్ట్ర, గుజరాత్ ప్రజలు తమ సంప్రదాయాలను కొనసాగిస్తూ తెలంగాణ అభివృద్ధికి తోడ్పడుతున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల గవర్నర్ల సందేశాలను డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, అధికారులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

# శ్రామికుల త్యాగాలే మేడే స్ఫూర్తి

- మొయినాబాద్‌లో ఘనంగా మే డే వేడుకలు
- కార్మికుల హక్కుల కోసం పోరాటాల చరిత్ర గుర్తు
- కనీస వేతనం, సంక్షేమం అవసరం
- సమాజ నిర్మాణంలో కార్మికుల పాత్ర కీలకం



**మొయినాబాద్, మే 1 (జనంసాక్షి):**
అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా మొయినాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి భానూరి శివశంకర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు, లేబర్ సెల్ గౌరవ అధ్యక్షురాలు పామేనా శ్రీ జ్యోతి భీమ్ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కార్మికుల శ్రమ వల్లే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మే డే అనేది కేవలం పండుగ రోజు మాత్రమే కాకుండా, కార్మికుల హక్కుల కోసం జరిగిన గొప్ప పోరాటానికి ప్రతీక అని పేర్కొన్నారు. 19వ శతాబ్దంలో అమెరికాలోని చికాగో నగరంలోని హేమార్కెట్ వద్ద జరిగిన కార్మిక ఉద్యమాన్ని స్మరించుకున్నారు. రోజుకు 15–16 గంటల పాటు పని చేయాల్సిన దుస్థితిని ఎదుర్కొన్న కార్మికులు "8 గంటల పని దినం" కోసం చేసిన పోరాటం ఫలితంగానే నేడు ఈ హక్కు సాధ్యమైందన్నారు.
ప్రపంచంలో ఏ నిర్మాణం జరిగినా, ఏ వస్తువు తయారైనా దాని వెనుక కార్మికుడి కష్టం ఉంటుందని చెప్పారు. రైతులు, కర్మాగార కార్మికులు, నిర్మాణ కార్మికులు సమాజానికి వెన్నెముక వంటివారని కొనియాడారు. "శ్రమయేవ జయతే" అనే నినాదాన్ని గుర్తు చేస్తూ కార్మికుల శ్రమకు ఎప్పటికీ విలువ తగ్గదని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత, ఆరోగ్య సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమమే దేశ సంక్షేమమని, వారిని గౌరవించడం దేశాన్ని గౌరవించడమేనని తెలిపారు.

### ఇన్చార్జి ఎంఈఓగా పి రవీందర్ రావు

*శంకర్‌పల్లి మే (జనంసాక్షి) : శంకర్పల్లి మండల ఇన్చార్జి మండల విద్యాధికారిగా పి రవీందర్ రావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన మండల ఇన్చార్జి జనవాడ హెడ్మాస్టర్ సయ్యద్ అక్బర్ ఏప్రిల్ 30వ తేదీన పదవీ విరమణ అయినందున మే ఒకటో తేదీన కొత్తపల్లి హెడ్మాస్టర్ పి రవీందర్ శంకరపల్లి మండల నూతన ఇన్చార్జి మండల విద్యాధికారిగా నియమిస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.*

# కార్మిక సంక్షేమంలో ఆర్బిఓఎల్ మరో మైలురాయి

**ఆర్బిఓఎల్ కు ఉత్తమ యాజమాన్య అవార్డు.**
**మే డే సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ బుయ్యని సరళ శ్రీనివాస్ రెడ్డికి ఘన సన్మానం.**



**తాండూరు మే 1(జనంసాక్షి) :** కార్మికుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న ఆర్బిఓఎల్ సంస్థకు రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మే డే (కార్మికుల దినోత్సవం) సందర్భంగా ఉత్తమ యాజమాన్యాలకు అందించే ప్రతిష్టాత్మక అవార్డును ఈసారి ఆర్బిఓఎల్ సంస్థ సొంతం చేసుకుంది. శుక్రవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన మేడే పురస్కారాల కార్యక్రమంలో ఆర్బిఓఎల్ ఎండి బుయ్యని సరళ రెడ్డి ఈ అవార్డును జిల్లా కలెక్టర్ దీపక్ తివారి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని ముఖ్యంగా పరిగణిస్తూ వారి కనీస మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఆర్బిఓఎల్ యాజమాన్యం అభినందనీయం అన్నారు. కార్మికుల అభివృద్ధే సంస్థ అభివృద్ధికి పునాది అనే దృక్పథంతో పని చేస్తుండటం వల్లే ఈ అవార్డు దక్కిందని పేర్కొన్నారు. అనంతరం ఆర్బిఓఎల్ ఎండి బుయ్యని సరళ రెడ్డి మాట్లాడుతూ ఒక సంస్థ విజయవంతంగా నడవాలంటే కార్మికులే ప్రధాన బలం. వారి సంక్షేమం చూసుకోవడం యాజమాన్యంగా మా బాధ్యత అని అన్నారు. ఈ అవార్డును సంస్థలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి అంకితం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమం అనంతరం కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలియజేసి, వారిని సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్బిఓఎల్ సిబ్బంది, కలెక్టరేట్ అధికారులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే గ్రామాభివృద్ధి సాధ్యం

- పెద్దేముల్‌కు రూ.4.44 కోట్ల నిధులు
- బీఆర్ఎస్ వ్యాఖ్యలు అర్థరహితం
- ఆరోపణలపై కాంగ్రెస్ నేతల కౌంటర్
- అభివృద్ధిపై చర్చకు సిద్ధమన్న కాంగ్రెస్

**పెద్దేముల్, మే 1 (జనంసాక్షి):** బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దేముల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు శోభారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావే శంలో పలువురు నేతలు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ రాజకీయ ఉనికి కోసం అవాస్తవాలు ప్రచారం చేయడం సరైంది కాదని అన్నారు. అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయని వారు ఇప్పుడు విమర్శలు చేయడం హాస్యాస్పదమని సీనియర్ నాయకుడు ఎల్లారెడ్డి వ్యాఖ్యాని ంచారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాల విషయంలో చేసిన ఆరోపణలను నిరూపించాలని సవాల్ విసురుతూ, నిరూపించలేకపోతే బీఆర్ఎస్ నాయకులు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది కాలంలోనే పెద్దేముల్ మండల కేంద్రానికి రూ.4 కోట్ల 44 లక్షల నిధులు కేటాయించి అభివృద్ధి పనులు ప్రారంభించామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.
ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీని తిరస్కరించారని, ఆ పార్టీ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని టీపీసీసీ మైనారిటీ రాష్ట్ర కన్వీనర్ రియాజ్ సూచించారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో పెద్దేముల్‌ను దశలవారీగా అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ మైనారిటీ రాష్ట్ర కన్వీనర్ రియాజ్, సీనియర్ నాయకులు ఎల్లా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, తాండూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జితేందర్ రెడ్డి, పడగల బుజ్జమ్మ, గ్రామ కమిటీ అధ్యక్షుడు డివై నర్సింలు, మాజీ సర్పంచ్ ఎర్ర బాలప్ప, కోటపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇక్బాల్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు షబ్బీర్, బ్యాగరి మల్లేశం, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నియోజకవర్గం స్థాయి సభలను విజయవంతం చేయాలి

- మే 2న రాష్ట్రవ్యాప్తంగా సభలు నిర్వహణ : జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిది మే 1 (జనంసాక్షి):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 2న నిర్వహించే నియోజకవర్గ స్థాయి సభలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రతి నియోజకవర్గంలో పాఠశాలలు, మండల కార్యాలయాలు లేదా అనువైన బహిరంగ ప్రదేశాల్లో ఉదయం 10 గంటలకు సభలు ప్రారంభించాలని తెలిపారు. సభలలో ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని, రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించి ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేసి వాటిపై చర్చలు జరగేలా చూడాలన్నారు.
ఈ సమావేశాలలో ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, రైతులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యాలు కల్పించడంతో పాటు స్క్రీన్, ప్రొజెక్టర్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫేస్ ఫోటో క్యాప్చర్ తిప్పలు.. ఉపాధి కూలీల ఆవేదన

- నెట్ సమస్యలతో గంటల తరబడి నిరీక్షణ
- ఉదయం-మధ్యాహ్నం ఫోటోలు తప్పనిసరిపై అసంతృప్తి
- ట్రైనింగ్ లేక ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
- ప్రత్యామ్నాయ హాజరు విధానం కోరుతున్న కూలీలు



ధారూర్, మే 1 (జనంసాక్షి): ఉపాధి హామీ పనుల్లో ఫేస్ ఫోటో క్యాప్చర్ విధానం కూలీలు, సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. మార్చి 1 నుంచి మండలంలోని గ్రామాల్లో ఈ విధానం అమలు చేయడంతో పని ప్రదేశాల్లో కూలీలకు సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రతి కూలికి పని సమయంలో ఫేస్ ఫోటో తీసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాల్సి ఉండగా, నెట్‌వర్క్ సమస్యల కారణంగా ఫోటోలు అప్లోడ్ కాక గంటల తరబడి కూలీలు ఎండలో వేచి ఉండాల్సి వస్తోంది. పని చేసిన దానికన్నా ఎక్కువ సమయం నిరీక్షణలో గడుస్తుండటంతో కూలీలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఉదయం, మధ్యాహ్నం రెండుసార్లు ఫోటో తప్పనిసరి చేయడంపై కూడా కూలీలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారి ఫోటో తీసుకుంటే సరిపోతుందని వారు అంటున్నారు.
మరోవైపు కొత్త విధానం అమలుపై గ్రామస్థాయి ఉపాధి హామీ సిబ్బందికి సరైన శిక్షణ ఇవ్వకపోవడంతో వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. సాంకేతిక లోపాలు, నెట్ సమస్యల కారణంగా ఫోటో క్యాప్చర్ ప్రక్రియ సక్రమంగా సాగడం లేదని చెబుతున్నారు. అధికారులు మాత్రం నకిలీ హాజరు నివారణ, పారదర్శకత కోసం ఈ విధానం అమలు చేస్తున్నామని పేర్కొంటున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ హాజరు విధానం కల్పించాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు. ఫోటో అప్లోడ్ లోపాల వల్ల వేతనాలు నిలిపివేయకూడదని కోరుతున్నారు. ఈ విషయంపై ధారూర్ ఏపీఓ రాములు స్పందిస్తూ ఆన్‌లైన్‌లో ఫోటోలు అప్లోడ్ చేయడానికి సమయం పడుతుందని తెలిపారు. ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని కూలీలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మహనీయుల సిద్ధాంతాలు నేటితరానికి మార్గదర్శకం

- సమానత్వం, విద్య ప్రాముఖ్యతపై వక్తల సందేశం
- యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి : ప్రొఫెసర్ కాశిం, జె.బి.రాజు
- మహనీయుల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే యాదయ్య



**చేవెళ్ల, మే 1 (జనంసాక్షి):** మహనీయుల సిద్ధాంతాలు నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని దళితసేన జాతీయ అధ్యక్షులు జె.బి. రాజు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కాశిం, బసవ మహమానే ట్రస్టు అధ్యక్షులు డా. సిద్ధ రామేశ్వర్ శరణారు బెల్జాల్ పేర్కొన్నారు. మహనీయుల జయంతిని పురస్కరించుకుని చేవెళ్ల మహనీయుల జాతర కమిటీ ఆధ్వర్యంలో జాతర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీగా సాగుతూ మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, మహాత్మా బసవేశ్వర విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేజీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సభను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహనీయుల త్యాగాల వల్లనే సమాజం పురోగతి సాధించిందన్నారు. సమానత్వ భావనను బోధించిన గౌతమ బుద్ధుని సూత్రాలను గుర్తు చేశారు. మహిళా విద్య కోసం మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన కృషిని కొనియాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా అనేక వర్గాల ప్రజలు ఉన్నత స్థానాలకు ఎదిగే అవకాశం కలిగిందన్నారు.
యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించాలని సూచించారు. సామాజిక న్యాయం కోసం మహనీయుల మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు మాత్రమే పరిమితం కాకుండా వారి ఆలోచనలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. దేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయుల అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ పామేన భీం భరత్, మహనీయుల కమిటీ చైర్మన్ బురాన్ ప్రభాకర్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఇంఛార్జ్ దేశమొల్ల ఆంజనేయులు, మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాఆగిరెడ్డి, మంగలి కల్యాణియాదగిరి, సోలిపురం సుచితబల్వంత్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, ఫైండ్ల మధుసూదన్ రెడ్డి, దేవులపల్లి శ్రీనివాస్ రెడ్డి, తాళ్లపల్లి నర్సింలు, కృష్ణానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది పెంటయ్యగౌడ్, బ్యాగరి రాములు, ముడిమ్యాల సొసైటీ మాజీ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు అత్తెల్లి అనంత్ రెడ్డి, సర్పంచుల సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు రెడ్డిశెట్టి మధుసూదన్ గుప్తా, సర్పంచ్ రామచంద్రయ్య గౌడ్, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, బీజేపీ యువ నాయకులు డాక్టర్ మల్గారి వైభవ్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, చేవెళ్ల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు సున్నపు ప్రవీణ్, మహనీయుల కమిటీ వైస్ చైర్మన్లు మాచన్ పల్లి రామస్వామి, నరేందర్, కమిటీ సభ్యులు బ్యాగరి ప్రభాకర్, మల్లెపలి శ్రీనివాస్, ఆయా గ్రామాల అంబేద్కర్ సంఘాల సభ్యులు, మేధావులు, ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల కోసం నెత్తురు ధార పోసిన కార్మికులు

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి
- రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి



**అబ్దుల్లాపూర్ మెట్, మే 1 (జనం సాక్షి ):**
కార్మికుల హక్కుల సాధన కోసం అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన ఉద్యమాల్లో అనేక మంది కార్మికులు ప్రాణాలు అర్పించారని, వారి త్యాగాల ఫలితమే నేటి మేడే అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పేర్కొన్నారు. 141వ మేడే దినోత్సవాన్ని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలోని ఆర్కే నగర్‌లో శాఖ కార్యదర్శి భైరగోని రాజు గౌడ్ అధ్యక్షతన ఘనంగా మేడే ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాల యాదిరెడ్డి జెండా ఆవిష్కరించారు. అనంతరం రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేజ్–2లోని సిపిఐ పార్టీ కార్యాలయం నుండి బైక్ ర్యాలీ చేపట్టి రాజీవ్ గృహకల్ప, కుంట్లూరు, పెద్ద అంబర్‌పేట్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, ఆర్ఎన్ఆర్ కాలనీ 1, 3, అంజనాద్రి తదితర ప్రాంతాల్లో జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 8 గంటల పనిదినం, బానిసత్వ విముక్తి, పెట్టుబడి దారీ దోపిడీకి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలంలో సాధించిన కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్లు తీసుకురావడం ద్వారా కార్మికులను తిరిగి బానిసత్వంలోకి నెట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. అదేవిధంగా జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించడం దేశ సంపదను దోచిపెట్టడమేనని ఆరోపించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెంచడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలపై భారాన్ని మోపుతున్నారని తెలిపారు. కార్పొరేట్ అనుకూల విధానాలు, కుల–మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహా, బిఓసి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి వేణు, మండల నాయకులు యేశాలి నర్సింహా, సైదులు ముదిరాజ్, మధు, డౌల రాములు, రమేష్ నాయక్, పేరాల గోపి, బిచ్చు నాయక్, సుధాకర్, గడ్డం రాములు, నారాయణ, విజయ్, నిరంజన్, ఉప్పలయ్య, యాదగిరి, కారంపొడి నర్సింహా, వినోద్ నాయక్, రాము, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాలల భవిత.. అభివృద్ధికి భరోసా..






- విద్య, వైద్యం రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- ఎదుగుదల లోపించిన పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు
- వేములవాడ ఏరియా ఆసుపత్రిలో 85 మంది పిల్లలకు చికిత్స : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 1 (జనంసాక్షి):**
ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బాలల భద్రత, డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల సందర్భంగా బాల భరోసా పై వేములవాడ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. డీఈఐసీ కేంద్రంలో 85 మంది పిల్లలకు చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పిల్లలకు చికిత్స అందిస్తుండగా, ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్ పరిశీలించి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు.
ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామన్నారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. పోలీస్ శాఖ, రవాణా శాఖ ఆధ్వర్యంలో అరైవ్.. అలైవ్ కింద రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారని గుర్తు చేశారు. డ్రైవర్లకు వైద్య, కంటి పరీక్షలు చేయించామన్నారు. విద్య, వైద్యం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. త్వరలో ఉస్మానియా, గాంధీ, నిలోఫర్ ఇతర ఆసుపత్రుల పరిధి లో అధునాతన వైద్య సేవలు, నూతన బెడ్లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, ఆరోగ్యం సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కింద ఒక్కో వారం ఒక్కో కార్యక్రమం చేపడుతున్నారని తెలిపారు. ఎదుగుదల లోపించిన పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు జిల్లాలో అందుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదలు, అనారోగ్య బాధితులకు వైద్య సేవలు పొందేందుకు ఎలఓసీలు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్నామని తెలిపారు. వేములవాడ, ఏరియా ఆసుపత్రి, హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో మాత్రమే మోకాళ్ల ఆపరేషన్లు జరుగుతున్నాయన్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రికి కావలసిన వైద్య పరీక్షల యంత్రాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఆసుపత్రికి వచ్చే వారికి ప్రేమ, గౌరవంతో వైద్య సేవలు అందించాలని సూచించారు.

**ఎదుగుదల లోపించిన పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు**
ఎదుగుదల లోపాలు గల పిల్లలు, చెవిటి, మూగ, మానసిక బుద్ధి మాంద్యం గల, నడవలేని వాళ్లు, పుట్టుకతో వచ్చే లోపాలు గల పిల్లలు, మెదడు సంబంధించిన సమస్యలు, సరిగా మాట్లాడలేని పిల్లలు, రక్తహీనత, పోషకాహారం లోపం గల పిల్లలను అంగన్వాడీ కేంద్రాల వారి సమాచారంతో వైద్యులు వివిధ పరీక్షలు చేసి పిల్లలలోని లోపాన్ని గుర్తిస్తారని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఆర్బీఎస్కే వాహనం ద్వారా వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రానికి తరలించి వైద్య సేవలు అందిస్తారని వెల్లడించారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.
మూడేళ్ల వయసు, అలాగే ఆరేళ్లలోపు పిల్లలు తమ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో నమోదు కావాలని సూచించారు. కోడి గుడ్లు, బాలామృతం, ఇక్రిశాట్ వారి సూచనల మేరకు రూపొందించిన స్నాక్స్, పాలు పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. చదివే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పిల్లలకు తినడం, ఆడుకోవడం ఇతర అంశాల్లో రాణిస్తారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా పిల్లల ఎత్తు, బరువు కొలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, డిప్యూటీ డీఎంహెచఓ నాగేంద్రబాబు, డీఐఓ నాగేంద్రబాబు, వైద్యులు సంపత్ కుమార్, దివ్య, నయీమా, డిప్యూటీ డెమో రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## బాల భరోసాతో శారీరకవైకల్యాలను ముందుగానే గుర్తించండి



**నిజామాబాద్ సిటీ మే 01:(జనం సాక్షి) :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం విభాగశీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికా లో భాగముగా బాల భరోసా కార్యక్రమాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఏడవ అంతస్తు కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమములో జిల్లా వైద్య శాఖా అధికారిణి డా.రాజశ్రీ ,జిల్లా సంక్షేమాధికారిణి పద్మ ,జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీ నాగ మోహన్ రావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.అశోక్, సిడిపిఓలు, సూపర్ వైజర్లు, మెడికల్ హెల్త్ టీం డాక్టర్లు, ఆర్‌బిఎస్‌కే సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు. పిల్లలలో (0-5 సంవత్సరాలు) అభివృద్ధిలో జాప్యాలు, నాడీ సంబంధిత అభివృద్ధి సమస్యలు, శారీరక వైకల్యాలను ముందుగానే గుర్తించడానికి ఉద్దేశించిన బాల భరోసా పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ,ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి మహిళా శిశు సంక్షేమ శాఖా, ఆరోగ్య శాఖా సమన్వయముతో పనిచేయాలని జిల్లా వైద్య శాఖా అధికారిణి రాజశ్రీ , జిల్లా సంక్షేమాధికారిణి పద్మ కోరినారు అభివృద్ధిలో జాప్యాలు, నాడీ సంబంధిత అభివృద్ధి సమస్యలు, శారీరక వైకల్యాలను ఉన్న పిల్లలకు చికిత్స అందించడానికి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుండి పూర్తి సహాకారం ఉంటుందని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీ నాగ మోహన్ రావు చెప్పారు. అలాగే నవజాత శిశువు నుండి 18 సంవత్సరాల వయస్సుగల పిల్లలందరికీ రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా మొబైల్ హెల్త్ టీమ్స్ ద్వారా అన్ని అంగన్వాడీ కేంద్రాలలో, ప్రభుత్వ పాటశాలలో ఉచితంగా హెల్త్ స్క్రీనింగ్ చేయించి ఏవైనా సమస్యలు ఉన్న విద్యార్థులకు ఎర్లీ ఇంటర్వెన్షన్ కేంద్రంలో పుట్టుకతో వచ్చే లోపలకు, దంత సమస్యలకు, అనీమియా, మరియు పోషకాహార లోపలకు, గుండె సంబంధిత వ్యాధులు, చిన్నారుల్లో అన్ని రకాల శస్త్ర చికిత్సలకు, దంత సమస్యలకు, కంటి సమస్యలకు, చర్మ వ్యాధులకు, తదితర వ్యాధులకు చికిత్సలు చేయించబడును అని జిల్లా వైద్య శాఖ అధికారిని డా. రాజశ్రీ తెలియజేశారు.

## ఆన్‌లైన్‌లో 'విష' విక్రయాలకు బ్రేక్

**అమెజాన్‌కు రాష్ట్ర వ్యవసాయ కమిషన్ ఆదేశాలు నిర్ణయంపై డాక్టర్ మహేశ్ రెడ్డి హర్షం**



**కరీంనగర్ బ్యూరో, మే 01 (జనంసాక్షి) :** రాష్ట్రంలో నిషేధిత పురుగు మందుల ఆన్‌లైన్ విక్రయాలపై తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కఠిన చర్యలు చేపట్టింది. మానవ ఆరోగ్యానికి అత్యంత హానికరమైన 'పరాక్వాట్' సహా ఇతర విషపూరిత పురుగు మందులను ఈ -కామర్స్ వేదికల ద్వారా విక్రయించరాదని ప్రముఖ సంస్థ అమెజాన్ ను ఆదేశించింది. గురువారం రోజు కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ కోదండ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు, అమెజాన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న విక్రయాలు, ప్రజల ఆరోగ్య సమస్యలపై చర్చించారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే నిషేధించిన ప్రమాదకర రసాయనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉండటం పై ఛైర్మన్ ఆందోళన వ్యక్తం చేశారు. పరాక్వాట్ వంటి రసాయనాల విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని సూచించారు. దీనికి స్పందించిన అమెజాన్ ప్రతినిధులు, తమ జాబితా నుంచి నిషేధిత ఉత్పత్తులను తొలగిస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్ మర్రి మహేశ్ రెడ్డి పోరాట ఫలితం కమిషన్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని వన్ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ మర్రి మహేశ్ రెడ్డి స్వాగతించారు. పరాక్వాట్ వంటి విషపూరిత పురుగు మందులను పూర్తిగా నిషేధించాలని కోరుతూ ఆయన గత కొంతకాలంగా కేంద్ర , రాష్ట్ర మంత్రులు, ఎంపీలకు వినతిపత్రాలు అందజేస్తూ, నిరంతర పోరాటం చేస్తున్నారు. అసెంబ్లీలోనూ ఈ అంశం చర్చకు వచ్చేలా ఆయన విశేష కృషి చేశారు. ఆన్‌లైన్ విక్రయాల పై నియంత్రణ విధించడం సానుకూల పరిణామమని, ఇది రైతులు, ప్రజల ఆరోగ్య రక్షణకు దోహదపడుతుందని డాక్టర్ మహేశ్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటం

- నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి
- మున్సిపల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రవిచంద్రన్ డిమాండ్
- లేబర్ అడ్డా వద్ద వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి



**అల్వాల్, మే 1(జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని మున్సిపల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. రవిచంద్రన్ డిమాండ్ చేశారు. ప్రపంచ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా శుక్రవారం ఆల్వాల్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ముఖ్య ప్రసంగం చేశారు. కార్మికులను బానిసలుగా మార్చేలా ఉన్న లేబర్ కోడ్లను రద్దు చేయడంతో పాటు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని రవిచంద్రన్ కోరారు. కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి. శ్రీనివాస్ మాట్లాడుతూ.. కార్మికుల పక్షాన నిరంతరం పోరాడేది ఎర్రజెండా మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ భోగేశ్వర రావు పాల్గొని కార్మికుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. సభకు జి.మహేందర్, డి.ఎన్.శేఖర్ అధ్యక్షత వహించగా.. వెన్నెలక్క, సి.ఎల్.యాదగిరి, సయ్యద్ కౌసర్, రమేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు స్థానిక లేబర్ అడ్డా వద్ద మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్మిక నాయకుడు బాలయ్య ఆధ్వర్యంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్మికుల శ్రమతోనే సమాజం నిర్మితమవుతోందని, కార్మిక వర్గానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలయ్యతో పాటు స్థానిక నేతలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంథని పట్టణ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి : మంత్రి డి. శ్రీధర్ బాబు
- గోదావరి నది స్వచ్ఛత, అయ్యగారి చెరువు సుందరీకరణకు చర్యలు
- మున్సిపల్ కార్యాలయం, ఎంఆర్వో, ఆర్డీవో భవనాల నిర్మాణం వేగవంతం



**మంథని, మే 01 (జనం సాక్షి);**
పెద్దపల్లి జిల్లా మంథని పట్టణ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం మంథని పట్టణంలో మంత్రి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. గోదావరి నదిని సందర్శించిన మంత్రి, నదిలో స్వచ్ఛమైన నీరు ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
నిర్మాణంలో ఉన్న కొత్త మున్సిపల్ కార్యాలయ భవనాన్ని పరిశీలించిన మంత్రి, భవన నిర్మాణంలో కొన్ని మార్పులు సూచించారు. ప్రతి గది స్పష్టంగా కనిపించేలా ఉండాలని, సమృద్ధిగా గాలి, వెలుతురు వచ్చే విధంగా నిర్మాణం చేయాలని తెలిపారు. విద్యుత్ వినియోగం సమర్థవంతంగా ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని, ప్రతి గదికి కిటికీలు ఉండాలని సూచించారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఎంఆర్వో, ఆర్డీవో, సమగ్ర మండల కార్యాలయ సముదాయాలను పరిశీలించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలోని పాత భవనాన్ని ఐటి శాఖకు కేటాయించి పునరుద్ధరణ చేపట్టాలని మంత్రి సూచించారు. మంథనిలోని అయ్యగారి చెరువును సందర్శించిన మంత్రి, బండ్ సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, రహదారి క్లియర్ చేసే చర్యలు తీసుకోవాలని నీటిపారుదల అధికారులను ఆదేశించారు. టాస్క్ కార్యాలయాన్ని సందర్శించి కొన్ని చిన్న మార్పులు చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఆర్డీవో సురేష్, ఎమ్మార్వో ఆరిఫ్ ఉద్దీన్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, అధికారులు, మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**కార్మికుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం**
పెద్దపల్లి జిల్లా మంథనిలో సిఐటియు ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరై ప్రసంగించా రు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కార్మికుల పక్షపాతి గా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, అర్హులైన మున్సిపల్ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తామని, జీతాల పెంపుదల కోసం కృషి చేస్తామని, ఎన్ఎంఆర్ కార్మికులను కాంట్రాక్ట్ పరిధిలోకి తీసుకురావడానికి కృషి చేస్తానని, కార్మికుల సంక్షేమం కోసం మే డే స్ఫూర్తితో పని చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్ పర్సన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోహర్, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, సిఐటియు నాయకులు వేల్పుల సురేష్, చింతల గోవింద్ మల్లేష్, చందు, గట్టయ్య, జంపయ్య, పోచమ్మ, భాగ్య, సుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

**సూపర్ సమ్మర్ క్యాంపును సందర్శించిన మంత్రి శ్రీధర్ బాబు**
పెద్దపల్లి జిల్లా మంథనిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీ ఫైబర్ నెట్ ద్వారా నిర్వహిస్తున్న సూపర్ సమ్మర్ క్యాంపును మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సందర్శించి, క్యాంపులో నేర్చుకుంటున్న విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న సూపర్ సమ్మర్ క్యాంపులో విద్యార్థులలో కనిపిస్తున్న సృజనాత్మకత, కళ, కొత్త ఆలోచనలు చూస్తే రేపు రాబోయే కాలంలో గొప్ప ఇంజనీర్లుగా తయారవుతారని అన్నారు. ఈ కంప్యూటర్ యుగంలో రోబోటిక్స్ ద్వారా, ఆటోమేటిక్ సెన్సార్ ద్వారా మూన్ ల్యాండింగ్ యంత్రాన్ని మూడు రోజుల్లో ఈ చిన్నారులు తయారు చేయడం అద్భుతమని ప్రశంసించారు. టీ ఫైబర్ నెట్ ద్వారా ఐదు రోజుల కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని పాఠశాలలను ఎంపిక చేశామని, మొత్తం 350 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులను శక్తివంతంగా ముందుకు నడపాలని, యావత్ రాష్ట్రమంతా ఈ రకమైన శిక్షణ ఇస్తామని మంత్రి వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో సురేష్, మంథని మున్సిపల్ చైర్ పర్సన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంథని పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

*ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు*

- పట్టణ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**మంథని, ( జనంసాక్షి ) :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం మంథని పట్టణంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరి నదిని సందర్శించిన మంత్రి, నదిలో స్వచ్ఛమైన నీరు ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న కొత్త మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించిన మంత్రి, భవన నిర్మాణంలో కొన్ని మార్పులు సూచించారు. ప్రతి గది స్పష్టంగా కనిపించేలా ఉండాలని, సమృద్ధిగా గాలి, వెలుతురు వచ్చే విధంగా నిర్మాణం చేయాలని తెలిపారు. విద్యుత్ వినియోగం సమర్థవంతంగా ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని, ప్రతి గదికి కిటికీలు ఉండాలని సూచించారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఎంఆర్వో, ఆర్డీవో, సమగ్ర మండల కార్యాలయ సముదాయాలను పరిశీలించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలోని పాత భవనాన్ని ఐటి శాఖకు కేటాయించి పునరుద్ధరణ చేపట్టాలని మంత్రి సూచించారు.మంథనిలోని అయ్యగారి చెరువును సందర్శించిన మంత్రి, బండ్ సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, రహదారి క్లియర్ చేసే చర్యలు తీసుకోవాలని నీటిపారుదల అధికారులను ఆదేశించారు.అలాగే టాస్క్ కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి, కొన్ని చిన్న మార్పులు చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఆర్డీవో సురేష్, ఎమ్మార్వో ఆరిఫ్ ఉద్దీన్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, అధికారులు, మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, మంథని మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**కొత్తపల్లిలో ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**కరీంనగర్ బ్యూరో, మే 01 (జనంసాక్షి):**
కరీంనగర్ కార్పోరేషన్ కొత్తపల్లి 17వ డివిజన్‌లో పూర్తయిన మొట్టమొదటి ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు పెంటి శ్రీలత శ్రీకాంత్ ఇందిరమ్మ ఇల్లును సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఇల్లు లేని ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. మొదటి విడతలో మంజూరైన లబ్దిదారులు పోను ఇంకా మిగిలిపోయిన లబ్ధిదారులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, గడ్డం శ్రీనివాస్, చిలుక హన్మంత రెడ్డి, గున్నాల రమేష్, చింతల శ్రీనివాస్ రెడ్డి, జేరిపోతుల వాసు, యాస్వాడ రాజకుమార్, కొండం శ్రీనివాస్, సంగం మునిందర్, రాపర్తి రాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల కోసం పోరాటాలు చేద్దాం: బండారి శేఖర్

కరీంనగర్ టౌన్, మే 1 (జనంసాక్షి): కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ట్రేడ్ యూనియన్ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒఖజజ జాతీయ కమిటీ సభ్యులు బండారి శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మేడే స్ఫూర్తితో కార్మికులు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తోందని విమర్శిస్తూ, నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.
గతంలో కార్మికులు రోజుకు 16-18 గంటలు పని చేయాల్సి వచ్చేదని, దీర్ఘకాల పోరాటాల ఫలితంగా 8 గంటల పని విధానం సాధించుకున్నామని గుర్తుచేశారు. ప్రస్తుతం పని గంటల పెంపు ప్రయత్నాలను వ్యతిరేకించాలని సూచించారు. కార్మికులు అంటే కేవలం కూలీలు మాత్రమే కాకుండా, రైతు కూలీలు, షాప్ గుమాస్తాలు, ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ రంగ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, డాక్టర్లు, ఇంజనీర్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, గిగ్ వర్కర్లు, ఆటో డ్రైవర్లు, హమాలీలు తదితరులందరూ కార్మికులేనని ఆయన స్పష్టం చేశారు. కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏజెన్సీ వ్యవస్థను తొలగించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యూనియన్ అధ్యక్షుడు అరుణ్, కార్యదర్శి కళావతి, నాయకులు శారద, సరళ, నరేష్, మౌనిక, లలిత, రమణ, సంపత్ పాల్గొన్నారు.

## నేడు ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సభ

- నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో,మే 01 (జనం సాక్షి);**
ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా ఈ నెల 2 వ తేదీన శనివారం జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గ స్థాయి సభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.శనివారం నియోజకవర్గ స్థాయి సభల నిర్వహణపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సభను ఏర్పాటు చేయాలని సూచించారు.ఆరు గ్యారంటీలు,వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలతో కరపత్రం రూపొందించాలని, దానిని కార్యక్రమంలో అందజేయాలని తెలిపారు. మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, రైతులు, వివిధ పథకాల లబ్ధిదారులను ఆహ్వానించాలని ఆదేశించారు.అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.సభలు తెలంగాణ రాష్ట్ర గీతం (జయ జయహే తెలంగాణ) స్వాగతోపన్యాసం, పరిచయం అలాగే సీఎం సందేశం వినిపించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ.500 కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న రకం వరికి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల వివరాలు,సాధించిన విజయాలపై శాఖల ద్వారా సమాచారం ఇవ్వాలని, లబ్ధిదారుల పేర్లను చదవాలని, లబ్ధిదారుల అభిప్రాయాలు, అనుభవాలు చెప్పాలని తెలిపారు.ఇప్పటి దాకా అమలు చేస్తున్న వాటిపై చర్చించాలని, భవిష్యత్లో చేపట్టనున్న పనులపై తీర్మానాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.ఇట్టి సమావేశంలో హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, డీఆర్డీఓ గీత, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దీన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు సమాజానికి వెన్నెముక.. వారి శ్రమే దేశ అభివృద్ధికి బలం

- శ్రమే జయం.. కార్మికులకు గౌరవం, గుర్తింపు
- మున్సిపల్ కార్మికులకు 30 లక్షల ప్రమాద భీమా.. త్వరలో వేతనాల పెంపు




**కరీంనగర్ బ్యూరో, మే 1 (జనంసాక్షి):** ప్రతి విజయానికి మూలం శ్రమ, ప్రతి అభివృద్ధికి బలం కార్మికులని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో "మే డే" వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్మిక, ఉపాధి, ఉత్పత్తి పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మేయర్ కొలగాని శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్ర, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కార్మికుల చట్టాలు, హక్కులు, ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్ర, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, అదనపు కలెక్టర్ తానాజీ వాకడే తమ చేతుల మీదుగా పలువురు ఉత్తమ ఉద్యోగులకు, కార్మికులకు శాలువాలతో సత్కరించి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతిక సారధి కళాకారుల ఆట, పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, శ్రమజీవుల కష్టానికి గౌరవం, గుర్తింపు ఇచ్చే రోజు అంతర్జాతీయ కార్మిక దినోత్సవమని అన్నారు. కార్మికులోకానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులు సమాజానికి వెన్నెముక లాంటి వారని, వారి శ్రమ దేశ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికుల కష్టం వల్లనే నగరం సుందరంగా ఉంటుందన్నారు. వేతన సవరణ, పని వేళల సడలింపు, కార్మికుల రక్షణలో ప్రభుత్వాలు అండగా ఉండాలన్నారు. పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచేందుకు త్వరలోనే పాలకవర్గంతో తీర్మానం చేసి, సీడీఎంఏ, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నగరపాలక సంస్థ ద్వారా మున్సిపల్ కార్మికులకు 30 లక్షల రూపాయల ప్రమాద భీమా కల్పిస్తున్నామని తెలిపారు. ఇటీవల ఎలక్ట్రిసిటీ కార్మికుడికి ప్రమాదం జరిగినప్పుడు హాస్పిటల్ ఖర్చులు మొత్తం పాలకవర్గం తీర్మానం చేసి అందించినట్లు గుర్తు చేశారు. కార్మికుల అంకితభావం, కష్టపడే మనస్తత్వం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మిక, ఉపాధి, ఉత్పత్తి పరిశ్రమల శాఖల అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
2 మే 2026

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

## బ్యాంకు గ్యారంటీకి క్యాబినెట్ అనుమతి ఇచ్చింది.. మార్క్‌ఫెడ్ తాత్సారం చేయొద్దు

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొక్క జొన్న సాగుకు ఆంక్షలెన్నో
- కాంగ్రెస్ ప్రభుత్వ ప్రోత్సాహంతో విరివిగా మొక్క జొన్న సాగు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించేందుకు మార్క్ ఫెడ్ అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైద్యం డాక్టర్ జీ.చిన్నారెడ్డి సూచించారు. మొక్కజొన్నలను వెంటనే కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్ సంస్థకు ఆదేశించి బ్యాంకు గ్యారంటీకి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని చిన్నారెడ్డి తెలిపారు. క్యాబినెట్ సూచనల మేరకు మార్క్ ఫెడ్ అధికారులు వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని చిన్నారెడ్డి సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ప్రోత్సాహాన్ని అందించడంతో మొక్కజొన్న పంట విస్తీర్ణం పెరిగి విరివిగా మొక్క జొన్నలు ఉత్పత్తి అయ్యాయని చిన్నారెడ్డి అన్నారు. మార్క్ ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఇంకా ప్రారంభించకపోవడంతో రైతులు మద్దతు ధర కన్నా తక్కువగా మార్కెట్ లో మొక్కజొన్నలను అమ్ముకునే దుస్థితి నెలకొందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ కనీస మద్దతు ధరకు తగ్గకుండా మొక్కజొన్న ధర క్వింటాలుకు రూ. 2,400 రైతులకు అందించాలని చిన్నారెడ్డి సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొక్కజొన్నల సాగుపై రైతులపై విధించిన ఆంక్షలు వల్ల రాష్ట్రంలో మొక్కజొన్న సాగు గణనీయంగా తగ్గిందని, మొక్కజొన్నలు పండిస్తే ప్రభుత్వం కొనే సమస్య లేదని బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు హెచ్చరించిన విషయాన్ని చిన్నారెడ్డి గుర్తు చేశారు. ఈ సీజన్ లో పత్తి ఉత్పత్తి గణనీయంగా పెరగడం, పత్తి బేళ్లు భారీగా మార్కెట్ కు రావడం వల్ల పత్తి కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థను రంగంలోకి దించి పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని చిన్నారెడ్డి వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.

# సౌదీ నుంచి కోమా పేషెంట్‌ను తెప్పించి నిమ్స్‌లో వైద్యం అందించండి

## స్పందించిన సీఎం ప్రజావాణి ఇంచార్జి డాక్టర్ జీ. చిన్నారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సౌదీ అరేబియా దమ్మాంలో గత మూడు నెలలుగా ఆసుపత్రిలో కోమా స్థితిలో చికిత్స పొందుతున్న తిరుకోవులూరు శ్రీనివాస్ (56) ను స్వదేశానికి తెప్పించి, హైదరాబాద్ నిమ్స్ లో వైద్యం అందించాలని అతని భార్య చంద్రకళ శుక్రవారం హైదరాబాద్ ప్రజాభవన్ లో 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' లో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేరిట వినతిపత్రం సమర్పించారు. తాము పేదవారమని, సౌదీలో వైద్య ఖర్చులను భరించలేమని, కోమా పేషెంట్ ను హైదరాబాద్ కు తీసుకువచ్చిన తర్వాత నిమ్స్ ఆసుపత్రిలో వైద్యం అందించాలనే నిజామాబాద్ పట్టణం గాజుల పేట్ కు చెందిన కుటుంబ సభ్యుల విజ్ఞప్తిని స్పందించిన సీఎం ప్రవాసీ ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి తగిన చర్యలు తీసుకోవాలని సీఎంఓ అధికారులను, నిమ్స్ డైరెక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ అంబాసిడర్ డా. బిఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, సీఎం ప్రవాసీ ప్రజావాణి లైజన్ ఆఫీసర్ భార్గవి నద్దునూరి, ఖతార్ ఇండియన్ ఎంబసీలో ఐసిబిఎఫ్ లీగల్ సెల్ ప్రతినిధి ఖాజా నిజాముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

### సీఎం ప్రజావాణిలో 142 దరఖాస్తులు

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన 218వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 142 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 37, రెవెన్యూ శాఖకు సంబంధించి 24, ఇందిరమ్మ ఇండ్ల కోసం 40, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 39 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏ.సీ.పీ. ఉమేందర్, ఎన్. ఆర్. ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పంజాబ్ అసెంబ్లీలో దుమారం

## సీఎం మద్యం మత్తులో ఉన్నారంటూ కాంగ్రెస్ విమర్శలు



**చండీఘడ్, మే1 (జనంసాక్షి) :** పంజాబ్ అసెంబ్లీలో దుమారం చెలరేగింది. సీఎం భగవంత్‌మాన్ మద్యం తాగి వచ్చారని ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. మే డే సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. పలుమార్లు తడబడ్డారని అన్నారు. సభ్యులందరికీ బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయాలని స్పీకర్‌ను కోరారు. భగవంత్‌మాన్ అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సమయంలో ఆయన మద్యం మత్తులో ఉన్నారని ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆరోపించడంతో ఈ వివాదం చెలరేగింది. సీఎం అసెంబ్లీలో మాట్లాడుతున్న వీడియోను శిరోమణి అకాలీదళ్ నేతలు సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి మద్యం సేవించి అసెంబ్లీకి రావడం సిగ్గుచేటని ఆ పార్టీ విమర్శించింది. నిజానిజాలు బయటపెట్టడానికి ప్రజల సమక్షంలో భగవంత్‌మాన్‌కు డోప్ టెస్ట్ నిర్వహించాలని డిమాండ్ చేసింది. దీనిపై సీఎం స్పందిస్తూ..ఈ ప్రత్యేక సమావేశంలో వాదనలకు దూరంగా ఉండి హుందాగా ప్రవర్తించాలని కోరారు.

# పవన్ ఖేరాకు సుప్రీంలో ఊరట

## షరతులతో కూడిన బెయిల్ మంజూరు



**న్యూఢిల్లీ, మే1 (జనంసాక్షి) :** కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరాకు భారీ ఊరట లభించింది. అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ భార్యపై వ్యాఖ్యల కేసులో సుప్రీంకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ జారీ చేసింది. ఈ క్రమంలో ఖేరాకు న్యాయస్థానం కొన్ని షరతులు విధించింది. అస్సాం సీఎం సతీమణి రిణికి భూయాన్ శర్మకు పలు పాస్‌పోర్టులు, విదేశాల్లో ఆస్తులు ఉన్నాయంటూ ఖేరా చేసిన ఆరోపణలపై ఆమె ఫిర్యాదు మేరకు గువాహటిలో ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం పవన్ ఖేరా చేసిన అభ్యర్థనను గువాహటి హైకోర్టు తిరస్కరించడంతో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ జరిపి తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరుచేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా విచారణకు సహకరించాలని, పిలిచినప్పుడు పోలీసుల ముందు హాజరుకావాలని పవన్‌ఖేరాను న్యాయస్థానం ఆదేశించింది. సాక్ష్యాలు తారుమారు చేయడం వంటి చర్యలకు పాల్పడకూడదని పేర్కొంది. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని కూడా స్పష్టం చేసింది. ఇక, విచారణ సమయంలో అవసరమని భావిస్తే.. అదనపు షరతులు విధించే స్వేచ్ఛ ట్రయల్ కోర్టుకు ఉందని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది.

# సీతారాం ఆత్మహత్య.. నెలలోపే భార్య వివాహం

- తాజాగా బయటపడ్డ పెళ్లి వ్యవహారం
- కటకటాల్లో ఊచలు లెక్కిస్తున్న కొత్త దంపతులు

**హైదరాబాద్, మే1 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో బాచుపల్లి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సీతారాం ఆత్మహత్య కేసులో సంచలన మలుపు చోటుచేసుకుంది. కట్టుకున్న భార్య మోసాన్ని భరించలేక సీతారాం ప్రాణాలు తీసుకుంటే.. ఆయన చనిపోయిన నెల రోజులకే అతడి భార్య రేణుక మరో వివాహం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. తన భార్యకు ఆరుగురు ప్రేమికులు ఉన్నారని.. ఆ బాధ తనను మానసికంగా వేధిస్తోందని ఫిబ్రవరి 9న సీతారాం సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే భర్త కర్మకాండలు ముగియకముందే రేణుక తన ప్రియుడు రమణారెడ్డిని వివాహం చేసుకుంది. 2026 మార్చిలో వీరిద్దరూ గుట్టుచప్పుడు కాకుండా పెళ్లి చేసుకున్న ఫోటోలు బయటపడటం కలకల రేపుతోంది. ఈ రమణారెడ్డి గతం చూస్తే మరిన్ని షాకింగ్ విషయాలు బయటపడుతున్నాయి. గతంలోనే వీరిద్దరూ ఏకాంతంగా ఉన్న వీడియోను రమణారెడ్డి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఆ వీడియో కుటుంబ సభ్యుల కంటపడటంతో అవమానం భరించలేక అప్పట్లో వీరిద్దరూ ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం కూడా చేశారు. నంద్యాలకు చెందిన రమణారెడ్డి గతంలో షాద్ నగర్‌లో హోటల్ వ్యాపారం నిర్వహించేవాడు. వీడియో వైరల్ వ్యవహారం తర్వాత అక్కడి నుండి మకాం మార్చేశాడు. సీతారాం మరణం వెనుక వీరిద్దరి పాత్ర ఉందన్న ఆరోపణల నేపథ్యంలో.. బాచుపల్లి పోలీసులు రేణుకతో పాటు ఆమె ప్రియుడు రమణారెడ్డిని ఇటీవలే అరెస్ట్ చేశారు.

# పాలమూరులో పలు రహదారులకు ప్రారంభాలు

- వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోడీ
- ప్రధాని పర్యటన వివరాలు వెల్లడించిన డీకే అరుణ



**మహబూబ్‌నగర్, మే1 (జనంసాక్షి) :** నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత తెలంగాణకు తొలిసారి వస్తున్నారని బీజేపీ ఎంపీ డీకే అరుణ తెలిపారు. పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమ్మక్క, సారక్క గిరిజన విశ్వవిద్యాలయం పనులను కూడా ప్రారంభిస్తారని ఎంపీ తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా పాలమూరు జిల్లాలో పలు జాతీయ రహదారుల పనులనూ ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని ఎంపీ అరుణ వెల్లడించారు.మే 10వ తేదీన హైదరాబాద్‌కు ప్రధాని రానున్నట్లు వెల్లడించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొంటారని ఎంపీ అరుణ వెల్లడించారు. ఈ సభకు పార్టీ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాయని ఎంపీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆమె ధ్వజమెత్తారు. బీజేపీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని.. తెలంగాణలో ప్రధాని మోదీ తాజా పర్యటన అందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపైనా ఎంపీ స్పందించారు. ఐదు రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని అరుణ ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ఎంపీ అరుణ ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఆమె ఆగ్రహించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండి కూటమి పార్టీలు వ్యతిరేకించి ద్రోహం చేశాయన్నారు. మరోవైపు వచ్చే ఎన్నికల్లో కల్వకుంట్ల కవిత పార్టీకి ఉనికి ఉండదన్నారు. గతంలో వైఎస్ షర్మిల పార్టీ పెట్టి వేరే పార్టీలో ఎలా విలీనం చేశారో.. కవిత పరిస్థితి అలాగే ఉంటుందన్నారు. తండ్రి పేరుతో రాజకీయ లబ్ది పొందాలని కవిత చూస్తున్నారని ఎంపీ డీకే అరుణ ఆరోపించారు.

# మేడే రోజు కూడా బుద్ధిలేని మాటలేనా?

- సందర్భోచితంగా మాట్లాడడం నేర్చుకో
- కేటీఆర్‌పై అద్దంకి దయాకర్ విమర్శలు



**హైదరాబాద్, మే 1 (జనంసాక్షి) :** మేడే రోజు కేటీఆర్ బుద్ధిలేని మాటలు మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మేడే రోజు కేటీఆర్ బుద్ధిలేని మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సందర్భానుసారంగా మాట్లాడటం కేటీఆర్ నేర్చుకోవాలని హితవుపలికారు. మేడే రోజు కార్మికులు, వారి సంక్షేమం గురించి మాట్లాడాలన్నారు. మూడేళ్లయినా ముఖ్యమంత్రి పని చేయడం లేదని కేటీఆర్ అంటున్నారని.. పదేళ్లు పని చేయని సీఎంను ఏమనాలని ప్రశ్నించారు. కేవలం సీఎంపై విమర్శలతోనే పార్టీని నెట్టుకురావాలని అనుకోవడం దౌర్భాగ్యమన్నారు. కార్మికుల కోసం ఏం చట్టాలు చేశామో కూడా కేటీఆర్‌కు తెలియదన్నారు. గిగ్ వర్కర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసిన విషయం తెలియదా అని దయాకర్ ప్రశ్నించారు. పదేళ్లలో కార్మిక చట్టాలు, సంక్షేమం గురించి మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ ఎలా స్పందించారో అందరికి తెలుసన్నారు. సీఎంపై హాట్ కామెంట్స్‌తో నిరంతరం మీడియాలో ఉండాలన్న తపన తప్పితే కేటీఆర్‌కు ఇంకో పని లేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌కు ఎవరినో ఒకరిని పిలిపించుకుని చిల్లర మల్లర అహంభావపూరిత మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిల్లర మాటల వల్ల బీఆర్ఎస్ గుండు సున్నా స్థాయికి వచ్చిందన్నారు. సీఎంపై, సీఎం కుటుంబంపై మాట్లాడితే ఉపయోగం ఉండదన్నారు. ప్రజా నాయకుడిగా రేవంత్ రెడ్డి ఎదుగుతున్న తీరు నచ్చకే కేటీఆర్ విమర్శలు చేస్తున్నారని అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు.

# ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద అర్ధరాత్రి మమత

## మమత కదలికలపై నిఘా పెట్టామన్న సువేందు



**కోల్‌కతా, మే1 (జనంసాక్షి) :** కోల్‌కతాలోని ఒక ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం రాత్రి నాలుగు గంటల సేపు ఉండటం, తెల్లవారుజామున 12.07 గంటలకు అక్కడి నుంచి వెళ్లిపోవడంపై బీజేపీ నేత సువేందు అధికారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ఫలితాలకు మందు ఎలాంటి అవకతవకలు జరగకుండా ఆమె కదలికలపై తాము నిఘా ఉంచినట్టు చెప్పారు. అనుక్షణం ఆమె కదలికను తమ ఏజెంట్ గమనిస్తూ వచ్చినట్టు చెప్పారు. ఇందుకు సంబంధించి భవానీపూర్ స్ట్రాంగ్ రూమ్‌లో మమతా బెనర్జీ ఉన్న ఫోటోను సోషల్ మీడియాలో ఆయన శుక్రవారంనాడు షేర్ చేశారు. 'ఔట్‌గోయింగ్ సీఎం ఎంత ప్రయత్నించినా నిబంధనలు ఉల్లంఘించకుండా మేము అడ్డుకున్నాం' అని సువేందు పేర్కొన్నారు. భవానీపూర్ నియోజక వర్గం నుంచి మమతాబెనర్జీపై బీజేపీ అభ్యర్థిగా సువేందు అధికారి పోటీ చేశారు. ఖావత్ మెమోరియల్ స్కూలులో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌ను మమతాబెనర్జీ గురువారం రాత్రి సందర్శించడంతో హైడ్రామా చోటుచేసుకుంది. ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతున్నట్టు పలు ఫిర్యాదులు వచ్చినందునే తాను స్వయంగా వచ్చినట్టు మమత చెప్పారు. కేంద్ర బలగాలు తొలుత తనను రానీయలేదన్న ఆమె.. అక్కడే నాలుగు గంటల పాటు ఉన్నారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్ నుంచి బయటకు వస్తూ, ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే ఎలాంటి చర్యలను సహించేది లేదని ఆమె హెచ్చరించారు. ఈవీఎంలు దొంగిలించేందుకు, ఓట్ల లెక్కింపులో అవకతవకలు చేసేందుకు ఎవరు ప్రయత్నించినా జీవన్మరణ పోరాటం చేస్తామని అన్నారు. కాగా, ఉత్తర కోల్‌కతాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను నేతాజీ ఇండోర్ స్టేడియంలో భద్రపరచగా, అక్కడ కూడా టీఎంసీ నేతలు ధర్నాకు దిగారు.



# రైతు ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు

**నిజామాబాద్, మే1 (జనంసాక్షి) :** ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రైతు డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లెలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద పడికాపు కాస్తున్నా ధాన్యం కొనడం లేదని ఆరోపిస్తూ ఎల్లారెడ్డి పల్లి సర్పంచ్ భర్త మఠంల శేఖర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన పోలీసులు అతడిని అడ్డుకున్నారు. కాగా, గ్రామ రైతులు రోడ్డుపై ధాన్యం పోసి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల ఆందోళన భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

# ఉపాధి కూలీలతో కలిసి పని చేసిన సీతక్క



**ములుగు, మే1 (జనంసాక్షి) :** మేడే సందర్భంగా కార్మిక సోదరులందరికీ మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం కేశవపూర్‌లో ఉపాధి హామీ పనుల్లో పలుగు పట్టి కార్మికులతో కలిసి మంత్రి సీతక్క పనులు చేశారు. అనంతరం కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని ఉదయం 10 గంటల వరకు పనులు ముగించుకొని ఇళ్లకు తిరిగి వెళ్లాలని కూలీలకు మంత్రి సీతక్క సూచించారు.

# గవర్నర్‌ను కలిసిన నీసా డైరెక్టర్, ఎంపీ





**హైదరాబాద్ (జనంసాక్షి) :** నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (నీసా) డైరెక్టర్ అండ్ ఐజీ హర్‌ప్రీత్ కౌర్ సోహి శుక్రవారం గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్ కుమార్ యాదవ్ గవర్నర్‌ను లోక్ భవన్‌లో కలిశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370